సంవత్సర చందా
రు 12-0-0
విడిప్రతిక 4 అ


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

సంపుటము 40
సంచిక 14
7-12-55

Founder : K. NAGESWARA RAO


మన్మథ కార్తిక బహుళ నవమి బుధవారం



భాక్రా డామును సందర్శిస్తున్న బుల్గానిన్ బృందం. ప్రాజెక్టు అద్భుతంగా ఉందని, ఒకవేళ యుద్ధంవచ్చినా ప్రమాదంలేనిచోట కడుతున్నారని బుల్గానిన్, క్రుశ్చేవ్ మెచ్చుకున్నారు.

విషయానుక్రమణిక

ముఖచిత్రం : హిందీ నటి నర్గీస్.



బొంబాయి విమానాశ్రయంలో బుల్గానిన్, క్రశ్చేవ్ లకు బొంబాయి మేయరు కుమార్తెలు పూలమాలలు వేసి, కుంకుమ పెట్టారు. (దిగువ చిత్రం) బొంబాయిలో బుల్గానిన్, క్రుశ్చేవ్ లకు పౌరసన్మానం జరిగిన సందర్భంలో ముఖ్యమంత్రి మురార్జీ దేశాయ్, బుల్గానిన్, మేయరు పూపల, క్రుశ్చేవ్.



డిటెక్టివ్ సీరియల్

అపూర్వ హంతకులు

మూలం: ఎడ్గార్ వాలెస్. ★ అనువాదం: "వినాయక"

1

పత్రికలోపడిన వృత్తాంతం

"విదేశశాఖ మంత్రిని చంపివేస్తామని బెదిరిస్తూ చాలా ఉత్తరాలు వస్తున్నాయి. దీనికి మంత్రి చాలా చిరాకుపడుతున్నారు. ఈ ఉత్తరాలు వ్రాసేవారి జాడ తెలియజేసి, వారిని పట్టుకోడానికి కావలసిన ఆచూకీ తెలియజేసినవారికి 50 పౌనులు బహుమానం!"

అని ఆగస్టు 14-వ తేదీనాడు లండనులో పెద్దమనుషులుమాత్రమే చదివే ఒక వార్తాపత్రికలో అంతగా ఎవరు చదవని ఆఖరు పేజీలో చిట్టచివరిభాగంలో ఒకచిన్న ప్రకటన పడింది!

ఈపత్రిక చదివే బహుతక్కువ మంది జనాభాలో - కొంతమంది పెద్దమనుషులు ఆనాటి సాయంకాలం ఒక క్లబ్బులో కూర్చుని దీన్ని గురించి గభీరంగా ఆలోచించారు. వారంతా అసలు మంత్రిపుంగవులంతవారికే విషయాన్ని గురించైనా ఇటువంటి చిరాకు కలగడమే ఆశ్చర్యంగా ఉన్నదని అనుకున్నారు. ఒకవేళ అలాటి చిరాకు కలిగినా అది ప్రకటించడం అంతకన్నా విడ్డూరంగా ఉన్నదే! అన్నారు కొందరు. ప్రకటించినా ఈమాత్రం చిన్న బహుమతివల్ల ఈ వ్యవహారం ఇంతటితో ఆగుతుందా అని చివరికి చప్పరించేశారు మరికొందరు.

అంతగా పెద్దమనిషితరహా లేకపోయినా అనన్యసాధారణప్రచారంకలిగిన దినపత్రికల వార్తాసంపాదకులు కొంతమంది విసుగ్గా ఈ పత్రికపుటలు అటూఇటూ తిరగవేస్తూ ఈ ప్రకటన కొంచెం మురుగ్గా చదివారు. వారిలో 'తోకచుక్క' వార్తాసంపాదకుడా ప్రకటన వెంటనే పెద్దకత్తెరతో కత్తిరించి, ఆ వార్తకు "మంత్రివర్యులకు ఉత్తరం వ్రాసినవారెవరు?" అని శీర్షిక తగిలించాడు. తరవాత కొంచెం లోతుగా ఆలోచించాడు. 'తోకచుక్క' ప్రభుత్వ ప్రతిపక్షానికి చెందిన పత్రిక. అందుచేత - ప్రభుత్వం సాగించే అదరాబాదరా వ్యవహారాలన్నీ జాగ్రత్తగా పరిశీలిస్తున్న ప్రజానీకానికి ప్రభుత్వంఅంటే బాగా అసహ్యం బయలుదేరిందనీ, అందువల్లనే ఇలాంటి అఘాయిత్యం ఉత్తరాలు వస్తున్నాయనీ ఒక పేరాగ్రాఫ్ ఆ వార్తకు ప్రాణప్రతిష్ఠ చేశాడు! ఇక 'సాయంకాల ప్రపంచం' వార్తాసంపాదకుడు అతి జాగ్రత్తగా ఆ ప్రకటన రెండుమూడుసార్లు పఠించాడు. ఈయన తలంతా ముగ్గుబుట్టలా నెరిసిపోయింది లెండి! ప్రకటన బహుజాగ్రత్తగా చదివిన అనంతరం అది తిరిగి ఎంతో జాగ్రత్తగా కత్తిరించాడు! తరవాత ఆ ప్రకటన మళ్ళీ ఇంకొకసారి పఠించాడు. అనంతరం అది ఒక చోట భద్రపరిచాడు. కాని వెంటనే ఆ విషయం అంతా పూర్తిగా విస్మరించాడు!

ఇంక వేడివేడిగా అమ్ముడుపోయే 'బాకా' వార్తాసంపాదకుడా ప్రకటన చదువుతూనే అది కత్తిరించేశాడు. తంగని గంటకొట్టి రిపోర్టర్ని సముఖానికి పిలిచాడు. రిపోర్టర్ గదిలోకి రాగానే చకచకా ఫర్మానాలు జారీచేశాడు!

"వెంటనే మంత్రి భవంతికి వెళ్ళిపో! ఎలాగో అలాగ ఆయన్ని పట్టుకుని, దీనికి సంబంధించిన వివరాలన్నీ జాగ్రత్తచెయ్యి! వీలయితే ఆ ఉత్తరాలనకళ్ళు సంపాయించు! ఒకవేళ మంత్రి దర్శనం కాకపోతే వారి కార్యదర్శిని పట్టుకోవాలి!" ఈ మాటలు వింటూనే రిపోర్టర్ ఒక్క అంగలో వీధులో పడ్డాడు!

ఇంకో గంటలోను ఉత్సాహంతో ఉరకలు వేసుకుంటూ తిరిగివచ్చి వార్తాసంపాదకునికి తాను తెలుసుకున్న వివరాలన్నీ నివేదించాడు. ఆయన వెంటనే ప్రధాన సంపాదకుల కవి అందజేశాడు. ఘనత వహించిన ప్రధాన సంపాదకులందంతా సావధా

> **సవరణ**
>
> గతవారం ప్రారంభమైన డిటెక్టివ్ సీరియల్ పేరు "అపూర్వ హంతకులు" అని ఉండడానికిబదులు "నలుగురుహంతకులు" అని అచ్చుపడింది. పాఠకులు ఈ సవరణ గమనింప ప్రార్థితులు.

> **జరిగిన కథ:-**
>
> స్పెయిన్‌లో అలజడి జరుగుతున్న రోజుల్లో విప్లవ సారథులు ఇంగ్లాండ్‌లో మకాంవేశారు. వాళ్ళని వెళ్ళగొట్టడం కోసం ఆ దేశపుమంత్రి ఒక చట్టం తేదలచాడు. ఆ మంత్రిని గుట్టుచప్పుడుకాకుండా అంతంచేస్తే, ఆ చట్టం నేలమట్టం కావచ్చును.
>
> న్యాయ పరిరక్షణభారం భుజస్కంధాలమీద వేసుకున్న ముగ్గురు పెద్దమనుషులు ఇందుకు కంకణంకట్టారు. హత్యలకు వెనుదీయని 'థేరీ'ని, ఈ న్యాయ సంరక్షకత్రయం నయానా భయానా నచ్చచెప్పి తమతో చేర్చుకున్నారు.

శంగా న్నవారై, "భేష్! భేష్!" అన్నారు. ఇలా అన్నారంటే అది చాలా గొప్ప మెప్పన్నమాట!

ఇంత గొప్ప మెప్పు రావడానికి కారణమేమిటో కనుక్కోవాలంటే ఆ మర్నాడు 'బాకా'లో పెట్టిన ఈ శీర్షికలు చూస్తే ఇట్టే తెలిసిపోతుంది!

మంత్రికి మహాప్రమాదం!
విదేశ శాఖామాత్యుని హత్య
చేస్తామని బెదిరింపు!
నలుగురు పెద్దమనుషులు!
విదేశీయ బహిష్కార చట్టం
ఆపివెయ్యాలని పన్నాగం!
అద్భుత రహస్యాల వెల్లడింపు!

ఇంతేగాక ఒక జాతీయదిన పత్రికలో పడిన ఈ క్రింది పేరా మూలంగా కూడా పత్రికా ప్రపంచంలో కొంచెం సంచలనం బయలుదేరింది. "కొన్నాళ్లనించీ విదేశశాఖామాత్యుడు సర్ ఫిలిఫ్ రేమన్‌కు కొన్ని బెదిరింపు ఉత్తరాలు వస్తున్నాయి. ఇవన్నీ ఒకే వ్యక్తి రాసినట్టున్నాయి. ఈ ఉత్తరాలు తేలిగ్గా కొట్టి వెయ్యడానికి వీల్లేదు. ఇవి వ్రాసిన మనిషి కాక మరి ఎవరైనా వీటి కాపీ బయటపెట్టి, రాసిన ఆసామీని పట్టుకోడానికి సాయపడితే, వారికి 50 పౌనుల బహుమతీ ఇస్తాము."

సామాన్యంగా ప్రతి మంత్రికీ అడపాదడపా ఇలాంటి ఉత్తరాలు వస్తూనే ఉంటాయి. కనక ఈ ప్రకటన చాలా విడ్డూరంగా కనబడింది. ఇందుచేతనే బాకా పత్రిక ఈ ప్రకటనలోగల అంతర్యం తెలుసుకోవాలని ప్రయత్నంచేసింది.

వెంటనే ఈ పత్రికా ప్రతినిధి సర్ ఫిలిఫ్ రేమన్ దర్శనానికి వెళ్ళాడు. వెళ్ళగానే మంత్రి దర్శనం దొరికింది.

"బాకా" దీనికి సంబంధించిన వ్యవహారం అంతా ఆ సాయంత్రమే ప్రకటించి వేసింది.

"ప్రత్యేకంగా మా ప్రతినిధితో ప్రసంగిస్తూ సర్ ఫిలిప్ రేమన్ ఈ ఉత్తరాల విషయంలో ఇలాగ వ్యాఖ్యానించారు.

"ఈవిధంగా ఇది ప్రకటించడం చాలా అపూర్వవిషయమే. అయితే మంత్రివర్గంతో సంప్రతించి, వారి అంగీకారంతోనే ఈచర్య తీసుకోవడం జరిగింది. ఈ ఉత్తరాలలో ఏదో పెద్దప్రమాదం ఉన్నట్టే కనబడుతూంది. పోలీసులు దీన్నిగురించి

(8-వ పేజీ చూడండి)

సూక్తులూ, ఛలోక్తులూ

సోవియెట్ కమ్యూనిస్టుపార్టీ ప్రథమ కార్యదర్శి నికితా కృష్చేవ్ మంచి హాస్యప్రియుడు గా కనిపిస్తాడు. ఈయన మనదేశం వచ్చినప్పటినుంచీ అందరినీ నవ్వించడమే పనిగా పెట్టుకున్నారు.

హిమాలయాలలోని టెరాయ్ వద్ద ఉన్న యు. పి. ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రం దర్శించడానికి వెళ్లినప్పుడు క్రుష్చేవ్ అక్కడ కనిపించిన రెండు కోళ్ళను చేతులోకి తీసుకున్నారు. ఆ దృశ్యాన్ని ఒక అమెరికన్ ఫొటోగ్రాఫరు ఫొటో తీశాడు. క్రుష్చేవ్ అతనితో ఇలా అన్నారు: "ఫొటో తీస్తే తీశావుగాని, క్రుష్చేవ్ కోళ్ళను పీక నులిమి చంపేస్తున్నాడని మాత్రం ఫొటోకింద రాయబోకు, నీ పుణ్యం ఉంటుంది."

* * *

పెప్సూ రాజప్రముఖ్ క్రుష్చేవ్‌కు 288 ఏళ్ళ క్రిందటి ఖడ్గాన్ని బహూకరించారు. అది తీసుకుంటూ క్రుష్చేవ్ "మా సోవియెట్ సేనాధిపతులు ఈ ఖడ్గంచూస్తే మామీద అసూయ పడతారు. ఇంత అందమైన ఆయుధంచూస్తే ఏ సైనికుడికి కళ్లుకుట్టవు?" అన్నారు.

* * *

బుల్గానిన్ ఏనుగుమీదెక్కి సవారీ చేస్తుండగా క్రుష్చేవ్: "ఏనుగు అందమైన జంతువే. కాని అది ట్రాక్టర్ అంత ఉపయోగకరమూ కాదు, అంత చెప్పినమాట వినేదీ కాదు."

* * *

ఢిల్లీలో నేషనల్ ఫిజికల్ లాబొరేటరీచూసి: "మీరు ఇక్కడ చేస్తున్న పనికి విలువకట్టే అర్హత మాకులేదు. మాకు తెలిసిందల్లా రాజకీయాలొక్కటే."

* * *

బొంబాయి ముఖ్యమంత్రి మురార్జీ దేశాయితో: "బొంబాయిలో మద్య నిషేధం ఉందని తెలిసి ఇక్కడ దిగేముందు విమానంలోనే కాస్త పుచ్చుకున్నాను. అయినా ఈ ఉష్ణప్రదేశంలో ఈ టొమాటో రసంలాంటి చల్లని పానీయాలే బావుంటాయి."

హాస్యమాడి. "మీకు వోడ్కా, కావియర్ ఉన్నాయిగా?"

క్రుష్చేవ్: "మీకు అవంటే ఇష్టమని తెలిస్తే చొక్కాలో దాచి తెచ్చేవాణ్ణే!"

* * *

తాజ్‌మహల్ చూసి: "తాజ్‌ను చూస్తుంటే నాకు రెండురకాలభావాలు కలుగుతున్నాయి. ఒకటి, మానవుడు మహత్తర సృష్టికర్త. భారతీయకళకు, సంస్కృతికి తాజ్ చిహ్నం. ప్రతి భారతీయునికి అది గర్వకారణం. రెండోది, పూర్వపురాజులు తమ పేరు శాశ్వతంగా ఉండాలని ఇలాంటి స్మృతిచిహ్నాలమీద డబ్బు ఖర్చుపెట్టేవారు. కాని తాజ్‌మహల్ నిర్మాణపు కీర్తి సామాన్యమానవులదే కాని రాజులది కాదు."

ఆగ్రా కోటలో స్నానాలగది చూసి ఇది ఏమైఉంటుందా అని బుల్గానిన్ ప్రభృతులు ఆలోచిస్తుండగా క్రుష్చేవ్: "చక్రవర్తి అక్కడ కూర్చుని అసంఖ్యాక సేవక పరివేష్టితుడై బాల్చీలకొద్దీ పన్నీరు నెత్తిమీద గుమ్మరించుకునేవాడన్నమాట."

* * *

బెంగుళూరులో తమకు అదేపనిగా పూలదండలు వేస్తూండగా: "మా దేశంలో ఇనపతెర ఉందని కొందరు అంటూ ఉంటారు. దాని సంగతి అలా ఉంచి మీ దేశంలోమాత్రం పువ్వుల తెర ఉన్నది."

* * *


కోయంబత్తూరు వెళ్ళినప్పుడు పోక చెక్కల కార్మికులు చెట్లమీదికి అతి నేర్పుగా, వేగంగా ఎగబ్రాకడం చూసి బుల్గానిన్‌ను క్రుష్చేవ్ అడిగారు: "వాళ్లంతగబగబా మీ రెక్కగలరా?"

బుల్గానిన్: "కమ్యూనిస్టుపార్టీ నాయకులు మీరు. మీరు ముందు చేసిచూపిస్తే బావుంటుంది."

క్రుష్చేవ్: "అహాహ అలా కాదు. మంత్రిమండలి అధ్యక్షులు మీరు. మీరు దోవ తీయాలి. నేను అనుసరించాలి."



శ్రీ కేతిసీడి భాస్కరరావు (విజయనగరం) చిత్రాలు : సాముద్రికం.





సహచరులు

అపూర్వ హంతకులు (5-వ పేజీ తరువాయి)

కొంతకాలంనించి దర్యాప్తు సాగిస్తున్నారని మాత్రమే చెప్పగలను."

తరవాత రేమన్ ఒక ఉత్తరంతీసి మా ప్రతినిధికి చూపించారు. అది వెంటనే ప్రకటించడానికి అనుమతించారు కూడా. ఈ ఉత్తరాలదస్తూరీ చాలావరకు ఆడవాళ్లు రాసినట్లే ఉంది. స్పెయిన్ మొదలైనదేశాల వారిదస్తూరీ ఇలాగే ఉంటుంది. అయినా రాసినవారెవరో గాని మహాచక్కని ఇంగ్లీషు రాశారు. ఆ ఉత్తరం నకలు ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

"మంత్రిమహాశయా! మీరు పార్లమెంటులో ఒక చట్టం ఆమోదింపజెయ్యాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు! ఇది చాలా అన్యాయం. ప్రస్తుతం కొంతమంది తమదేశంలో రాక్షసపరిపాలన భరించలేక ఇంగ్లండులో తలదాచుకొంటున్నారు. మీ శాసనం చట్టంఅయితే వెంటనే ఇంగ్లండులో ఉన్న వారినందరినీ పట్టుకొని ఆ రాక్షస ప్రభుత్వాని కప్పజెప్పేస్తారు.

అయితే ఇంగ్లండులోకూడా ఈచట్టాన్ని గురించి తీవ్రమైన అభిప్రాయభేదాలు చెలరేగుతున్నాయని మాకు తెలుసును. ఈ విదేశీయ బహిష్కారచట్టం ఒక్క మీఒక్కరి మాట పలుకుబడిమీదనే చట్టం కాగలదని కూడా మాకు తెలిసింది.

ఇంగువల్ల ఇది చట్టం అయినట్టయితే వెంటనే మిమ్మల్ని పరలోకానికి పంపించవలసివస్తుందని తెలుపుడు చెయ్యడానికి చాలా కిందపడుతున్నాము. ఇంకెవరిచట్టం ఆమోదింపజెయ్యాలని పట్టుపట్టినా వారిగతీ ఇంతే!

సం. నలుగురు ధర్మరక్షకులు.

సర్ రేమన్ ఈ చట్టాన్నిగురించి ప్రస్తావిస్తూ ఇలాగ చెప్పారు:

"ఈ శాసనం విదేశీయ బహిష్కరణచట్టమే! ప్రతిపక్షం లేనిపోని పన్నాగాలు పన్నడంవల్ల ఇది ఇలాగ పడిఉందిగాని లేకపోతే ఈపాటికిది చట్టం కావలసిందే!

స్పెయిన్‌లో బయలుదేరిన అలజడి మూలంగా ఈశాసనం వెంటనే ప్రవేశపెట్టవలసిన అవసరం ఏర్పడింది. ఐరోపా అంతటా యుద్ధాగ్ని జ్వాల లేకెత్తించగల హంతకులు కొంతమంది విప్లవప్రచారం సాగిస్తూ మనదేశాలకన్నిటికీ పెద్దముప్పు తీసుకువస్తున్నారు! ఇంగ్లండుగాని, ఇంకొకదేశంగాని వీరిని దేశంలో కాలూననివ్వడం-- దేశం క్షేమం దృష్ట్యా —— ఎంతమాత్రము మంచిదికాదు! మిగతా ఐరోపా దేశాల్లో కూడా - వెంటనే దీనితోబాటే - ఇలాంటి చట్టాలమలులోనికి వచ్చేస్తున్నాయి."

"ఈ ఉత్తరాలు కింత ప్రాముఖ్యం ఇవ్వడం ఎందుకు?" అన్నాడు 'బాకా' ప్రతినిధి.

రేమన్ ఇలాగ సమాధానం చెప్పారు:

"మిగతా దేశాల్లోను, మనదేశంలోను పోలీసులంతా ఈ పెద్దమనుషులు నలుగురు చెప్పినదంతా చేసేతీరతారని అంటున్నారు. సమస్త దేశాల వారికీ వీరి సంగతి తెలుసును. వ్యక్తిగతంగా ఈ పెద్దమనుషులెవరో ఇప్పుడు తేలిపోవాలి. ప్రస్తుతం ప్రపంచంలో తిన్నగా న్యాయం జరగడం లేదని ఈ నలుగురు న్యాయశాసనాల మరమ్మత్తు మొదలుపెట్టారు!

సెర్వియా రాజహంతకుల నాయకుణ్ణి సంహరించినవాళ్లీ పెద్దమనుషులే! ఫ్రెంచి సైన్యం కంట్రాక్టర్ని చంపివేసిందీ వీళ్ళే! ఈహత్య వందమంది పోలీసుల కళ్లయెదుటే జరిగింది!

ఇల్లాగే యువకుల నందరినీ చెడుదారులు తొక్కిస్తున్నాడని పాపం ఒక తత్వవేత్తను కూడా చంపేశారు."

తరవాత మంత్రి మా ప్రతినిధి కాహంతకుల దుర్మార్గాల జాబితా ఒకటి చేతికందించారు.

ఈనాటిదాకా పాఠకులకీ నలుగురు చేసిన దారుణాల వివరాలన్నీ బాగా జ్ఞాపకం ఉండవచ్చును. కాని ఆయా దేశాల పోలీసు లీనలుగురు హంతకులు చేసిన హత్యలలోతుపాకులన్నీ అతి రహస్యంగా అట్టే పెట్టారు. ఇందుచేత ఒక దుర్మార్గానికీ, మరో దుర్మార్గానికీగల సంబంధం ఈనాటిదాక ఎవరికీ అంతు చిక్కలేదు. ఒకవేళ వివరాలన్నీ బయట పెట్టినా ఇప్పుడు ప్రకటించే ఈ విశేషాలు మాస్తేతప్ప ఎవరికీ ఈ దుష్ట చతుష్టయాన్ని గురించి ఏమీ తెలిసేది కాదని నిస్సందేహంగా చెప్పవచ్చును!

బాకా పత్రిక కీహంతకులు చేసిన 16 దారుణ హత్యల వివరాలు పూర్తిగా ప్రకటించే అదృష్టం పట్టింది.

"రెండేళ్ళ కిందట ఈ నలుగురు ఘాతుకులు కలిసి ఫ్రాన్సులో ఒక పెద్ద ఉద్యోగిని హత్య చేశారు. ఆ సమయంలో వాళ్లెవరికీ దొరక్కుండా చాలా జాగ్రత్త పడ్డారు గాని, అదృష్టవశాత్తు ఆ నలుగురిలో ఒకడు అపరాధ పరిశోధకునికంట పడ్డాడు. హంతకుడా పెద్ద ఉద్యోగి ఇంటిచుట్టూ ఉన్న తోటంలోనుంచి తప్పించుకుని పారిపోతూంటే అపరాధ పరిశోధకుడతని వెంట పడ్డాడు. హంతకుడు తప్పించుకుపోయినా అతన్ని పట్టుకోడానికని గట్టిగా పోలీసు నిఘా ఏర్పాటు చేశారు. అతడీ సంగతి పసిగట్టి తప్పించుకు పోవడానికి ప్రయత్నించాడు. కాని చివరికతన్ని ఒక హోటల్లో అటకాయించారు. పట్టుకోడానికి దొరక్కపోతే కాల్చి చంపేశారు. ఆ గలభాలో ముగ్గురు సార్జెంటులు ఇద్దరు పోలీసులు చనిపోయారు. శవం ఫోటోతీసి యూరపు దేశాల కన్నిటికీ పంపించారు. కాని "ఈనాటికీ ఆ హంతకుడెవడో, ఏ దేశస్థుడో ఏమీ తెలియలేదు!"

"అయితే ఇంకా ఆ హంతకులు నలుగురు ఉన్నట్లేనా?"

రేమన్ బుజాలెగరవేసి ఇలాగన్నాడు: "వాళ్ళింకొకణ్ణెవణ్ణైనా తమలో జేర్చుకుని ఉండాలి లేకపోతే ముగ్గురేపని చేస్తున్నారో! తిన్నగా తెలియడంలేదు...... ఇది నా కొక్కడికే సంబంధించిన వ్యవహారంఅని మాట్లాడకూరుకోడానికి వీలులేదు. వీళ్ల ఇష్ట ప్రకారం నడుచుకోకపోతే ఎవళ్ళగతైనా ఇంతే! అందుకనే నేనీ సంగతులన్నీ బయట పెడుతున్నాను."

"మరొక సంగతి. ఇవన్నీ జనానికందరికీ తెలిస్తే శాంతి భద్రతల సంరక్షణకు గట్టి బందోబస్తు ఏర్పాటు చెయ్యడానికి వీలవుతుంది. అధికారులు, ప్రజలు సహకరిస్తే ఇకముందిలాంటి అఘాయిత్యాలు జరగకుండా జాగ్రత్త పడవచ్చును."

స్కాట్లండ్ పోలీసు కార్యాలయంలో ఈవిషయంలో దర్యాప్తు జరిపితే—యూరప్‌లో పోలీసులశాఖల కన్నిటికీ ఈసంగతులు తెలియజేశారని మాత్రమే సమాధానం వచ్చింది. అంతకన్న వేరే విశేషాలేమీ తెలియలేదు.

ఈ హంతక చతుష్టయంచేసిన ఘాతుకకృత్యాల జాబితా ఈదిగువ ఉదాహరిస్తున్నాము. దీనితోబాటు దొరికినంతవరకు పోలీసులు జాగ్రత్తచేసిన వివరాలు కూడా ఉదాహరిస్తున్నాము."

1 థామస్ కల్లర్ అని ఒకదర్జీ వాడుండేవాడు. అతడు చాలామంది స్త్రీలనేర్పాటుచేసి వారిచేత కుట్టుపనులు చేయిస్తూ బాగా లాభాలు గడించేవాడు. దర్జీ చనిపోయిన పరిస్థితులు చాలా అనుమానాస్పదంగా ఉన్నాయి. శవపంచా

యితేదారులిది చెయ్యాలని చేసిన 'హత్యే' అని నిర్ధారణచేశారు.

ఈ కేసులో పోలీసులు దర్యాప్తు చెయ్యగా తెలిసినవివరాలివి: థామస్ కట్లర్ కూలీల చేత చాకిరీ పని చేయించేవాడు. ఫాక్టరీ చట్టాలప్రకారం రెండు మూడుసారులు శిక్షలనుభవించాడు. ఇంతేగాక తన దగ్గిర పనిచేసే స్త్రీలనుకూడా అనేకవిధాలుగా బాధించి ఉండవచ్చుననీ ఈహత్యకు ఇదికూడా కొంతవరకు కారణం కావచ్చుననీ తేలింది.

2 బెల్జియమ్‌లో ఇంకొకహత్య జరిగింది. ఈవ్యక్తి చాలా డబ్బున్నవాడు. పాట కచ్చేరికి వెళ్ళి తిరిగివస్తూంటే మధ్య దోవలో హఠాత్తుగా హత్యజరిగింది. ఇతని పేరు ఎల్లర్‌మాన్. దర్యాప్తు జరిపినమీదట చాలా దుర్మార్గుడనీ, వ్యాపారంలో రెండు మూడులక్షలదాకా కాజేశాడనీ బయటపడింది.

3 కెంటకీ రాష్ట్రంలో ఆండర్సన్ అనే వ్యక్తి గదిలో నిద్రపోతూ ఉండగా ఎవరో గొంతు నులిమి చంపేశారు. ఇతని మీద మూడు సారులు హత్యాపరాధాలు మోపారు. ఒక పెద్ద ముఠాకంతటికీ నాయకుడు. ఇతనిముఠాకు, ఇంకొక ముఠాకు జరిగిన కొట్లాటలో ప్రత్యర్థి పక్షంలో 7 గురిని చంపేశాడు.

మూడు నేరాల విచారణలలోను ఇతడు నిరపరాధేనని తీర్పు ఇచ్చారు. మూడోసారి ఇతడొక పత్రికా సంపాదకుణ్ణి చంపేశాడని నేరం మోపారు. విచారణ జరిపి ముద్దాయి దోషి కాదని తీర్పు ఇచ్చారు. వెంటనే ఇతడు జ్యూరీల నభినందిస్తూ కరచాలనం చేశాడు!

4. ప్యాట్రిక్ వెల్చ్ ప్రజల ధనం అపహరించడంలో అందెవేసిన చెయ్యి! కొంతకాలం న్యూయార్క్ పురపాలక సంఘానికి కోశాధికారి. చాలా కంట్రాక్టులలో డబ్బు కాజేశాడు. ఒక న్యూయార్క్ పత్రిక ఇతని వ్యవహారాలన్నీ బయటపెట్టింది. దానితో ఇతడు ఇంటివెనక తోటలో ఉరి పోసుకు చచ్చిపోయాడని అది ఆత్మహత్యే అని అనుకున్నారు.

5. పారిస్‌లో మదాం డెస్పార్ విషవాయువువల్ల ఊపిరాడక చచ్చిపోయింది. కొంత ఆచోకీ దొరికినదాకా ఇది ఆత్మహత్యే అనుకున్నారు. ఈమె చెయ్యని దుష్కృత్యమంటూ లేదు!

6. 1902 లో పారిస్‌లో తంతి తపాలా శాఖమంత్రి నెవరో పిస్తోలుతో కాల్చి చంపేశారు. గుర్రపు బగ్గీలో షికారు వెళ్ళే సమయంలో ఈ దారుణం జరిగింది. బగ్గీ తోలేవాణ్ణి పట్టుకున్నారు గాని, తరవాత ఏ పాపమూ ఎరగడని విడిచిపెట్టేశారు. పిస్తోలు కాల్చిన చప్పుడే వినబడలేదని ఇతడు సాక్ష్యం ఇచ్చాడు. ఆ సమయంలో జోరుగా వర్షం కురుస్తూంది. కనుచూపు మేరలో ఎవరూ ఆప్రాంతంలో లేరు."

తరవాత మిగిలిన హత్యల వృత్తాంతాలు కూడా ప్రకటించారు.

* * *

నిజంగా ఇదంతా చాలా గొప్పవిషయం! ప్రధానసంపాదకుడిది రెండుమూడుసారులు చదివి "మహాభేషుగ్గా ఉందే!" అనుకున్నాడు.

రిపోర్టర్ అదంతా మళ్ళీ ఒకసారి చదువుకున్నాడు. తాను ఘన సాధించిన కార్యం తలుకొని ఒక్కసారిగా ఎగిరి గంతేశాడు!

విదేశశాఖమంత్రి సుఖంగా శయ్యపై పవ్వళించి, మధ్యమధ్యన వేడివేడి కాఫీతో గొంతుక తడుపుకుంటూ ఈవార్త పూర్తిగా చదువుకున్నాడు. "చెప్పవలసినదానికంటె అనవసరంగా ఎక్కువ చెప్పానా?" అని కొంచెం కించపడ్డాడు.

ఫ్రాన్సులో పోలీసు శాఖాధికారి ఇదంతా ఒక ప్రముఖ దినపత్రికలో చదువుకుని "ఈ ఆంగ్లమంత్రి నేను వేసుకున్న కార్యక్రమంఅంతా ధ్వంసంచేశాడే!" అని గట్టిగా చిరాకుపడ్డాడు.

ఇక మాడ్రిడ్ నగరంలో హంతకులు నలుగురు సుఖంగా ఒకహోటల్లో కూర్చున్నారు. మాన్‌ఫ్రెడ్ వటకారంగా వికిలి నవ్వు నవ్వుతూ ఈ పత్రికలోపడినదంతా మిగిలిన ముగ్గురికీ చదివి వినిపించాడు. అందులో ఇద్దరికథలో మజా అంతా అనుభవించారు! మూడో ఆసామీ ముఖం వెలవెలబోయింది. కళ్ళల్లో మృత్యుభయం తాండవించింది!


(ఇంకా ఉంది)

BY 1702

మీ క్రొత్త చొక్కాలకు ప్రఖ్యాతి గాంచిన

కాట్స్‌వాల్

కొనండి
ఇది మెత్తగా, సౌఖ్యముగా ఉంది.
దేహమునకు గాలి ఆడేలా
ఉంచుతుంది.



ఈసారి మీరు క్రొత్త చొక్కాలు కుట్టించు కొనునపుడు ఆకర్షణీయమైన కాట్స్‌వాల్ ఎన్నుకొనండి. కాట్స్‌వాల్ తేలికగా వుండే బట్ట ఇది ఊలు మరియు నూలుల సరియైన మిశ్రమములో తయారైనది.

కాట్స్‌వాల్ దేహమునకు గాలి ఆడేలా ఉంచుతుంది. కనుక మీకు చిరాకు కలిగించేటంత వేడిగా ఎన్నడూ ఉండదు. ఈ ఆకర్షణీయమైన కాట్స్‌వాల్ చాల కాలము మన్నుతుంది. మరియు క్రుంగకుండా ఉంటుందని హామీ కలదు. ఇది క్రుంగుతే దీనికి బదులుగా బట్ట యివ్వబడుతుంది.

కాట్స్‌వాల్ అనేక దివ్యమైన అద్దకములు మరియు రంగులలో దొరకుతుంది — మీ బట్టల వర్తకుని వద్దకు వెళ్లి నేడే చూడండి!

బిన్నీ కాట్స్‌వాల్ అన్ని శీతోష్ణ స్థితులలోను వాడుటకు అనువుగా ఉంటుంది

ఏక రంగు రకములు 29/30"
ఒక గజమునకు రు. 3/10
ఇజారు చారలు 29/30"
ఒక గజమునకు రు. 3/10
ఏక రంగు రకములు 35/36"
ఒక గజమునకు రు. 4/5
అద్దకములు 29/30"
ఒక గజమునకు రు. 4/4
చెక్కు గుడ్డలు 29/30"
ఒక గజమునకు రు. 4/1

అమ్మకపు పన్ను అదనము

ఇంకా వెచ్చని దుస్తులకు — బిన్నీ అంగోలా కొనండి

ఈ నాణ్యమైన ఊలు, నూలు కలిపి దట్టముగా నేసిన బట్ట చల్లని శీతోష్ణస్థితిగల ప్రదేశములు, పర్వత ఆశ్రయములకు తగినది చొక్కాలకు స్త్రీల దుస్తులకు, మరియు ఇజారులకు అందమైన రకములలో ఏక రంగులో దొరకుతుంది.

బెంగుళూర్ వులెన్, కాటన్ & సిల్కు మిల్స్ కంపెనీ లిమిటెడ్

ఏజెంట్స్, సెక్రటరీస్ & ట్రెజరర్స్: బిన్నీ అండ్ కంపెనీ (మద్రాసు) లిమిటెడ్

భారతీయ పరిశ్రమల ప్రదర్శనము, న్యూఢిల్లీ.
అక్టోబరు 30—డిసెంబరు 15. మిల్లు యజమానుల సంఘ మండపము స్టాల్ నెం. B. 70 ను సందర్శించండి.

చిత్రమాలిక

పంతులు–శాస్త్రి

పునర్దర్శనం

"అన్నయ్యా! నువ్వు మరివెళ్లు. నీకు ఆఫీసుకి వేళయిపోతున్నాది. అక్కడికి వెళ్ళగానే రేపే మీ బావగారి చేతి క్షేమంగా చేరుకొన్నట్టు ఉత్తరం రాయిస్తాను."

"అలాగే మరిచిపోకుండా ఉత్తరం రాయించు; నేను చెప్పిన పుస్తకాల మాట కూడా ఆయనతో చెప్పి, ఏమాత్రంవీలున్నా పంపించేయేర్పాటు చెయ్యి! మరి వస్తాను నేను - బాబూ! చిట్టీ! రమణా! మీఊళ్లెళ్లిపోతున్నారుకదూ, మళ్లీ దసరాలకి రావాలి సుమండీ."

"అలాగే వస్తాం మామయ్యా! నువ్వు యీమారు మావూరు తప్పకుండా రావాలి."

"అమ్మయ్య! ప్రాణాలుకుదుటపడ్డాయి. ఇవాళ ఎంతమాత్రం రైలందుతుం దనుకోలేదు. ఏదో అదృష్టవశాత్తు మాకోసమే అన్నట్టుగా అరగంట లేటయింది. అయినా చిన్నప్పటినుండి చూస్తున్నాను, రైలు ఎక్కబోయేసరికల్లా "ఈ బండిలో ఖాళీ లేదు, ముందుదంతా ఖాళీ, అటువెళ్ళండనే వాళ్ళేతప్ప, ఈలాగ "రండి, కూర్చోండి" అనేవాళ్ళే కనబళ్ళేదు. ఎలాగో రైలందితే చాలు, నిలబడి అయినా వెళ్ళిపోవాలనుకున్నాము.

"మంచిపనే, పిల్లలతో ఎంతకని నిలబడి ప్రయాణం చెయ్యగలరు? ఎక్కడివరకూ వెళ్తారు?"

"రాజమండ్రీ-అంటే గోదావరి స్టేషనుకి దగ్గర మాయిల్లు - అక్కడ దిగుతాము. మీరెంతవరకూ?"

"నేనా? నేను బెజవాడలో దిగి గుంటూరెళ్లాలి."

"అయితే మాకంటే చాలా దూరమే. మాకు కొంతవరకు తోడుగా ఉంటారన్నమాట. ఇటెక్కడినుండి వస్తున్నారు?"

"ఇటు శ్రీకాకుళంనుండి వస్తున్నాను. పిల్లలు చాలా బుద్ధిమంతులులాగే ఉన్నారు"

"వాళ్ళ బుద్ధిని మీరే మెచ్చుకోవాలి. వాళ్ళనాన్నగారు ఎంత పెంకెతనంచేసినా ఏమీ అనరు. ఒక్కొక్కప్పుడు వాళ్ళు చేసే పెంకెతనానికి నాకు మహా చికాకు వేస్తుంది; నేనేమన్నా వాళ్లకు లక్ష్యం లేదు."

"మీరలా మాటిమాటికీ లక్ష్యం లేదంటూ ఉంటేనే నిజంగా లక్ష్యం లేకుండా పోతుంది. అయినా రైలెక్కినదగ్గరనుండి చూస్తున్నాను. బుద్ధిగా కూర్చున్నారు. సామాన్యంగా పిల్లలు రైలెక్కితే ఎంత గొడవ చేస్తారు. ఏమమ్మా! నీ పేరేమిటి? ఏం చదువుకుంటున్నావు? మీ తమ్ముడూ, మీ అన్నయ్యానా? అంతా ఒకే స్కూల్లో చదువుకుంటున్నారా?......

తల్లి సరస్వతితో ఆరంభమయినపరిచయం పద్మావతికి పిల్లలతో స్నేహంగా పరిణమించింది కొంచెంసేపటిలోనే.

మొదట్లో కొంచెం మొగమాటంగా ఎడంగా ఉన్న బాబుకూడా కలిసిపోయేడు.

అంతవరకూ పద్మావతి చదువుతూండిన "భారతి" పత్రిక చూడ్డంలో నిమగ్నురాలయింది సరస్వతి.

పిల్లలు తమ చదువుసంధ్యలగురించి, ఆటపాటలగురించి, స్నేహితులగురించి, పంతుళ్ళనుగురించి పద్మావతికి వివరంగా చెప్పసాగారు. తమ స్నేహితులవిషయమో మాష్టర్ల సంగతో సరిగా తెలియక పద్మావతి ప్రశ్నిస్తే. ఈమాత్రం తెలియదా అన్నట్టుగా నవ్వి ఆమెకు వివరాలు తెలియజేసేవారు. తాము ఎంతో కష్టమయినవని అనుకొన్న పద్యాలు అప్పజెప్పేరు; పాఠాలలోని కథలు స్వంతమాటల్లో చెప్పారు.

అంతా ఒక అరగంటలో అయిపోయింది. పిల్లలకి ఉత్సాహం తగ్గిపోయింది.

రమణ కిటికీలోంచి చూసిచూసి, కునికిపాట్లు పడుతూఉంటే పద్మావతి నెమ్మదిగా పడుకోబెట్టింది.

బాబూ, చిట్టీ చెరొక కిటికీదగ్గరగా కూర్చొని దాటిపోయే పొలాలనూ చెట్లనూ విసుగులేకుండా చూస్తున్నారు.

సరస్వతి మూలకు చేరగిలబడి కూర్చొని పత్రికలోని ఏదోకథ శ్రద్ధగా చదువుతూంది. ఆమె మనసంతా కథలోనే లగ్నమయి ఉంది.

పద్మావతి, చేతిసంచీలోని ఇంగ్లీషు కథల పుస్తకం సామర్సెట్ మామ్ రాసిన క్రీచర్స్ ఆఫ్ సర్కమ్‌స్టెన్సెస్ చదువుకోడం మొదలుపెట్టింది.

కాని, ఎంత ప్రయత్నించినా చదువు సక్రమంగా సాగటంలేదు. ఏవేవో ఆలోచనలు మనసునివిడిచిపెట్టకుండాఉన్నాయి.

బాబు, చిట్టి, రమణ - ఎంత చక్కగా ఉన్నారు పిల్లలు! ఇంత చక్కటి, బుద్ధి

> "బాబు, చిట్టి, రమణ—ఎంత చక్కగా ఉన్నారు పిల్లలు! ఇంత చక్కటి, బుద్ధిమంతులయిన పిల్లలను కలిగిఉండడానికి ఈ ఇల్లాలికి ఉన్న ఎక్కువ అర్హత ఏమిటి? తనకు ఇటువంటి ఆనందము మరి లేనేలేదా?" అని తోటి ప్రయాణీకురాల్నిగురించి ఆలోచించసాగింది పద్మావతి.

"డాక్టరుగారూ! నేను వీణ నేర్చుకుంటున్నానని మీకు తెలుసుగా. ఇప్పుడు ఈ ఆపరేషన్ అయిన తరవాత, మళ్ళీ ఒక వారం రోజుల్లో వీణ వాయించటం మొదలుపెట్ట వచ్చునంటారా?"

"వీణ సంగతి గ్యారంటీగా చెప్పలేనండీ. కిందటిసారి ఒక రోగికి ఇదేమాదిరి ఆపరేషన్ చేసినప్పుడు అతడు మర్నాడే ఫిడేలు వాయించగలిగాడు."

మంతులయిన పిల్లలను కలిగి ఉండడానికి ఈ ఇల్లాలికిఉన్న ఎక్కువ అర్హత ఏమిటి? తనకు ఇటువంటి ఆనందం మరి లేనేలేదా? ఈమెకు నిజంగా పిల్లలవల్ల తృప్తి ఆనందం ఎంతగా కలుగుతున్నాయో అంతగానే విసుగూ చీదరా కలుగుతున్నాయేమో!

ఈమెకు బహుశః తనవయస్సే ఉంటుంది. ఇంకా ఒకటిరెండు సంవత్సరాలు తక్కువే ఉంటాయేమో! కాని, మరి అయిదారేళ్లలో కూతురు పెళ్లిమాటల హడావిడిలో పడుతుంది; మరి కొంచెం సంవత్సరాల్లో కొడుక్కివచ్చే సంబంధాలనుగూర్చిన ఆలోచనలు, కట్నకానుకలను గూర్చిన పట్టింపులు, అల్లుళ్లు కోడళ్లు-మనవలు...

ఈమె జీవితంలో ఒక విఘ్నమైన ముందుకి సాగిపోయే నదివంటి లక్షణం ఉంది. అది ఎప్పటికప్పుడు కొత్త కొత్తగా కనిపిస్తూ ఉంటుంది—అందులో పాతబడి మురిగిపోయే లక్షణం లేదు.

తన జీవితం—ఇందులో చలనంలేదు—ఎప్పుడూ ఒకటే స్కూలు—పాఠాలు—కాంపోజిషను పుస్తకాలు—ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం, రాత్రి—ఎప్పుడూ ఎల్లప్పుడూ తన దినచర్య ఒకేఒక మార్పులేని సూత్రాన్ని అనుసరించి సాగిగంతుంది. ఇందులో ఉత్సాహం, ఉద్వేగం, ఆకాంక్ష, ఆనందం అనే స్ఫురణలు ఏమీ లేవు— ......

సరస్వతి అంతసేపూ చదివినకథ పూర్తయింది కాబోలు మళ్ళీ కబుర్లకి అందుకొంది......

పద్మావతి ఏంచేస్తున్నది, ఎక్కడ ఉంటున్నది...

విని, నేనూ నిజంగా బియే పాసయి ఉద్యోగం చేసుకోవాలనే అనుకున్నాను. మావాళ్లే పోనిచ్చారుకాదు; ఎలాగో ఊళ్లో హైస్కూలుందికదా అని స్కూలుఫయినలువరకూ చదవనిచ్చేరు. తరవాత, పెళ్ళి - కొత్తలో ఆయన ప్రయివేటుగా చదివిస్తానన్నారు. పుస్తకాలుకూడా కొన్నాం...

"ఏంచేత చదవలేదు మరి?"

"సంసారంలో పడ్డాక మరి చదువు సాగేదేమిటిలెండి. మొదట ఒక ఆడపిల్ల పుట్టిపోయింది. తరవాత వీడు...ఆతరవాత మరి ఆ ఆశే లేకపోయింది. అయినా పరీక్షలు ప్యాసయి నేనేంచెయ్యాలి? ఇప్పుడు మరి ఉద్యోగం చేసేదిలేదుకదా?"

ప్రసంగధోరణి అలా సాగి సాగి, సరస్వతి భర్త ఉద్యోగంవంకకు మళ్ళింది.

భర్త ఉద్యోగం గురించి, లేని ఆస్తిపాస్తులనుగురించి, బంధుమిత్రుల గురించి నిస్సంకోచంగా చెప్పగలిగిన సరస్వతి అతని పేరు చెప్పవలసి వచ్చేవేళకు కొత్త పెళ్లికూతురులా సిగ్గుపడింది.

పద్మావతి "ఏదో మాటవరసకి అడిగేను, చెప్పక్కరేదులెండి" అంది—కాని సరస్వతికి పేరుచెప్పలేకపోవడం పరువుతక్కువగా తోచింది. కొంచెం పక్కగా తిరిగి, "ఆయనపేరు, శ్యామలరావు అందరూ శ్యామూ అంటారు." అంది.

పద్మావతి ఒకమారు తుళ్ళిపడినట్లయింది. ఎలాగో తనునుతాను సంబాళించుకొని, ఇక మరి మనసుని పీడించే సందేహం ఎందుకుండాలీ అని మీ అత్తవారి ఇంటిపేరేమిటంది.

ఇంటిపేరు చెప్పడానికి సరస్వతి ఏమీ మొగమాటపడలేదు. కాని, పద్మావతికి మాత్రం మరి మాట్లాడాలనే కుతూహలం అంతరించిపోయింది.

తనలో తన కనిపిస్తూఉంటేది. ఎందుకిలా అయిపోతున్నాను? చక్కగా, హాయిగా ఇందాకటిలాగ ఎందుకు మాట్లాడలేకపోతున్నాను? ఈవిడ వాగురించి ఏమనుకొంటుంది?

నిజమే, సందేహంలేదు, శ్యామలరావ్ - ఇంటిపేరుకూడా సరిపోయింది ... అప్పటి రోజుల్లో తమవాళ్లు తనకు అతను తగిన వరుడు కాడని తోసిపుచ్చిన శ్యామలరావే - ఇప్పుడు మంచిఉద్యోగంలో ఉండి మూడు వందలు తెచ్చుకొంటున్నాడట -

తీరా తను బి యే. పాసయే వేళకి తనకి తగిన వరులు అసలే కనబడకుండా పోయారు. అందాకా కాలక్షేపానికని ఆరంభించిన ఉద్యోగం ఇదే స్థిరమయి ఊరుకొంది.

శ్యామలరావు ఇప్పుడెలా ఉన్నాడో? అక్కడకు స్టేషనుకి వస్తాడటకదూ? అయితే మాత్రం, తానతన్ని చూడగలదా?

సరస్వతి వద్దని ఎంతగా అంటూ ఉన్నా వినకుండా చిట్టి చేతిలో ఒక పది రూపాయల నోటు ఉంచింది. "ఇంతమాత్రంలో నాకేం కష్టంలేదు; పిల్లలు ఎంతో ముద్దొస్తున్నారు, వాళ్ళకి ఏదైనా కొనియ్యాండి" అంది—

రాజమండ్రి స్టేషనులో ఇద్దరికీ పువ్వులు కొంది—ఎంతో సరదాగా మాట్లాడింది.

అటువంటి పద్మావతి, గోదావరి స్టేషనులో దిగి వెళ్లిపోతూ ఆమె, పిల్లలు చెప్పిన మాటలు సరిగా వినిపించుకోనేలేదు—అవతలిపక్క కూర్చొని, తనసామాను సర్దుకోడంలో నిమగ్నురాలయిఉండి, ఆఁ ఆఁ అని ఎలాగో అంది—

జట్కాలో చిట్టి తనచేతిలోని నోటును గొప్పగా చూపించింది నాన్నగారికి - సరస్వతిఅంతా చెప్పుకొనివచ్చింది శ్యామలరావు "అరే చెప్పావుకాదు, సరిగా చూసి ఉంగును, మా పద్మే అయిఉంటుంది" అన్నాడు—

"అంటే మీ కవితాప్రేయసి ఆవిడేనన్నమాట! మీ రేనయం, ఆవిడ ఒక్కమాటయినా తొణికిందికాదు చూసిండి అయినా అదృష్టవంతురాలు!"

"ఏం?"

"ఏమిటేమిటి, హాయిగా నెలజీతం, స్వేచ్ఛగా బట్టలూ, నగలూ" అందేకాని, తనమాటలో తనకే నమ్మకంలేదు సరస్వతికి- జట్కా ఇంటిదగిర ఆగింది— ★

"మీ కాలంలోనా! మీ కాలాన్ని గురించి నీ కిష్టమైనట్టు మాట్లాడకు. మనదేశం మిగతా దేశాలతోపాటు బాగా నాగరికంగా ఉండాలంటే ముందు నీబోటివాళ్లంతా మారాలి" అన్నాడు కొడుకు తల్లి నుద్దేశించి.

తల్లీ కొడుకులూ

కొడుకు, కోడలు ఇద్దరు మనుమలతో ముసలమ్మ భోజనం బల్లదగ్గర కూర్చుంది. ఆ మధ్యాహ్న భోజనం పెద్ద పనిమనిషి వడ్డిస్తూంది. ముసలమ్మ ఏ గొడవా చేయకుండా చేతులు కట్టుకొని ఒదిగి, ఒక్కొక్క వంటకమే బల్లదగ్గరకువస్తూంటే వాటిని ఒక్కసారిగా ఎప్పుడు నోట్లో పారేసుకుందామా అని పకపకలాడిపోతూ తొందరపడుతూ కూర్చుంది. అందులో ఆమెకు బాగా ప్రీతైన పదార్థమొకటివుంది. అయినా ఆమె పైకేమీ మాట్లాడకుండానే కూర్చుంది. అది తనకోసం వండలేదని ఆమె ఎరుగును. బహుశః మరచిపోయి వండివుంటారు. ఆమె కిష్టమైన వంటకాలు—'పల్లెటూరి దరిద్రపుతిళ్లు' అనీ, అట్లాంటివి తాము తినమని, అప్పుడప్పుడు కొడుకూ కోడలూ అంటుంటారు. అంచేతనే ఆమె కిష్టమైన పదార్థాలు అక్కడలేవు ఆ రోజున.

కాని తన కిష్టమైన ఆ పదార్థంకేసి చూసేసరికి ఆమె నోరూరింది. ఆకలి విజృంభించింది. తనకు పెట్టిన గిన్నెడు అన్నం మీద ఆ 'మిరియాల వంటకం'లోంచి తను తినే గరిటెతో కొంత తీసికొని పోగుపెట్టుకోవాలనుకొంది. కాని అట్లాటి పనులు చేయకూడదని ఒకప్పుడు వాళ్లు ఆమెను హెచ్చరించారు. కొడుకూ కోడలుతో కలిసి వుంటున్న ఈ నాలుగు సంవత్సరాలనుంచీ ముసలమ్మకు చాలా విషయాలు తెలిశాయి. అన్ని పదార్థాలూ బల్లదగ్గరకొచ్చాక కోడలు "మీకు కావలసినవేవో తీసుకోండి" అని అనేవరకూ ముసలమ్మ ఓపికగా కనిపెట్టుకు కూర్చోవాలి.

కోడలు ముసలమ్మకేసి గిన్నెలు ఒక్కటొక్కటే గెంటుతూ, అందరూ తినవలసిన పెద్దగిన్నెలోని పదార్థాలలో ముసలమ్మ తన ఎంగిలిచేసిన చెంచా ముంచుతుందేమో అని ఒకసారి నిశితంగా ఆమెకేసి చూసి ఆ గిన్నెల్లో ఇంకా చాలా చెంచాలు ఉన్నాయని గట్టిగా తెలిసేలా చూపించింది. 'ఆపని చేయకూడదు' అని ముసలమ్మకు తెలియడానికి చాలా కాలం పట్టింది. ముసలమ్మ ఎన్నో సంవత్సరాలు కాపరం చేసిందిగాని, ఈ విధంగా ఎవరికి కావలసింది వాళ్లు తినే చెంచాలతో పెద్ద గిన్నెలోంచి తీసికోవడం మూర్ఖపుపని అనిగాని, అసందర్భపు పనిఅనిగాని ఆవిడ కెప్పుడూ తట్టలేదు. కొడుకూ కోడలూ విదేశాన్నుంచి తిరిగివచ్చిన తొలిరోజునే ముసలమ్మ తను తినే చెంచాను నెమ్మదిగా నోట్లో పెట్టుకొని తుడిచి దాన్ని అంతా తినవలసిన పదార్థంఉన్న గిన్నెలో ముంచినప్పుడు ఆ ఇద్దరూ ఆమెమీద మండిపడ్డారు. నిజానికి ఆ ప్రాంతంలో మనుష్యులు, నాగరికత లేక అట్లాంటి రోత అలవాట్లతోనే వుంటారు.

ఆరోజున ముసలమ్మ వాళ్ల గద్దింపు విని ఉలిక్కిపడ్డది. తినేతినే చెంచా గిన్నెమీదే వదిలేసింది. ఎంత అనుభవంగల వంటవాళ్లయినా, తయారుచేసిన వంటకంలో ఏ తలవెంట్రుకో, గడ్డిపీలికో, పుల్లముక్కో తెలియకుండానే ఏవో ఒకటి పడుతుంటాయని, అట్లాంటివేమైనా అందులో ప్రత్యక్షమైనాయేమో అనుకుని ముసలమ్మ అన్నది "ఏం? ఏమిటి?" అని. కొడుకు కోపపడ్డాడు.

"నోట్లో పెట్టుకున్న చెంచా మళ్ళీ అందులో పెట్టకు. ఇంకో చెంచా తీసికో"—

ఆమెకు పట్టలేనికోపం వచ్చింది. ఆపుకోలేక అన్నదికదా: "నాకేమైనా అంటువ్యాధు లున్నాయా? ఎందు కంతభయం?" ఏవేవో కంటికికూడ కనిపించనంతటి చిన్న చిన్న క్రిములు ఒకరినుంచి ఇంకొకరికి అంటుకొని జబ్బులు తెస్తాయని వాళ్లు ఆమెకి వివరిస్తూంటే బింకంగా తనకు ఏమాత్రం అంగులో నమ్మకం లేనట్లు కూర్చొని వాళ్ల కడ్డంవచ్చి ముసలమ్మ అన్నది:

"అలాటివి నాదగ్గర వున్నాయంటే నాకేమీ నమ్మకం లేదు. నా వంటిమీద అట్లాటి క్రిములను నే నెప్పుడూ చూడలేదు. అవి ఎప్పుడూ కనబడలేదు."—

"అయ్యో! కళ్ళకి కనబడనంత చిన్నవవి" అని వాళ్లంటే మీకూ కనిపించనప్పుడు అవి నాదగ్గరే వున్నాయని మీకెలా తెలుసు?" అన్నది గబుక్కున ముసలమ్మ. పాపం! అదే తనకు ఘనవిజయం అనుకుంది ముసలమ్మ. అయితే కొడుకు తన తండ్రి మోస్తరుగా ఖచ్చితంగా అన్నాడు: ఈ విషయం నీతో వాదించి లాభం లేదమ్మా. ఇట్లాంటి కూడనిపనులు నా ఇంట్లో జరగడానికి వీల్లేదు. నాయింట్లో అవికూడనివి."—

ఆమాటకి ముసలిది బాగా గాయపడ్డది. మరిమాట్లాడకుండా ఒక్క అన్నం మినహా మిగిలినమాంసం, కాయగూరలు వున్న గిన్నెల్లోవి కాస్తకాస్త తీసికొంటూ కూర్చుంది ముసలమ్మ. బ్రతుకంతా ఆవిడకు తిండిధ్యాసే - ఇప్పుడు వార్ధక్యం రావడంతో భోజనమంటే ఆవిడకు మరింత మక్కువ అయింది.

ఒకసారి ఇట్లాగే తానుచేస్తే కోడలు ఏం

రచన:
పెరల్ బక్

అనువాదం:
చామర్తి కనకయ్య

★ తల్లులా, కొడుకులా ★

చేసిందీ ముసలమ్మ చూసింది. అందుకో విషయంలో ఆమె ఒప్పుకుతీరాలి. ఓనాటి రాత్రి భోజనం బల్లదగ్గరకు వంటకత్తె, ముసలమ్మకి ప్రీతైన వేడి దోసపచ్చడి నిండిన గిన్నె తెచ్చిపెట్టింది. చూడగానే ఆమెకు సంతోషం ఆగిందికాదు. ఇక సర్వం మరచిపోయి పింగాణీచెంచాతో అందులోకాస పచ్చడితీసికొని రుచిచూసి ఇంకొంచెం తినడానికి మళ్లీ ఆచంచా అందులో ముంచింది. ధఢాలున కుర్చీలోంచి లేచి, కోడలు ఆ పచ్చడంతా ఆ పక్కనే కిటికీలోంచి తోటలోకి పారబోసి వచ్చింది. అప్పుడా శుభ్రమైన పచ్చడి అట్లాఅయింది!

"ఏం! ఎందుకూ" అని నిర్ఘాంతపోయి అడిగింది ముసలమ్మ. కోడలు పెదవులు గట్టిగా బిగించింది. అయినా నెమ్మదిగానే "నువ్వు తిన్నతర్వాత మాకు కలికే ఖర్మం ఏం లేదు?" అంది.

దాంతో ముసలమ్మకు మండిపోయింది. కొత్తలో ఆమె కోపగించడానికి ఏమాత్రం వెనుదీసేది కాదు. "మీకేమీ విషం పెట్టనులే - అంతవరకూ నమ్మకంగా చెప్పగల" అన్నది బిగ్గరగా.

కోడలు, ఆమెను ఎత్తిపొడిచే ధోరణిలో "నువ్వు ఒక్క టూత్ బ్రష్ కూడా వాడవు" అంది.

దానికి ముసలమ్మ సగర్వంగా "చిన్నప్పటినుంచీ ఓలాగే ముఖం కడుక్కుని, పళ్లుతోముకుంటున్నాను; ఉదయం లేవగానే, భోజనం తర్వాత - కాని మా కాలంలో అంతకన్న ఎక్కువగా ఎవరూ తోముకోలేదు" - దాంతో కొడుకు అందుకున్నాడు.

"మీ కాలంలోనా! మీ కాలాన్ని గురించి నీ కిష్టమైనట్టు మాట్లాడకు. మన దేశం మిగతా దేశాలతోపాటు బాగా నాగరికంగా ఉండాలంటే నీలాంటివాళ్లంతా ముందు మారాలి."

ఆ ధోరణిలో మాట్లాడే కొడుకు పద్ధతేమిటో ముసలమ్మకి తెలియదు. అతనట్లా అంటూవుంటే మొదట పల్లెటూరుదానిలా ముసలమ్మ బిగ్గరగా నవ్వేది. అతను 'అరిందా' మాటలు మాట్లాడుతున్నట్లు ఆమెకు అనిపించేది. తనపైన కొడుకుచూపే చల్లని ఓరిమి, అతనివైపు తను నవ్వినప్పుడు అతనుచూపే సౌమ్యత, ఆ ఇంటికొచ్చే అతిథులు అతనిపట్ల చూపే గౌరవం, ఆ వచ్చేవాళ్లు కొడుకునిచూసి తన నెట్లా భరించేదీ, ముసలమ్మ చూసిచూసి ఆవిడకు తెలియకుండానే నవ్వడం మానేసింది. చుట్టూ నవ్వూ, తుళ్లూలేని ముఖాలుండగా ఏమనిషికైనా ఒంటరిగా నవ్వుకోవడం ఎంత దుర్భరం!

అయితేనేం, నిశ్శబ్దంగా అల్లరిఏమీ చేయకుండా కూర్చుని భోజనంచేయడం, వడ్డన పూర్తిఅయేవరకూ తినకండా కూర్చోగలగడం మొత్తంమీద ముసలమ్మ నేర్చుకున్నది. ఆ నేర్చుకున్నదే ఇప్పుడామె ఆచరించింది. తన గిన్నెడు అన్నంతిని నెమ్మదిగా లేచి హాల్లోంచి నడచి తనగదిలోకి వెళ్ళిపోతూ ద్వారబంధందగ్గర ఒక్క క్షణం ఆగింది ముసలమ్మ. నిజానికి ఆవిడకు ఇంకా ఆకలి తీరలేదు. పొలంపని మానుకోనేరోజుల్లో రోజూ ఆమె మూడు గిన్నెల అన్నం తినేది. నిండీనిండని ఒక్క గిన్నెడన్నంతో ఆమె ఆకలి ఏం తీరుతుంది? అవైనా పెద్దగిన్నెలు కావు. పట్నవాసం వాళ్లు వాడుకునే నాజూకైన చిన్నగిన్నెలు.

ముసలమ్మ ఆకలి మరి విపరీతమైంది. వెనక్కి తిరిగి నెమ్మదిగా హాల్లోంచి నడచి వెనకవున్న బయటితలుపులోంచి ముసలమ్మ వంటింట్లో చొరబడింది. అక్కడున్న పనివాళ్ళకేసి భయపడుతూనవ్వి, నెమ్మదిగా ఓ గిన్నె తీసికొని, సగం ఖాళీఅయిన పెద్ద పళ్లెంలోవున్న అన్నం, గిన్నెలో సగం నింపుకొని, పనివాళ్ళు తినడంకోసం మిగిల్చిన భోజనాలున్న బల్లదగ్గర చేరింది ముసలమ్మ. అక్కడ ఆవిడకు ఇష్టమైన 'మిరియాల వంటకంకూడా' వుంది. అది ముట్టుకోడానికి ఆమెకు సాహసంచాలేదు. అయినా ఉన్నదికూడ అక్కడ అట్టేలేదు. ఉన్నది కాస్తా తను తినేస్తే పనివాళ్ళు గోలెడతారు. అక్కడ ఎక్కువగావున్న కాబేజీ కూర మరింత తీసికొని, పనిమనుష్యులకెవరికీ కనబడకుండా, ఒకవేళ కొడుకో, కోడలో కనబడతారేమో అనే భయంతో ఎలాగైతేం గబగబా ముసలమ్మ తన గదిలోకి వెళ్లిపోయింది. ఆ పనిమనుష్యులతత్త్వం ఆమెకు బాగా తెలుసును. మళ్ళీ తను వాళ్ళ భోజనంలో భాగంకూడడం వాళ్లకి కిట్టదు. అయినా ఆమెపై వాళ్ళకి అదోరకమైన జాలి. అందుకే ఆమెను ఓర్చుకోవడం. ఒకొక్కప్పుడు వాళ్ళు ముసలమ్మపక్షం వహించి ఇంటికోడలితో పోట్లాడతారు.

గదిలోపల గడియపెట్టి, భోజనానికి కూర్చుని ముసలమ్మ ఆబగా ఒక్క మెతుకు కూడ మిగల్చకుండా తినేసింది. మళ్ళీ పనిమనుష్యులకు అనవసరశ్రమ కలిగించడం దేనికని లేచి అక్కడేవున్న తొట్టెలో గిన్నె, చెంచా కడుక్కుని, నెమ్మదిగా బల్లదగ్గరకెళ్ళి అక్కడున్న డబ్బాలలోని ఒక చిన్న టిన్నుడబ్బాతీసి అందులోంచి కొద్ది చద్దిఅన్నం పైకితీసింది. ఆ అన్నం అంతకు క్రితంరోజున దాచిపెట్టినబాపతు. ఇప్పుడదికూడా పిసికి ముద్దలుచేసుకొని తినేసింది. రకరకాలైన ఎన్నో 'తిళ్లు' తెచ్చినవన్నీ ఇతర సమయాల్లో ఆకలేస్తే తిందా

ఉపాయం

"నాకు కుక్కపిల్లని పెంచుకోవాలని ఉంది కాని, మా అమ్మ ఒద్దంటూంది" అన్నాడు ఏడేళ్ళ కుర్రాడు.

"మా అమ్మకూడా ముందర వద్దంది. అయితే చిన్నతమ్ముడేనా కావాలని ఏడిచాను. అప్పుడు కుక్కపిల్లని తెచ్చిపెట్టారు" అన్నాడు అతనినేస్తం.

కారణం

న్యాయమూర్తి: ఈ వ్యక్తి నిర్దోషి అని మీరు పన్నెండుగురూ ఏకగ్రీవంగా తీర్పు ఇవ్వడానికి కారణం ఏమిటి?

జూరీల ప్రతినిధి: మతి భ్రమణం.

న్యాయమూర్తి: పన్నెండు మందికీనా?

ని ముసలమ్మ ఆ డబ్బాలలో ధాన్యం వుంటుంది. తిని తీరికగా కూర్చుని పాత వెండి కూడులతో పళ్ళు గిలుక్కుంటుంది.

మనుమరాళ్లిద్దరిలోనూ ఎవరైనా ఆ చుట్టు ప్రక్కల వున్నారేమో అని ముసలమ్మ లేచి తలుపు తెరిచి బయటికోసారి చూసింది. తన దగ్గరకి పిల్లల్ని పిలవడం ఆమెకు భయం. పిల్లలు, మామ్మగది దగ్గరకు వెళ్ళడం కోడలికి ఇష్టం వుండదు. ఆవిడ ముందు ముసలమ్మ ఒకసారి కదిపితే కోడలిలా అంది:

“నీకిటికీ తలుపులు తెరవకు. నీగదికేపు నుంచి వచ్చేగాలి వాళ్ళకి అనారోగ్యం. పాతగుడ్డలు అట్టే పెడతావు. ఆమూలా ఈమూలా అన్నం కప్పెడతావు. గదినిండా చుంచులే—”

“గుడ్డలా - నాకోట్లు ఏమనుకున్నావో - మాఅమ్మ నాటివి బాగుండగానే వాటిని ఎలా పారేస్తాను? మంచివస్తువు లెవరూ పారేసుకోరు. అందులో ముఖ్యంగా తిండీ, గుడ్డా! నా ఈడొచ్చేసరికి నీకూ తెలుస్తుందిలే. అయినా దరిద్రం చెప్పిరాదు. ఫలానా అప్పుడొస్తుందని ఎవరూ చెప్పలేరు” అన్నది ముసలమ్మ సమాధానంగా.

దానికి కోడలు అతి తేలికగా చిరునవ్వు నవ్వేసి ఊరుకుంది. పిల్లలు మామ్మగదివైపు వెళ్లడం కనక కోడలుచూస్తే ఏదో వంకపెట్టి తనలో వాళ్లను లాక్కుపోతుంది. అక్కడ పిల్లలెవరైనా వుంటే ఎవరికంటా పడకుండా కాసేపు ఆడుకోవాలని ముసలమ్మ ఒకసారి అట్లా తలుపు తెరచి వుంచుతుంది. ముసలమ్మకు రోజూ అదో అలవాటయిపోయింది. పైగా ఆ మనమరాళ్లుకూడ కొంచెం బొద్దుగా, మంచి పరిమళంతోనూ చూడ ముచ్చటగా వుంటారు. ఆ పసిబిడ్డల వెన్నలాంటి మొహాలమీద ముద్దులు కురిపించి, గిలిగింతలతో ఊగిసలాడేంతగా నవ్వించడం ముసలమ్మ కిష్టం.

ఆ పిల్లలు పుట్టినప్పుడు ముసలమ్మ ఎంతో ఆనందించింది. ఆవిడకు పిల్లలంటే తగని ప్రేమ. ఆమెకు చాలా చిన్నవయసులోనే వివాహమైంది. సంవత్సరమంతా పొలంలో ఆ భర్త బండచాకిరీ చేస్తేనేగాని వాళ్ళకి పొట్టగడిచేదికాదు. అప్పటినించీ ఆమె తన దగ్గరకు చనువుగా వచ్చే ప్రతి పిల్లనూ చేరదీసేది. ఓ సంవత్సరం పంటలు ప్రతిచోటా పాడైపోయినాయి. ఆ ఏడు ఆమె అత్తగారు పిల్లలనెవరినీ దగ్గరకు తీయవద్దని ఆజ్ఞాపించింది. నిజానికి ఆ ఏడాది చాలా మంది ఆకలితో మాడిపోయారు. కాస్త వున్నవాళ్లు కూడా చివరకి ఆదశకే వచ్చారు.

ఆ సమయంలోనే ఆమె, ఒక శిశువు పుట్టినవెంటనే చచ్చిపోవడం చూసింది. అది ఈనాటికీ ముసలమ్మకు జ్ఞాపకంవచ్చి విచారం కలిగిస్తుంటుంది. ఇంత క్రితం ఆమెకి పుట్టిపోయిన నలుగురిలోనూ ఆ పిల్లకూడ ఒకర్తెగా ముసలమ్మ లెక్క వేసికొంటూంటుంది. దేవుళ్ళు ఆమె దగ్గరనుంచి ఎత్తుకుపోయిన నలుగురిలోనూ ఆ పిల్లకూడ ఒకతె.

బ్రతికి బట్టకట్టి ఎదిగిన ముగ్గురిలోనూ చివరకి ఆమెకు ఈ ఒక్క కొడుకే మిగిలాడు. నడివయస్సులోవున్న పెద్ద కొడుకు ఎనిమిదేళ్ళ క్రితం కలరా వచ్చిపోయాడు. ఆ మూడోది కూతురు లేనివాడిని కట్టుకొని మరో వూళ్లో వుంటూంది. పెట్టి పోషించాల్సిన బాధ్యతగల కొడుకు వుండగా, అల్లుడు అత్తగారిని పోషిస్తాడని ఆశించడం ఎట్లా భావ్యం? ఇంతవరకూ కూతుర్ని మాటాడం ఆవిడకు పడనేలేదు.

అందుచేత ఆవిడను కనిపెట్టి చూడవల్సిన వాడు ఈ ఒక్క కొడుకే మిగిలాడు. ఈ కొడుకును తల్లీ తండ్రీ సంతానం, అందరిలోకీ బాగా మెరుగని ఎప్పుడూ అనుకునేవారు. ఇతను చిన్నప్పుడెంతో తెలివిగా, అందరిలోకీ మంచిబుద్ధి కలిగి వుండేవాడు. మొదటినుంచీ అందరికన్నా వీడికే ఎక్కువగా పెట్టాలని, అన్నీ ఇవ్వాలని, గొప్పవాడిని చేసేయాలనీ వాళ్ళిద్దరూ అనుకుంటుండేవారు. అందుకే తండ్రి వాడికి పదేళ్ళయినా నిండకుండానే దగ్గరబస్తీలోని విదేశీస్కూలులో చేర్పించాడు. అక్కడ వాడిని పదేళ్ళు వదలి వున్నారు. కుర్రవాళ్ళను ఆ స్కూళ్ళల్లో చదివిస్తే వాళ్ళ మతబోధనలు నేర్చుకోవాలని కొందరు పెద్దలు భయపడేవారు. ఆస్కూల్లో చదువు బాగా చెప్పడంచేత, చదువులో కుర్రాడు బాగా ముందడుగుగా వుండడంచేత, మళ్ళీ ఇంటిదగ్గర వాడికి చదువులో తర్ఫీగుచేసేవాళ్లెవరూ లేకపోవడంచేత, ఆ

★ తల్లులూ, కొడుకులూ ★

స్కూలువాళ్లు కుర్రాడిచేత మతగ్రంథాలు చదివించినా వాళ్లు ఏమీ పట్టించుకోలేదు. అయితేం ఆ కుర్రాడికి కావలసినవన్నీ ఆవిదేశీయులు ఇచ్చారు. మొదట కుర్రాడు ఉగాదిసెలవులకీ, వేసంగి సెలవులకే ఇంటికి వచ్చేవాడు. కొన్నాళ్ళతర్వాత ఆపద్ధతి వాడికి నచ్చలేదు. విద్యాధికుడయ్యే కొద్దీ వాడికి ఈపల్లెకొంపలు, మట్టిగోడలు ఏమీ సౌకర్యంగా అనిపించలేదు. విదేశాలు పోయి పెద్దచదువులు చదవాలనే వాడి కాంక్షను ఆవిదేశీయులు మరింత ప్రోద్బలం చేశారు. చాలినంతసహాయం చేయలేకపోయినా అతని చదువుకి కాస్తసహాయపడ్డారు. ఆమెకి బాగా జ్ఞాపకంవుందా విషయం. ఒకరోజు భర్తతో ఆమె పొలంలో పని చేస్తుండగా హఠాత్తుగా వాళ్ళముందు వచ్చి వాలాడుకొడుకు. అన్నాడు:

"అమ్మా! పెద్దచదువుకి నేను విదేశం పోతున్నాను. వాళ్లు కొంత ధనసహాయం చేస్తున్నారు. మీరు కొంత ఇవ్వాలి. మీరెంత ఇవ్వగలిగితే అంతా ఇవ్వండి మీ వార్ధక్యంలో మీకే బాదరబందీ, గోలా గొడవా లేకుండా నేను కనిపెట్టిచూస్తానుగా"—

మొదట కుర్రాడిని విదేశాలు పంపడమంటే ఏదో క్రూరమైన పనిచేస్తున్నట్టనిపించింది. ఆ తరువాత ఆ ఇద్దరూ ఆ సంగతి చాలా మందితో ప్రస్తావించాక వాళ్లు అన్నదేమంటే:

"విదేశాలుపోయి పెద్దచదువులు చదివి తిరిగివచ్చి ప్రతి నెలా కొల్లలుగా డబ్బు సంపాదించే వాళ్ళనిగురించి మనం రోజూ వింటూనే వున్నాం. నువ్వు మీ వాణ్ణి విదేశంలో చదివించినట్లయితే చివరిదశలో కష్టపడకుండా బ్రతకవచ్చు!"

"సవ్యశ్రీగారి పుస్తకంమీద మీరు వ్రాసిన సమీక్ష చదివానండి. ఆ పుస్తకం చదవాలని ఉంది. ఒక్కసారి ఇస్తారూ?"

"అదా! అది మంచి పుస్తకమే. రేపిస్తాలెండి... నే నింకా పూర్తిగా చదవలేదు."

దగ్గరలోవున్న బస్తీలో దుకాణం పెట్టుకొని తనూ, భార్యా సుఖంగా బ్రతుకుతున్న పెద్దకొడుకును చూసుకుంటూ గడపగలమనే ధీమాతో కొడుకును ముసలాళ్ళిద్దరూ పెళ్లిచేయకుండానే విదేశం పంపారు. ఆ కుర్రాడు దర్జాగా, తను అంతవరకూ చదివిన చదువుతో అతి ఖచ్చితంగా నిక్కచ్చిగా మాట్లాడుతుంటే, అతనితో ఏ విధంగానూ పోల్చుకోడానికి అర్హతకూడలేని మూర్ఖులు, అమాయకులైన ఆ తల్లిదండ్రులు అతన్ని వాళ్ళముందు ఎల్లా పెళ్లికి బలవంతంచేయాలోకూడ వాళ్ళకి తెలిసింది కాదు. అతను మాట్లాడే అపూర్వమైన మాటలకు వాళ్ళకి ఎలా జవాబివ్వాలోకూడ తోచలేదు.

అయితే అతను నవీనపద్ధతిగా విదేశాల్లో ఉన్నప్పుడే తల్లికీ తండ్రికీ తెలియకుండానే పెళ్ళి చేసేసికొన్నాడు. భార్య విదేశస్థురాలో కాదో తెలియదు. కాని అలాగే ఉంటుంది తెల్లగా, అతినాజూకుగా. కిటికీలకు గుడ్డలు వ్రేలాడగట్టడం, నేలమీద పీటలు పరచడం, పిల్లలకు అస్తమానూ నీళ్లుపోసి కడుగుతుండడం—ఇవీ ఆమె అలవాట్లు.

ఇంకా రెండేళ్లకు కొడుకువస్తాడనగానే ముసలాడు చనిపోయాడు. ముసలాడు చపలచిత్తుడే అయినా చాలా మంచివాడు. ఓ చలికాలంలో జ్వరంవచ్చి గుండెనొప్పితో ఒక్క క్షణంలో పోయాడు. వైద్యుణ్ణి పిలిపించి నయం చేయిద్దామని ఆమె అనుకుంటే, అతని కాఖర్చు కిట్టిందికాదు. చచ్చిపోయాడు. శవపేటికకీ, కర్మకీ డబ్బు ఖర్చుపెట్టాలి. ఆవిడదగ్గర ఒక్క పైసలేదు.

"నిన్న రాత్రి మీ ఆవిడ ఎవరిని కోప్పడుతోంది?"

"ఆ, మాయింట్లో పెంపుడు కుక్క ఉందికదూ. అది అల్లరి చేసిందని కోప్పడుతోంది."

"ఇంతా ఏడిస్తే కుక్కనా తిట్టేది! జీతం రాగానే తన చేతికివ్వకపోతే చర్మం వొలిచేస్తానని ఆవిడ అంటుంటే ఎవర్నా అనుకున్నాను."

భూమికొంత అమ్మాలి. విదేశంలో వున్న కొడుక్కి సమయానికి డబ్బు పంపుతుండాలి. అయినా భూమి అమ్మక తప్ప లేదు.

అయినా ఒంటిమనిషి. ఆమె ఏవిధంగానూ భూమినంతను దున్ని పండించ లేదాయె. అందుచేత పెద్దభాగం పొలం అమ్మేసి దాంతో ముసలాడికి శవపేటిక సిద్ధం చేయించింది. అందులో వసుకో బట్టే ముందు అతనికి తొడగడానికి ఒకకొత్త నీలం రంగుకోటు ఒకటికూడ కొన్నది. అటువంటి మంచికోటు ఆముసలాడు బ్రతికుండగా ఎప్పుడూ తొడుక్కో లేదు.

ఆ ఏడాదే ఆమె పెద్దకొడుకు కూడ పోయాడు. అతనికప్పటికి ఎవరూ పిల్లలు లేరు. అతను పోయాక అతని భార్య పుట్టింటకి వెళ్లిపోయింది. ఇక ముసలమ్మకు మిగిలిందల్లా విదేశాల్లో వున్న ఒక్క కొడుకూ. అతనికి డబ్బు కావాల్సి వచ్చి పంపమనిరాస్తే ఆ మిగిలిన భూమి కూడ అమ్మేయగా వచ్చిన వెండి కొడుక్కి పంపేసింది. ఒకసారి పొరుగింటి ముసలాడు ఆమెతో అన్నాడు:

"నువ్వు పొలం పూర్తిగా అమ్మివేయకుండా కాస్తయినా మిగిల్చివుంచితే బాగుండేది తరవాత కొడుకు నిన్ను చూడకపోతే నీగతేమిటి?"

కాని ఆమెకు భయం కలగలేదు. అన్నది కదా:

"నా కొడుకు చాలా మంచివాడు. ఏమైనా అది వాడి పొలమేకదా. కావలిస్తే మళ్లీ వాడే కొనుక్కుంటాడు. నామట్టుకు నాకేం భయంలేదు. ఏ గొడవ, గోలా లేకుండా నన్ను కనిపెట్టి చూస్తానన్నాడు నా కొడుకు. నాకా భయం ఎప్పుడూ లేదు." అంటూనే ముసలమ్మ నవ్వింది. అయినా ఆమెకు కొడుకంటే బాగా నమ్మకం.

కాని ఇప్పుడు కొడుకు చెప్పిన సమాధానం చూసి ఆలోచించి ఒక్క నిశ్వాసం విడిచింది ముసలమ్మ. ఆవిడ ఇప్పుడు కొడుకు ఇంటనేవుంది. ఆ ఇల్లు చాలా అందమైనది. ఆ ఇంటికి వచ్చేవాళ్లు ఆ ఇంటిని విదేశాల్లోని ఇళ్ళతో పోల్చి పొగుడుతారు. పైన మరో అంతస్థుకూడా వుంది ఆ ఇంటికి (మేడ). ఎక్కడానికి మెట్లున్నాయి. ముసలమ్మ మెట్లెక్కి పైకి రాలేదుకదా అనే వుద్దేశంతోనే వాళ్లు ఆమెకు గది క్రిందభాగంలోనే ఏర్పాటుచేశారు. ఒకవేళ ఏదోలాగ పైకి కష్టంమీదవచ్చినా, తిరిగి వెంటనే ఆమెను క్రిందికి పంపేస్తారు. క్రిందభాగంలో ఆమెను వదుల్చుకోదలుచుకుంటే ఆమె ఒక్కతెనూ వదలి పిల్లల్ని తీసికొని మేడఎక్కి కూర్చుంటారు.

నిద్రనుంచిలేచి పిల్లలిద్దరూ అట్లా హాలులోకివచ్చి కూర్చుని ఆటవస్తువుతో ఆడుకుంటుండడం ముసలమ్మ కండపడ్డది హఠాత్తుగా. ఆ ఇద్దరూ ఆడపిల్లలు. బాగా చిన్నవాళ్లు. ఆ రెండోది పుట్టినప్పుడు ముసలమ్మ కొడుకుతో అన్నది:

"ఈసారైనా మగపిల్లవాడయితే..."అది విని కొడుకన్నాడు:

"అలా మేం ఎప్పుడూ అనుకోం. ఈ రోజుల్లో కొడుకులూ, కూతుళ్ళూ సమానమే—"

కొడుకు అన్నమాట గుర్తుకొచ్చి ముసలమ్మ ఒక్కసారి నెమ్మదిగా వినపడకుండా తనలో తను నవ్వుకుంది. కాని ఒకవేళ అంతా ఆడపిల్లల్నే కని పడేస్తే: తరవాత వాళ్ళకి తండ్రెవడీ? అనేఆలోచన వచ్చింది. అందుచేత మగవాళ్లూ, ఆడవాళ్లూకూడా వుండాలి.

ఆమె తిరిగి వెనక్కి చూచేసరికి రెండోపిల్ల తనకేసే చూస్తూండడం ముసలమ్మ గమనించింది. ముసలమ్మ పిల్లకేసిచూస్తూ నవ్వింది. ఆ ఇద్దరు పిల్లలూ అంటే ఆమెకు ప్రాణం. అందులో ఆ రెండోదంటే మరీ ఇష్టం. ఆ పిల్లని గిలిగింతలు పెటి నవ్వించి ఆడించాలని, ఎత్తుకోవాలని ఆవిడకు కోరికయింది. నెమ్మదిగా నాలిక బయటకు వెళ్లబెట్టుకొని మీద కొస్తుంటే ఏమిటో తెలియక పిల్ల ముసలమ్మను చూచింది. ఇంతలో ఏమి ఆలోచించుకుందో ముసలమ్మ టిన్ పెట్టెలలో ఒకటి తెరిచి అందులో పదిరోజుల క్రితం ఎప్పుడో దాచివుంచిన ఒక రొట్టెముక్క పైకి తీసింది. ఆ రొట్టె తెల్లగా బూజుపట్టి వుంది. అది దులిపి చేత్తో రొట్టెను బాగా తుడిచి నెమ్మదిగా ఆ బిడ్డకేసి దానిని చూపించింది.

★ తల్లులూ, కొడుకులూ ★

పిల్ల అది చూసింది. పిల్లకింకా నడక వచ్చీరానట్టుగా వుండడంచేత లేస్తూపడుతూ అది కష్టంమీద ముసలమ్మ దగ్గరకొచ్చి రొట్టెకోసం చెయ్యిజాపింది. ఆ చేతిని తీసికొని అందులో రొట్టెపెట్టి పిల్లని గదిలోకి తీసికొచ్చి తలుపు దగ్గరగావేసి పరుపుమీద కూర్చోబెట్టుకొని పిల్ల రొట్టె నోట్లో కుక్కుకుంటూంటే పాప మెడదగ్గర కితకితలుపెట్టి ముద్దులు కురిపించింది ముసలమ్మ.

అంతక్రితమే కొడుకు కోడలు, మామ్మని అసహ్యించుకోడం పిల్లలకి నేర్పారు. పెద్దపిల్ల జరిగినసంగతి ఎప్పుడువెళ్ళి తల్లితో చెప్పిందో—యేమో, కోడలు గభాలున ముసలమ్మ గది తలుపులు తెరుచుకొని వచ్చి అన్నది:

"ఏమమ్మా! బాగుంది. పాప తోటలో ఆడుకునేసమయం ఇది" – అంటూండగానే ఆమెకు బిడ్డ ఎఱ్ఱని పెదవులమీద ఏదో పదార్థం పలుకులు కనిపించడంతో అంతకుముందున్న శాంతం ఇట్టే ఎగిరిపోయి ఒక్కగదుము గదిమింది:

"పిల్లకి ఏమిటీ పెట్టావ్?"

ముసలమ్మ చాలా ధైర్యంగా జవాబివ్వాలని యత్నించింది. ఓ చిన్న తీపిరొట్టెముక్క ఏమాత్రం గనక? ఏంచేస్తుంది – అనుకొన్నదేమో –

"ఏమీలేదు. ఓ-చిన్న రొట్టెముక్క" –

తల్లి బిడ్డను లాక్కుని పిల్ల చేతి వేళ్లు తెరిచి చూచి "ఇదా!" అంది మండిపోతూ, పెదవులను బిగించడం తప్పితే మరేం మాట్లాడలేక. బిడ్డని ఎత్తుకుని గబగబా బయటికి తీసికొనిపోతుంటే బిడ్డ భయంగా ఏడ్వనారంభించింది.

ముసలమ్మ దిగాలుపడి కూర్చునిపోయింది. తానుచేసినపని ఏవిధంగానూ ఎంతమాత్రం తప్పుకాదు, కాబోదని తనలో గట్టిగా అనుకున్నది. ఈ నాలుగేళ్ళనుంచీ ఇదే రకంగా ఉంది ఆవిడస్థితి. "పిల్లలు తియ్యని రొట్టెముక్కంటే సంబరపడతారే – అది పెట్టడం దోషమా? అదే తల్లిచేత్తో పెడితే మంచివౌతాయి కాబోసు!" అని గొణుక్కుంది ముసలమ్మ. గుమ్మందగ్గర ఏదోచప్పుడవడంతో అటు చూసింది ముసలమ్మ. ఎదురుగా పెద్దపిల్ల నిలబడివుంది. చిరునవ్వు నవ్వి బిడ్డకేసి చెయ్యి జాచింది ముసలమ్మ. కాని బిడ్డ అడ్డంగా తలత్రిప్పి అక్కడ నుంచి వెళ్ళిపోయింది. ముసలమ్మ చెయ్యి ఉన్నపాళంగా వాలిపోయింది.

"ఆ పెద్దాళ్ళు చెప్పిపెట్టారు." అని లోలోపలే గొణుక్కుని బాధగా నవ్వుకుంది.


ఆరాత్రే చిన్న పిల్లకు జబ్బుచేసింది. అది ఆ రొట్టెవల్లో లేక మరెందువల్లో మొత్తం మీద పిల్లకి జబ్బుచేసింది. ఆ రాత్రంతా తల్లి బిడ్డను కనిపెట్టుకొనివుంది. కొడుకుకు కూడ నిద్రలేదు. కాని మరునాటికి అన్నీ నయమైపోయినాయి. ఆరాత్రి హడావిడిలో ముసలమ్మ ఎంతో భయపడ్డది. కులాసాగా వున్నట్లు పనిమనిషివల్ల విని తేలికపడింది. భోజనాల గదిలో భోజనం చేయడానికి వెళ్ళినప్పుడు ముసలమ్మ కొడుకు ఒక్కడే కూర్చోవడం చూసి దగ్గరగా కూర్చుని అతనితో అంది:

"మరేం కంగారుపడక్కర్లేదు అట్లాంటి వాటికి. పిల్లలకి వచ్చేసాధారణమైన జబ్బులే అవి. నాకు బాగా జ్ఞాపకం నీచిన్నప్పుడో సారి——"

ఆమె ఇంకా ఏదో చెప్పబోతూంటే అడ్డగించాడు. అతనేదో తనతో చెబుతాడేమో అని ఒకసారి అతనికేసి చూసింది ముసలమ్మ. కాని అతనిముఖం కోపంగా వుంది. ఇక ఒక్క ముద్ద తినలేకపోయింది. చంచా అక్కడే పడేసి అతనివైపు దీర్ఘంగా చూసి అతను తనకొడుకనీ, చిన్న కొడుకనీ ఆమె గుర్తుకుతెచ్చుకోడానికి ప్రయత్నించింది. ఏడ్చేపిల్లాడప్పుడు తన రొమ్మును వెదుక్కుంటూ వచ్చేకొడుకుగా అతన్ని గుర్తుకు తెచ్చుకోవడం ఆమెకిక సాధ్యం కాలేదు. ఇదేస్థితిలో చిన్నతనంనుంచీ ఇదే విధంగా ఉన్నాడనీ ఆమెకు మరీమరీ అనిపించింది. బాగా చదువుకుని, గర్వంతో, విదేశీదుస్తులలో, కళ్ళజోడు పెట్టుకొని వెనక కూడ ఇట్లానే వున్నట్లు కనిపించాడామెకు. అతనిముఖంలో ఎంతమాత్రమూ దయకనిపించలేదు. చూసేకొద్దీ ముసలమ్మలో భయం ఎక్కువైంది. తనకోడలుకూడ ఆ క్షణంలో అక్కడేవుంటే బాగుండునను కొంది. ఎందుకంటే కన్నతల్లితో కర్కశంగా మాట్లాడడం చూస్తే భర్తను కోడలు వారిస్తుందని ఆమెకు తెల్సు.

కాని అక్కడున్నదల్లా ఆ ఇద్దరే. తల్లీ-కొడుకూ-చివరకి అక్కడ పనిమనుష్యుల్ని కూడ ఉండకుండా అతను బయటికి పంపేశాడు...అయితే ఆమెని చంపుతాడా – ముసలి తల్లిని?

అతనన్నాడు: "అమ్మా! ఈ ఇంట్లో నీకున్న స్థానం ఎటువంటిదో నాకు తెలుసు. అయితే ఒకటి – నువ్విక్కడ ఉండదల్చుకుంటే నేను చెప్పినట్లు నువ్వు చెయ్యాలి. నా పిల్లల్ని మట్టుకు పాడుచేయకు. నా పిల్లలకు నేనే జవాబుదారీ. నీకు ఇంతకుముందు ఎన్నిసార్లు బ్రతిమలాడి చెప్పాం – పిల్లలకి ఏమీ పెట్టద్దని! అందులోనూ నేమేదో నిన్ను వస్తులుంచుతున్నట్లు నువ్వు నీ గదిలో దాచి మురగబెట్టే పాడు



శ్రీ కొల్లూరు వెంకటరామం: అక్టోబరులో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ వ్యాసరచన పోటీలలో రెండవ స్థానాన్ని గెలుచుకున్న ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థి. మొదటి స్థానం మైసూరుకు లభించింది.

సరుకులు నిన్న..." తన కోపాన్ని అణుచుకోవడంకోసం అతను ఒక్క క్షణం చెప్పడం ఆపి తిరిగి శాంతంగా ప్రారంభించాడు:

"నిన్న మామాట లెక్కలేకుండా ఏమీ తెలియని ఆ పిల్లకి పెట్టావు. రాత్రంతా దానికేమీ బాగులేదు."

"అది చాలా చిన్న రొట్టె!- మంచినీరా అబ్బాయ్" అన్నది ముసలమ్మ ఇంకా వదలని పట్టుదలతో.

"ఏమైనా కానీ, వాళ్ళకేమీ పెట్టవద్దని నీతో చెప్పానా లేదా" - రెట్టించాడు కొడుకు నిశ్చితంగా. ముసలమ్మ మరి కిక్కురుమనలేదు. ఇక ఒక్క క్షణం సహించలేక పెద్ద పెట్టున వినపడేటట్లు ఏడవనారంభించింది ముసలమ్మ.

"అయితే పొమ్మంటావా! పోనీయండి పోతా! నాకిక ఇల్లూలేదు, వాకిలీ లేదు- పోతాను."

ఆమె కొంత శాంతపడేవరకూ ఆగి కొడుకు ఓరిమితో అన్నాడు.

"అమ్మా! కొంత ఆలోచించు ఎట్లా పోతావు నువ్వు? ఈ ప్రపంచంలో ఎక్కడకని పోతావు చెప్పు?"—

"నేను నా కూతురు గారింటికి పోతాను" అన్నది బిగ్గరగా ముసలమ్మ. "అక్కడే వుండి అల్లుడింట్లో చాకిరీచేసి బ్రతుకుతాను. నేనింకా బలంగానే వున్నా. నా భుక్తికి సరిపడ్డది నేను తెచ్చుకోగల్ను."

దానికి కొడుకు చేదుగా నవ్వి అన్నాడు "నేనది ఆలోచించలేదనుకున్నావా? ఓసారి నిన్నక్కడ వాళ్లు ఉంచుకుంటానంటే నెలకింత డబ్బు చొప్పున పంపుతానని వ్రాశాను అక్కడికి. నువ్వు ఈ ఇంటి అలవాట్లని అలవర్చుకోవు. అంచేత నా భార్యకి చాలా ఇబ్బందిగా వుంది. అక్కడికి నేను వ్రాసిన ఉత్తరానికి జవాబుగా వాళ్లు 'మా ఇంట్లో మాపిల్లలతో నే వేగలేకుండా వున్నాం. ఇంకెక్కడ? అని వ్రాశారు"—

దాంతో ముసలమ్మ మరి మాట్లాడలేదు. నిజంగా ఆమె ఆలోచించలేదు. అది నిజమే తన నెప్పుడూ వాళ్లు ఉంచుకోరు. ఇంతవరకూ ఏదో ఇంకా కూతురు గారింటికి పోవచ్చని అనుకొనేది. కోడలిమీద కొడుకుమీద కోపంవస్తే వెనకాల పనిమనుష్యుల దగ్గర సణుగుతుంది. ఇంటికి ఎవరొస్తే వారి దగ్గర అంటుంది. చివరకి కూరగాయలు అమ్మకానికి పట్టుకొచ్చిన మనిషితోనైనా ఆ విషయం చెప్పేస్తుంది.

కాని ఇకముందు తాను అట్లా అనలేనని ఆమెకు తెలుసు. ఒకవేళ అన్నట్లయితే కొడుకు కళ్లు కష్టంగా తనకేసి చూస్తాయి.

"చూడమ్మా! మా ఆవిడ చదువుకున్నది. నువ్వు వట్టి అమాయకపు మనిషివి. ఇప్పుడు మనిద్దరం ఒంటరిగా ఉన్నాం కనక నేనీ మాటలు నీతో అంటున్నాను. నా పిల్లలు నవీన పద్ధతుల్లోనే పెరగాలి. నేనా విధంగానే పెంచాలనుకుంటున్నాను. మీరున్న ఇంటిమాదిరిగా ఇప్పుడు నా ఇల్లు వుండటానికి వీల్లేదు ఎక్కడపడితే అక్కడ నేలమీద ఉమ్మివేయడానికి వీల్లేదు. కోళ్ళను విచ్చలవిడిగా వదలకూడదు. నీ పిల్లలు తిన్నట్టు అవీ, ఇవీ అన్నీ తినడానికి వీల్లేదు."

ఆమెకు అమాంతం కోపం వచ్చింది. ఏడుస్తూ అంది:

"అయితే నువ్వు నా కొడుకువి కాదా?"

దాంతో కొడుకు విశదంగా విడమర్చి చెప్పేశాడు:

"నీలాగ నేనేమీ ఉన్న ఏడుగురు పిల్లల్లోనూ నలుగురిని చంపుకోలేను."—ఆ మాటలో ముసలమ్మ గజగజలాడిపోయింది. ఏడుస్తూ అతనికేసి మరోసారి చూసి "నా పిల్లల్ని నేను చంపుకున్నందుకు నువ్వు శిక్షిస్తావా అయితే?" అని అడిగింది. కొడుకు ఓరిమిఅంతా నశించిపోయింది. అతను గొంతు హెచ్చించకుండా ఉండలేకపోయాడు. బిగ్గరగా అన్నాడు:

"నీ మూర్ఖత్వాన్ని శిక్షిస్తాను. మంచి పద్ధతిని గ్రహించడానికి ఇష్టపడని నీ చాదస్తాన్ని శిక్షిస్తాను. అంతే"—అతనికింక చెప్పడానికేమీ లేక, ఆ చివరి కఠినమైన మాటలను ఆమెమీద వదలి వెళ్ళిపోతుంటే అతన్ని ముసలమ్మ వణికేకంఠంతో వెనక్కి పిలిచింది:

"అయితే నేచస్తా! చావుతప్ప నాకిక దారిలేదు! నేనే ఉరిపోసికొని......"

అతనామాటలు విని కోపంతో మండిపోయి వెనక్కి తిరిగి ఆమెకేసి చూశాడు. ఆ ముసలమ్మ ముఖంలో ఏర్పడిన అంతిమ సాహసం, నిరాశ గ్రహించి కోపంతో అన్నాడు:

"నాతో నేనా నువ్వు అంటున్నది? ఫలానావాడి తల్లి, కొడుకు ఇంట్లోనే ఉరి పోసుకు చచ్చిందనేవాదు నలుగురిలో వేసి నన్ను అప్రతిష్ట పాల్చేయడానికా!" - వెళ్ళిపోతూనే అతను 'డోర్ బెల్' నొక్కాడు. వెంటనే ఒక పనిమనిషి లోపలికి వచ్చింది.

"మా అమ్మకు మతిపోయింది. లక్షణాలు అలానే వున్నాయి. ఆవిడకు కావలసినవన్నీ చూస్తూ ఆమెను వదలకుండా రాత్రీ పగలూ కనిపెట్టుకొనివుండే ఒక 'అమ్మి'ని కుదుర్చు - కుదిర్చే భారం నీదే" అని అతను బయటకు వెళ్ళిపోయాడు. ముసలమ్మ పనిమనిషి కేసి తిరిగి.

"ఆఖరికి నన్ను చావనైనా చావనీయడేం ఖర్మం? చావడానికూడా వీల్లేదా" అని ఏడ్చింది. చిన్నపిల్లలా ఏడుస్తూ ముసలమ్మ పనిమనిషి ఆసరాగా కుర్చీదగ్గరకు నడిచి వెళ్ళింది.

"కూర్చో! కూర్చో! ముసలమ్మా! నీ కొడుకు నీకు తిండి బట్ట అన్నీ కల్పిస్తున్నా కొడుకును నువ్వే చెండనాడుకుంటున్నావ్. అతనితో పోట్లాడకు...అఁ. అతను చాలా ఓరిమిగలవాడని అంతా అంటుంటారు; నీకు తెలుసో తెలీదో!" అన్నది పనిమనిషి ఎప్పుడు చెబుదామా అని కనిపెట్టుకున్నదల్లా తేల్చి చెప్పేస్తూ.

★

ఒకడు తన మిత్రులతో కోతలు కోస్తూ అన్నాడు: అదేమిటో, నన్ను చూస్తే జంతువులన్నీ పడిచస్తాయ్. నేను కనిపిస్తానా, నాలో ఏం ఆకర్షణశక్తి ఉందో, కుక్కలూ, పిల్లులూ, ఆవులూ, మేకలూ తోకలాడిస్తూ వచ్చి నా చేతులు నాకుతాయి."

"బహుశా నువ్వు అన్నం తిని సరిగ్గా చేతులు కడుక్కోవు గాబోలు," అన్నాడొక మిత్రుడు.

గుండెజబ్బు పూర్వమంత ...

మూడు వేల సంవత్సరాలనాడు ఒక చక్రవర్తి హఠాత్తుగా మరణించాడు. రాజవైద్యులు విస్తుపోయారు.

ఏడు వారాల క్రితం ఒక పాశ్చాత్య చలనచిత్ర నటుడు హఠాత్తుగా మరణించాడు, వైద్యులు ఆశ్చర్యపడ్డారు.

ఈ రెండు హఠాన్మరణాలకీ కారణం...

గుండె జబ్బు.

ఆనాడు రాజు మృతికి కారణం ఏమిటో ఖచ్చితంగా తెలియలేదు వైద్యులకు. ఈనాడు ఈ నటుడి మృతికి కారణం తెలిసి కూడా ఆశ్చర్యపడ్డారు వైద్యులు. ఎందుకంటే అంతకు రెండు మూడు రోజుల క్రితమే అతడిని పరీక్షించారు. అప్పుడు అది కనబడలేదు.

కొద్ది సంవత్సరాల క్రితం వరకూ ఈ వ్యాధికి చికిత్స సంగతి అలా ఉండగా, అసలు స్వరూప స్వభావాలూ, కారణాలూ అంతుపట్టనే లేదు. ఇప్పటికీ కళ్లెం తగిలించడానికి అందకుండా ఉన్నదీ వ్యాధి.

అయితే ఈ కొద్ది సంవత్సరాలలోనూ దీన్ని గురించి చాలా తెలుసుకున్నారు. చికిత్సకు ఉపాయాలూ కనిపెట్టారు. ఈనాడు ఈ జబ్బు వచ్చిన వారిలో అధిక సంఖ్యాకులు తొలితాకిడికి తట్టుకొని బ్రతికి బయటపడుతున్నారు. ఆపైన ఈ వ్యాధితో తీసుకునే వారిలో అనేకులు పూర్తిగా కోలుకుని మామూలుగా జీవనం సాగించగలుగుతున్నారు. మిగతా వారిలో అధిక సంఖ్యాకులు ఒకమోస్తరుగా కోలుకుంటున్నారు.

లొంగనివి రెండే

గుండె జబ్బు అన్న మాటకి వైద్యుల పరిభాషలో స్పష్టమైన అర్థం లేదు. దీని క్రిందకు కొన్నిరకాల జబ్బులు వస్తాయి వాటిల్లో, అంటటిలో వచ్చే జబ్బు, సవాయి మొదలైన వాటివల్ల వచ్చే గుండె జబ్బుల గుణాలు, కారణాలూ, చికిత్సాసాధనాలూ సమగ్రంగా కనిపెట్టివేశారు.

.... అజేయం కాదు

గుండెజబ్బులలో లొంగకుండా ఉన్నవి స్థూలంగా రెండే. వాటిలో ఒకటి ఉగ్రమైన రక్తపుపోటు (హైపర్ టెన్షన్). రెండవది, గుండెకాయ కండరపు గోడల లోని రక్తనాళాలలో రక్తం గడ్డకట్టుకుపోవడం. దీన్ని ఎథెరో స్క్లెరాసిస్ అంటారు. ఇదే అత్యంత ప్రమాదకరం ఆర్టీరియో స్క్లెరాసిస్ అని ఈ జాతిదే ఇంకొక జబ్బు ఉంది. అంటే ధమనికలు (మంచి రక్తం ప్రవహించే రక్తనాళాలు) మొరటుబారి గట్టిపడిపోవడం.

కొళాయిగొట్టం వంటివి

మన శరీరంలో మంచిరక్తం ప్రవహించే నాళాలు అనుక్షణ చైతన్య స్ఫూర్తియుతమైనవి. ఎప్పుడూ లావు అవుతూ సన్నబడుతూంటాయి. అటువంటి నాళాలలో ఒకటి కొళాయిగొట్టంగా, గట్టిపడిపోతే యేమవుతుంది? దారుణమైన ప్రమాదం మాత్రం ఉండదు కొళాయిగొట్టంలో నీళ్లు ప్రవహించినట్టే ఈ గట్టిపడ్డ కొత్త గొట్టం గుండానూ రక్తం ప్రవహిస్తుంది. గొట్టం గట్టిపడినా సన్నబడడం మాత్రం జరగదు. ఎలాగో అలా రక్తం వెళ్లడానికి మార్గం వుంది. అది హృదయకోశంలో వెళ్లవలసిన చోట్లకు వెళ్తూ ఇవ్వవలసినదాన్ని ఇస్తూవుంటే ఫరవాలేదు. అందుకే వయసుమళ్ళినవాళ్లకి ఈజబ్బు వస్తే వైద్యులు ఏమంత ఆందోళన చెందరు.

అసలుకే మోసం...

అయితే కొళాయిగొట్టంలోపల మెల్లగా తుప్పుపట్టడం చెత్తచేరడం ప్రారంభమైతే, గొట్టం ఇరుకైపోతుంది. నీళ్లు ధారాళంగా ప్రవహించవు. ఆ తుప్పు కాస్త యెక్కువైతే, నీరు అసలు వెళ్లదు ఈ తతంగం ధమనికలో జరిగితే ఎక్కడో ఒకచోట రక్తం గడ్డకట్టిపోతుంది.

'గుండెజబ్బువల్ల హఠాన్మరణం' అనేస్తారు. థ్రాంబసిస్ అని వైద్యులు చెప్పుకుంటారు. అది హృదయకోశ ధమనికలలో సంభవిస్తే కొరోనరీ థ్రాంబసిస్ అనీ, కణతలోని ధమనికలలో జరిగితే సెరిబ్రల్ థ్రాంబసిస్ అనీ అంటారు ఈ రక్తం గడ్డకట్టుకుపోవడం అనేది ఎక్కడైనా జరగవచ్చు. ఒకొక్కసారి కాలిలో ఎక్కడో గడ్డకడుతుంది. అక్కడి కణాలు కొన్ని రక్తప్రవాహంలో చొరబడి, ఊపిరితిత్తులదాకా వెళ్లిపోతూవుంటాయి అయితే తరచుగా ఈ వ్యాధి హృదయకోశంలోని ధమనికలలోనే వస్తూవుంటుంది.

ఇరుగు పొరుగులు -

కొన్ని సందర్భాలలో థ్రాంబసిస్ వచ్చినట్లు తెలియనే తెలియదు. శరీరంలో దీనికి తగిన సదుపాయాలు ఉన్నాయి. ఒక ధమనికలో రక్తం ముద్దకట్టడం మొదలుపెడితే, అందులో రక్తప్రవాహం క్రమంగా సన్నబడతూ వుంటుంది. అటువంటి సమయంలో దానికి పొరుగునవున్న ధమనిక

కాలేయంలో మానవుడి ఆత్మ

శరీరంలో అన్ని భాగాలచేత సక్రమంగా పనిచేయించే ప్రధానకేంద్రం హృదయకోశం అన్న సంగతి ఐదు వేల సంవత్సరాల క్రితమే ఒక వైద్యుడు కనుగొన్నాడు ఆయన ఈజిప్టు దేశీయుడు. పేరు ఇంహటాప్. గుండెకాయకూ నాడికీ సంబంధం ఉందని ఆయన అనాడే గ్రహించాడు.

క్రీస్తుపూర్వం వెయ్యి సంవత్సరాల క్రితం చైనా దేశస్థుల నమ్మకాలు బహు చిత్రంగా కనబడతాయి:

రక్తంఅంతా నిలవచేసేది జీర్ణకోశం పక్కన ఉండే కాలేయం అనే సంచిలోనట. అందులో మానవుడి 'ఆత్మ ఉంటుందట. నాడిని పనిచేయించేది గుండెకాయ. ఈ నాడిలో చైతన్యం ఉంటుంది. ప్లీహము ఆలోచనాశక్తి నిలయం. ఊపిరితిత్తులు శక్తి నిలయాలు. మూత్రపిండాలు మనోబలానికి ఆలవాలమైనవి.

లలో ఒకటి రెండు [illegible] అవుతాయి. అపుడు యీదారిన పోవలసిన రక్తం, రోడ్డుమార్చి పక్కధమనికలో ప్రవేశించి, గమ్యస్థానం చేరుకుని చేయవలసినపని చేస్తూవుంటుంది. రక్తం గడ్డకట్టడం అనేది తాపీగా కొన్ని నెలలపాటు జరిగితే యీ యిరుగు పొరుగుల తోడ్పాటు సాధ్యం అవుతుంది. ఇలా జరిగితే ఒక మనిషి జీవితకాలంలో, ఇంత అంత ర్నాటకం జరిగినట్లు తెలియకుండానే జీవితం సాఫీగా సాగిపోతుంది. అనేక సందర్భాలలో ఇదే జరుగుతూ ఉంటుంది. అలా కాక అతి త్వరగా జరిగితే అది ప్రాణాంతకం కావచ్చు. ఒకసారి తాకిడికి తట్టుకున్నవారికి, మళ్లా ఎప్పుడైనా, ఇంకో చోట ఇలా జరిగితే ఇరుగుపొరుగు ధమనికలు ఆదుకుంటాయి.

ధమనిక స్వరూపం

సిరలవలె ధమనులు పల్చటి గోడలున్న గొట్టాలు కావు. ధమనిక గోడలకి మూడు పొరలు ఉంటాయి. లోపలిపొర (ఇంటిమా) సున్నితంగా పల్చగా ఉంటుంది మధ్య పొర (మీడియా) కండరములతో కూడినది. ఈ కండరాలు సాగుతూ ముడుచుకుంటూ ఉన్నందువల్లనే ధమనిక చలనం సాధ్యం అవుతుంది. పైపొర (ఎక్స్టర్నా) నరాలతో చేసిన కవచంవంటిది. దీనివల్ల ధమనికకు దార్ఢ్యం చేకూరుతుంది.

త్రాంబసిస్ ఎలా వస్తుంది?

ఆర్టిరియోస్క్లెరోసిస్ రావడం అంటే ఈ ధమనిక గోడలోని మధ్యపొర (కండరాలపొర) గిడసబారిగట్టి పడిపోవడం.

ఎథరోస్క్లెరోసిస్ లోపలిపొరలో సంభవిస్తుంది. అంటే, ఈ లోపలిపొర క్రమ క్రమంగా దళసరి అవడం మొదలు పెడుతుంది. పోనుపోను దీని ఉపరితలం గరుకుగా తయారవుతుంది. చిన్న చిన్న కణాలు ఈ గోడని అంటిపెట్టుకు ఉండిపోతాయి. ఈపొర దళసరిఅయితే, ధమనిక లోపల చోటు తగ్గిగొట్టం సన్నబడుతుందే తప్ప, ఇది పై పొరలను వెనక్కి తోయ్యలేదు. అందువల్ల రక్త ప్రవాహం సన్నగిలుతుంది. దీనికితోడు కణాలుకూడా ఈ గోడని అంటిపెట్టుకుంటే చోటు మరీ తక్కువ అవుతుంది. క్రమంగా అక్కడ రక్తం గడ్డకడుతుంది. గరుకుచోటు తగిలితే గడ్డకట్టడం రక్తం సహజలక్షణం.

కొలెస్టరాల్ కథ

కొలెస్టర్ అనేది ఒక కొవ్వు పదార్థం. రక్తం గడ్డకట్టిన ధమనికలు తెరచి చూడగా, ఆ లోపలిపొరని అంటి పెట్టుకుని ఉన్న కణాలలో ఇది ఎక్కువగా కనబడుతుంది. గత పదేళ్లుగా దీనిపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ కొలెస్టరాల్ అనేది బీటా మాంస కృత్తులలో గర్భితమై ఉండి రక్తంలో ప్రయాణం చేస్తూ ఉంటుంది. దీని విషయమై పరిశోధనలు ఇంకా జరుగుతున్నాయి. ఇప్పటికి స్థాపించిన సిద్ధాంతం ఈ విధంగా ఉంది:

రక్తం, బృహద్ధమనులనుండి కేశనాళికల వరకూ వెళ్ళేటప్పుడు, అందులో కొంత, ధమనికల గోడల ద్వారా అవతల వైపుకి ఊరి శరీరంలో ఆయా జీవకణాలకు అవసరమైన పదార్థాలను అందచేస్తుంది. ఇలా గోడలు దాటి వెళ్ళినపుడు కొలెస్టరాల్ ఉన్న కొన్ని కణాలు ఈవడ పోతకు లొంగక ధమనిక లోపలిపొర (ఇంటిమా) గోడకి అంటి పెట్టుకు ఉండిపోతాయి. తరచుగా అలా ఉండిపోయేవి బీటా మాంసకృత్తులు. ఆ మాంసకృత్తుల పొర విడిపోతే, దారుణమైన కొలెస్టరాల్ కణం బయట పడుతుంది. ఇది రక్తంలో కరగదు. 'ఇంటిమా'ను అంటిపెట్టుకు ఉంటుంగి ఇలా తరచుగా, జరిగి, కొలెస్టరాల్ కణాలు చేరడం మొదలు పెడితే, ఆ ధమనిక లోపలిపొర క్రమేపి దళసరి అవుతుంది గరుకు బారుతుంది, ఆ పైన, రక్తం అక్కడ పేరుకుపోతుంది.

చికిత్స

ఈ వ్యాధికి నాందిగా ధమనిక గోడలు

గుండె జబ్బు; కొన్ని అపోహలు

గుండెజబ్బు విషయంలో కొన్ని అపోహలు ప్రచారంలో ఉన్నాయి. వీటిపై ప్రమాణశాస్త్రజ్ఞులు జరిపిన సమగ్ర పరిశోధనల ఫలితంగా, వీటిలో ఏ ఒక్కటీ ఇదమిత్థంగా ఒక సిద్ధాంతంగా స్థాపించలేమని తేలింది.

అయితే మానసిక ఉద్వేగం, చింత, శారీరక శ్రమ ఉండరాదని, మందుమాకులకన్న ముఖ్యం గుండెధైర్యం, విశ్రాంతీ నని మాత్రం శాస్త్రజ్ఞులు గట్టిగా చెబుతున్నారు.

గుండెజబ్బుకి ఎన్నడూ తిరుగు లేదని ఒకఅపోహ: గుండెజబ్బులలో మూడు నాలుగురకాల స్వభావాలు, చికిత్సా విధానాలు కనుగొనబడ్డాయి ఆర్టిరియోస్క్లెరాసిస్, ఎథరోస్క్లెరాసిస్ అనేవి వేర్వేరు వ్యాధులని, రెండవదే ప్రమాదకరం అనీ ఇపుడు తెలిసింది. దీనికి మందులూ తెలిశాయి. ఈ వ్యాధిని పూర్తిగా జయించడానికి భారీఎత్తున కృషి జరుగుతోంది. ఇది పూర్వమంత అజేయం కాదు. ఎందరో కోలుకుంటున్నారు.

హఠాన్మరణం: ఒక ధమనికలో రక్తం గడ్డకడితే ఇరుగుపొరుగు ధమనికలు విశాలం అయి రక్తప్రవాహాన్ని సర్దుబాటు చేసుకుంటాయి. దీనివల్ల ఒక్కొక్కసారి రక్తం గడ్డకట్టినసంగతి తెలియకుండానే జీవితం సాఫీగా సాగే అవకాశాలు చాలా ఉన్నాయి. పెద్ద ధమనికలో ఈ ప్రమాదం జరిగితే త్వరగా మరణం సంభవించవచ్చును. ఏవో అరుదైన వ్యాధులవల్ల తప్ప మామూలుగా ఇది జరుగదు.

అలాగే తిండికి తగినంతశ్రమ లేకపోతే వస్తుందని ఒకభావం ఉంది. ఈ తరహాకు చెందనివారికి ఎందరికో ఇది వచ్చింది. కొవ్వు పెరిగినవారికి రాని సందర్భాలూ ఉన్నాయి. ఎస్కిమోలు విపరీతంగా కొవ్వు తింటారు. వారిలో ఈ వ్యాధి లేదు. ముత్తానికి కొవ్వు అతిగాను కూడదు. మానివెయ్యనూ రాదు.

కాఫీ, సిగరెట్లు, వ్యాధి ప్రకోపింపచేస్తాయని ఒకవాదం. వీటవల్ల కీడుమాట ఎలా ఉన్నా మేలుమాత్రం లేదు. అయితే వీటికి బాగా అలవాటు పడ్డవారిలో గుండెజబ్బు వచ్చినవారిచే బలవంతాన మాన్పిస్తే మేలు మాట ఎలా ఉన్నా కీడే ఎక్కువ అని ప్రముఖుల నిశ్చితాభిప్రాయం. అందువల్ల ఒక మితి పెట్టడం మంచిది.

గుండెజబ్బు పూర్వమంత అజేయంకాదు

డళ్ళసరి అవడం మొదలుపెట్టి రక్తప్రవాహానికి మార్గం ఇరుకైతే, ముమ్ముందు రాగల ప్రమాదానికి హెచ్చరికగా గుండెనొప్పి రావడం మొదలు పెడుతుంది. అయితే, ఈ గుండెనొప్పి లక్షణం వేరు. ఛాతీ మధ్య భాగాన ఎంతో భారంగా ఉండడం రాయి పెట్టినట్టుగా అనిపించడమూను. మామూలుగా జీర్ణకోశంలో వాయువు ఏర్పడడం వంటిది జరిగితే, వచ్చే నొప్పి వేరు. ఛాతీ ఎడమ పక్కన నొప్పివస్తే అది గుండెజబ్బుకి సూచన అని భయపడనవసరం లేదు. ఏదేమయినా నొప్పి వచ్చినపుడు వైద్యుడిచే పరీక్ష చేయించుకోవడం ఉత్తమం. కొస్త ఎక్కువగా భోజనం చేసినపుడు, జబ్బు చేసినపుడు, శ్రమ పడ్డపుడు, ఎక్కువ రక్తాన్ని పంపడం సాధ్య పడనపుడు గుండెలో నొప్పి వస్తుంది. అటువంటప్పుడు 'నైట్రోగ్లిసరిన్' మాత్రని నాలిక క్రింద ఉంచి మెల్లిగా కరగనిస్తే నొప్పి తగ్గుతుంది.

తాకిడి హఠాత్తుగావచ్చి ప్రాణం పోతే హార్ట్ ఫెయిల్యూర్ అంటారు. అంటే, గుండెకాయ చేయవలసినపని చేయలేక పోయిందని అర్థం. హఠాత్తుగా తాకిడి వచ్చినపుడు, వెంటనే మార్ఫైన్ ఇంజక్షన్ ఇస్తారు. కొంత ఉపశమించాక, రక్తం గడ్డకట్టడాన్ని నిరోధించే హెపరిన్, డిక్యూమెరాల్ ఇంజక్షన్‌లు ఇస్తారు.



HVM. 253-50 T)

కళావరు గడ్డి

హెపరిన్ మన శరీరంలో కూడా ఉంటుంది. గంధకి కామ్లం ఎక్కువగా ఉండే ఈ ద్రవ్యంవల్లనే మన రక్తం గడ్డ కట్టుకు పోకుండా ప్రవహిస్తూ ఉంటుంది. ఒంట్లో ఉన్న హెపరిన్‌వల్ల సాధ్యపడనప్పుడు, ఇంజక్షన్ ఇస్తారన్నమాట. ఇక, డిక్యూమరాల్ అన్నది చిక్కుడు జాతికి చెందిన కళావరు గడ్డినుండి తయారుచేసే ఔషధం. కళావరు గడ్డిలో అనేక రకాలున్నాయి. పాశ్చాత్య దేశాలలో దొరికేవి కొన్ని జాతులు. పర్షియా కళావరుగడ్డి అని వేరొకటి ఉంది. ఇంకో జాతి ఈజిప్టులో ఉంది. మనదేశంలో పంజాబ్ ఉత్తరప్రదేశ్ ప్రాంతాలలో విరివిగా ఉంది. ఈ గడ్డిని పశుగ్రాసంగా వినియోగిస్తారు. ఇంగ్లండులో తియ్య కళావరు అని ఒక జాతి. దీనికి ప్రాణాలు తీసే శక్తి, పోసే శక్తి కూడా ఉన్నాయి. ఈ ఆకులోనే కొమరిన్ అనే ఒక పదార్థం ఉంది. ఇది రక్తాన్ని గడ్డకట్టనివ్వదు కొస్త ఎక్కువగా వాడితే, రక్తం ఉధృతంగా ప్రవహించి, ప్రాణాంతకం అవుతుంది.

గుండె ధైర్యం ముఖ్యం

గుండెజబ్బు వచ్చినట్లు తెలుసుకున్న రోగి అయ్య బాబోయ్ అంటాడు.

'ఇంకేందారి ఈశ్వరా' అని తల్లడిల్లి పోతుంది ఇల్లాలు. చికిత్సకొచ్చిన వైద్యుడు గంభీరంగా చూసి, 'ఉప్పు ముట్టరాదు, చుట్ట కాల్చరాదు, కొవ్వు పదార్థం దరికి రానివ్వరాదు, అడుగు కదపరాదు, అలసట పడరాదు, అదికూడ దిదికూడదంటూ చెబుతాడు. ఇల్లా కూడనిపనుల జాబితాకన్న ఏవి చేయవచ్చునో చెప్పడం మంచిది.

గుండెజబ్బువచ్చి బ్రతికి బయటపడుతున్న వారెందరో ఉన్నారన్న సంగతి రోగికి తెలియచేసి ధైర్యం చెప్పడం చాలా ముఖ్యం. ఈ వ్యాధి చికిత్సలో ధైర్యం, విశ్రాంతి ప్రథమవిషయాలు. ఆ తరువాతనే మందుమాకులు అని ఈ నాటి ప్రముఖశాస్త్రజ్ఞుల వైద్యుల ప్రవచనం. ★

అదోరకం ముచ్చట ★

"చిత్రంగా ఉందే...ఒక్క నిముషం ఉండండి. కోటు జేబులో ఉందేమో చూస్తాను" అన్నాడు అప్పారావు తొట్రుపడుతూ.

"అబ్బే తొందరేం లేదు. తాపీగా చూడండి" అన్నాడు టిక్కెట్టు కలెక్టరు— ఖాళీగా ఉన్న మూడవ తరగతి పెట్టెలో కాళ్లు బారజాచి కూర్చుంటూ.

అప్పారావు కోటు తడవడం మానేసి కిందనున్న పెట్టెను కొంచెం పక్కకి లాగాడు.

"ఏమండీ మీరు అహో రాత్రాలు రైళ్ళలోనే తిరుగుతూ ఉంటారు. టిక్కెట్టు కొనుక్కొని కూడా రైల్లో బల్ల అడుగున దూరి ప్రయాణం చేసిన ఆసామీ కథ విన్నారా?" అన్నాడు.

"ఎవరండీ. గుర్తులేదే" అన్నాడు టిక్కెట్టు కలెక్టరు సిగరెట్టు ముట్టిస్తూ.

"మహాద్భుతమైన కథలెండి. ఈ లైనులోనే జరిగింది. తెనాలి బెజవాడ స్టేషన్ల మధ్య ఓ సుబ్బారావూ ఇంకో సింగారం తెనాలినించి బెజవాడ బయలుదేరారు. సుబ్బారావు టిక్కెట్లుకొని, హడావుడిగా ముందు నడుస్తూ ఇదిగో టిక్కెట్లు మీదగ్గిరుంచండి అని సింగారానికి అందిచ్చాడు. గోచీ సర్దుకుంటూ ఆదరా బాదరా వెనకాల వస్తున్న సింగారం అందుకుని జేబులో పడేసుకున్నాడు" అని ఆగి, కోటు జేబులో వెతకడం మొదలు పెట్టాడు. "చిత్రంగా ఉందే ఇక్కడా లేదు సుమండీ" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"సరే కథ చెప్పండి."

"కథకేముంది. సుబ్బారావు అందిచ్చినవి రెండు టిక్కెట్లయితే సింగారం అందుకున్నది ఒక్క టిక్కెట్టే. రైలు బైల్దేరాక వాళ్ళి సంగతి తెలుసుకున్నారు. 'రెండూ నీకే ఇచ్చా'నంటాడు సుబ్బారావు. కాదొక్కటేనంటాడు సింగారం. ఇంకో టికెట్టు కొనడానికి ఇద్దరి దగ్గిరా కూడా డబ్బు లేదు. "నే నిచ్చిన డబ్బుకి నాకు టిక్కెట్టిచ్చావు. ఆపైన నాకేం తెలీదు" అవటా అనేశాడు సింగారం. "అయితే నన్ను బల్లకింద దూరమంటావా" అన్నాడు సుబ్బారావు దిక్కుమొహం పెట్టి. నాకేం అభ్యంతరం లేదు అన్నాడు సింగారం. అతను మాత్రం ఏం చేస్తాడు చెప్పండి టిక్కెట్టు కలెక్టరుగారూ!" అన్నాడు అప్పారావు.

"మరే మరే. అంతే కదండి. తనకి మాలిన ధర్మం ఏముంది?" అన్నాడు టికెట్ కలెక్టరు.

"సరే సింగారం బల్లమీద కూర్చున్నాడు. టిక్కెట్టులేని సుబ్బారావు బల్లకిందదూరాడు. అంతలోకే పక్కపెట్లోంచి మీ వంటి ఆయనే ఒక టిక్కెట్ కలెక్టరు వచ్చాడు. చాలా మంచివాడు లెండి. అయినా ఈ సంగతి బల్లక్రింద పడుకున్న సుబ్బారావుకి తెలీదుగా. అసలే బల్లక్రింద నారింజ తొక్కలు, పిప్పి, చుట్టపీకలు బీడీ ముక్కలూ, పులిహోరలో మిరపకాయలు ఎంగిలాకులు వల్లకాడు వశనపరం మొదలైనవి మోకాల్లోతున ఉన్నాయేమో సుబ్బారావు ఊపిరి సలపక ఉక్కిరిబిక్కిరై పోతున్నాడు."

"పాపం"

"అంతలో 'టికెట్ టికెట్' అనే భయంకరమైన మాటలు వినిపించాయి టకటకమంటూ బూటు కాళ్లు కనిపించాయి. సుబ్బారావు గుండె గుభేలుమంది..." అప్పారావు ఆగి, పరీక్షగా చూశాడు.

టికెట్ కలెక్టరు కళ్లు రెపరెపలాడించి మందహాసం చేశాడు.

"సరే టిక్కెట్ కలెక్టరువచ్చి సింగారాన్ని టిక్కెట్ అడిగాడు. సింగారం బల్లకింద సుబ్బారావుని తలచుకొని కొంచెం కంగారుపడుతూ టికెట్ అందిచ్చాడు... అప్పుడేమయింది తెలుసాండి?"

"తెలీదండీ"

"ఆ కంగారులో సింగారం అందివ్వబోయిన టిక్కెట్టు చేతిలోంచి జారిపోయింది...... సింగారం వంగిచూస్తే కనబడలేదు. లేచి నుంచుని పంచె కుచ్చెళ్లు దులిపాడు" అన్నాడు అప్పారావు.

"అప్పుడేమయింది?"

"ఏమవుతుంది. సింగారం టిక్కెట్టుతో పాటు ఇంకో టిక్కెట్టుకూడా కిందపడింది. ఆ రెండోది కూడా మంచిదే. తెనాలిలో సుబ్బారావు అందిచ్చిన రెండు టిక్కెట్లలో అది రెండవదన్నమాట. జారిపడి సింగారం పంచె కుచ్చెళ్లలో పాదాలమీద ఉన్న మడతలో తలదాచుకుంది"

"చిత్రంగా ఉందే" అన్నాడు టిక్కెట్ కలెక్టర్.

"ఆ వేళ రైల్లో ఎక్కిన టిక్కెట్ కలెక్టరు కూడా అదేమాట అన్నాడండి రెండు టిక్కెట్లు చూసి రెండో ఆయన ఏడీ?" అడిగాడు... "బల్ల కింద పడుకున్నాడండి. అదో సరదా అదో రకం ముచ్చటా లెండి" అన్నాడు సింగారం సిగ్గుపడుతూ ఏంచి.

కథ విన్న టికెట్ కలెక్టరు, కడుపుబ్బేలా, కణతలు ఎర్రపడేలా కంటనీరు తిరిగేవరకూ నవ్వాడు. నవ్వడం పూర్తి అయిపోయాక "సరే మీ టిక్కెట్ దొరికిందా" అని అడిగాడు గంభీరంగా.

అప్పారావు టికెట్ దొరకలేదు. ముచ్చెమటలు పోశాయి. జేబు రుమాలుతీసి మొహం తుడుచుకోబోయాడు అందులోంచి, ఒక టిక్కెట్టు నేలగాలింది. అదుగో అన్నాడు అప్పారావు వంగి. ఆ వంగినవాడు అరనిముషం వరకూ లేవలేదు. అరనిముషం తరవాత నిటారుగా నిలబడి రెండు టిక్కెట్లు చూపించాడు. టిక్కెట్ కలెక్టరు కళ్లు విప్పార్చి చూశాడు అప్పారావు వంక.

"రెండోది నా పంచె కుచ్చెళ్లలో ఉందండి...మా నేస్తం..."

బల్లకింద పడుకున్న ఆ నేస్తం కింద పడున్న సిగరెట్ పీకతో చురక పెట్టాడు అప్పారావు కాలిమండ దగ్గిర. అప్పారావు కెవ్వున్నాడు.

—రవణ

"డబ్బుపోసి నన్ను కొనుక్కునికూడా బల్లకింద దూరాడు వెర్రి వెంగళాయి" అనుకుంది రైలు టిక్కెట్టు.

"అదోముచ్చట కాబోలు" అనుకున్నాడు టిక్కెట్టు కలెక్టరు.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంక్రాంతి సంచిక

కథానికల పోటీ

మొదటి బహుమతి రు. 75 రెండవ బహుమతి రు. 50.

రచనలు చేరవలసిన ఆఖరుతేది 10-12-55

ఆంధ్రపత్రిక - సచిత్ర వారపత్రిక 1956 సంక్రాంతి ప్రత్యేక సంచిక ప్రచురణ పురస్కరించుకుని కథానికా రచనకు ప్రోత్సాహమివ్వవలెననే ఉద్దేశంతో పోటీ జరపాలని నిశ్చయించాము.

పోటీకి వచ్చే కథానికలలో శ్రేష్ఠమైన రెండు రచనలకు రు. 75, రు. 50 బహుమతులివ్వబడతాయి.

సామాజిక ఇతివృత్తాలుగల స్వతంత్ర రచనలే పోటీకి స్వీకరించబడతాయి.

పోటీ కథానికలు మా కార్యాలయానికి 1955 డిసెంబరు 10 వ తేదీలోగా చేరాలి.

బహుమతుల గురించిన తుది నిర్ణయాధికారం సంపాదకులకే ఉంటుంది.

పోటీకి పంపే కథానికలకు రేపర్లపైనా, రచన మొదటి పుట పైనకూడా స్పష్టంగా "ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక సంక్రాంతి కథానికల పోటీకి" అని వ్రాయాలి.


రచనలు తెల్ల కాగితాలలో సిరాతో ఒకే వైపున వ్రాసి పంపాలి.

బహుమతి నిర్ణయం అనంతరం ప్రచురణకు స్వీకరించబడని రచనలను త్రిప్పి పంప గోరే రచయితలు తమ రచనలతో పాటే తిరుగు పోస్టుకు అవసరమైన స్టాంపులు జతపరిచి పంపాలి.

సంక్రాంతి సంచికకు గానుఇతర వ్యాసాలు, కథానికలు, చిత్రాలు, ఫోటోలు పంప దలచిన వారు కూడా 1955 డిసెంబరు 10 వ తేదీలోగా మా కార్యాలయానికి అందేటట్లు పంపాలి. చిత్రాలు ఇండియన్ ఇంక్‌లో వ్రాయాలి. ఫొటోలు గ్లాసీ ప్రింట్సు మాత్రమే; కార్డు సైజుకి తక్కువ కాకుండా ఉండాలి.

రచయితలు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని మా సంకల్పాన్ని జయప్రదంగా నెరవేర్చగలరని ఆశిస్తున్నాము.


—సంపాదకుడు.



మానవుని మహత్తర సృష్టి!
దేశదేశాలవారిని దిగ్భ్రాంతులను చేసిన తాజమహల్‌ను నవంబరు ౨౦ వ తేదీన దర్శించిన



నవంబరు 21 వ తేదీన రాజ్యసభ, లోక్ సభల సంయుక్తసమావేశంలో బుల్గానిన్, కృష్చేవ్ ప్రసంగించారు. వేదికమీద ప్రసంగిస్తున్నవారు బుల్గానిన్, ప్రక్కనున్నవారు శ్రీ రాధాకృష్ణన్, శ్రీ జి వి మావ్లంకర్, కృష్చేవ్. దిగువ చిత్రం: రష్యన్ నాయకుల ప్రసంగాలు వింటున్న పార్లమెంటు సభ్యులు, ప్రధాని నెహ్రూ, జి బి పంత్, ఆజాద్ ప్రభృతులు.





హిందీ తార [illegible]



ఏ. వి. ఎమ్. వారి తెలుగు చిత్రం "సంఘము"లో జానకి.

బొంబాయి సినిమా లేఖ

దక్షిణ భారత చలనచిత్ర స్టుడియో యజమానుల సంఘం, నిర్మాతలసంఘం (గిల్డు) ఇటీవల మద్రాసులో జరిపిన సమాలోచనలఫలితంగా, అమెరికా చిత్రనిర్మాతలసంఘం తరహాలో అఖిలభారత చలనచిత్ర నిర్మాతల సంఘం నెలకొల్పాలన్న నిర్ణయం జరిగినందుకు చలనచిత్రరంగంలో సర్వే సర్వత్రా హర్షామోదాలు వెలిబుచ్చుతున్నారు. చలనచిత్రరంగంలో ఐక్యత పెంపొందడానికి దీనివల్ల ఎంతో దోహదం జరుగుతున్నదని మెచ్చుకుంటున్నారు. భారతీయ చలనచిత్ర నిర్మాతల సంఘాధ్యక్షుడు (ఐ. ఎం. పి. పి. ఎ.) శ్రీ ఎస్. కె. పాటిల్ మద్రాసు సమావేశంలో జరిగినకృషిని ప్రశంసిస్తూ, మొత్తానికి, ఈ పరిశ్రమకు జీవగర్ర అయిన చలన చిత్ర నిర్మాతలంతా ఒక సంఘంగా వీర్పడికలసికట్టుగా మెలగితే, ఈనాడు చలనచిత్రపరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్య లెన్నో సులభంగా పరిష్కరించబడతాయన్నమాట అన్నారు.

ముఖ్యంగా చలనచిత్ర పరిశ్రమ పరిశీలక సంఘం సిఫార్సుచేసిన "నేషనల్ ఫిలిం బోర్డ్, ఫిలిం ఇన్‌స్టిట్యూట్ వంటివి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న ఈ తరుణంలో నిర్మాతలంతా కలసి ఒక సంఘంగా నిలబడాలని నిశ్చయించుకోవడం ముదావహం. ఇందువల్ల, ప్రభుత్వం ఆ సిఫార్సులను అమలుజరిపినపుడు నిర్మాతలు మంచీ చెడ్డా సాధక బాధకాలు కలసి ఆలోచించుకొని, ప్రభుత్వానికి గట్టిగా చెప్పవచ్చు; చెప్పి ఒప్పించవచ్చు.

* * *

పృథ్వీరాజ్ కపూర్ నాయకత్వాన చైనా పర్యటనకు వెళ్లిన భారత చలనచిత్ర ప్రతినిధివర్గం మొన్న తిరిగి వచ్చారు. చైనాలో ప్రదర్శించిన భారతీయ చిత్రాలు దో బిఘా జమీన్, అంధియాన్, ఆవారా బహుళ జనాదరణ పొందినవని, శ్రీ బిమల్ రాయ్ అన్నారు. ఈ చిత్రాలకు చైనా భాషలో సబ్ టైటిల్సు ఏర్పాటుచేశారు.

ఈ బృందంతో వెళ్లిన చిత్రనిర్మాత శ్రీ చేతన్ ఆనంద్ ఒక కొత్తచిత్రం తీయడానికి ఒప్పందంకూడా చేసుకువచ్చారు. ప్రఖ్యాత చైనా యాత్రికుడు హుయెన్ సాంగ్ జీవితాన్ని చిత్రీకరించడానికి చైనా, రష్యా, భారతదేశాలు కలసి కృషి చేస్తాయనీ, అప్పుడే హుయన్‌సాంగ్ చరిత్రకు సంబంధించిన వివరాలన్నీ సమగ్రంగా సేకరించడానికి చైనాలో ఒక సంఘం ఏర్పాటు అయినదనీ మన దేశంలోకూడా త్వరలోనే ఒక సంఘం నెలకొంటుందనీ చేతన్ ఆనంద్ చెప్పారు.

ఈ చిత్రాన్ని హిందీ, చైనీస్, రష్యన్ భాషలలో తీయాలని సంకల్పించారు. బహుశా ఇంగ్లీషులోకూడా తీయడం జరగవచ్చు. ఈ చిత్రాన్ని "రష్యన్ కలర్"లో నిర్మిస్తారనికూడా ఆయన చెప్పారు.

* * *

రత్నదీప్‌పిక్చర్స్ భారీఎత్తున నిర్మిస్తున్న కాస్ట్యూమ్ చిత్రం "జయశ్రీ" దాదాపు పూర్తి కావచ్చింది. బాలచంద్ర శుక్ల, హార్‌సుక్ భట్‌ల సంయుక్త సారథ్యంక్రింద తయారవుతున్న ఈ చిత్రంలో నిమ్మి, ప్రదీప్‌కుమార్, జయంత్, రాధాకృష్ణ, రూప్‌మాల, లలితాపావర్ నటిస్తున్నారు

* * *



బొంబాయి తారల దీపావళి ఉత్సవాల సందర్భంలో నదీరా, నర్గీస్.

బొంబాయిసినిమా లేఖ

ఇటీవల కొంతకాలంగా కనబడని రెహమాన్ ఇప్పుడు తిరిగి ఆర్. వి. ప్రొడక్షన్స్ చిత్రం 'పోస్ట్‌మాస్టర్'లో నటిస్తున్నాడు. కిరణ్‌కుమార్ దీనికి దర్శకుడు. షీలా రామాని, కుంకుం, మోహిని, ఓంప్రకాశ్ కూడా ఉన్నారు.

(ఆంధ్రవారపత్రిక బొంబాయి విలేఖరి)

సినిమా వార్తలు

'ఏది నిజం!'

ప్రతిభా వారి 'ఏది నిజం' దాదాపు సగం పూర్తి అయింది. ఇన్నాళ్లూ చిన్న వేషాలు వేస్తున్న నాగభూషణం ఈ చిత్రంలో తొలిసారిగా ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాడు. జానకి, పి. హేమలత, జోగారావు, శంకర, రమణారెడ్డి, గుమ్మడి, సీతారామయ్య ప్రభృతులు నటిస్తున్న ఈ చిత్రానికి బాలచందర్ దర్శకత్వం వహిస్తున్నారు. సహాయదర్శకుడు జి. ఎస్. స్వామి. సంగీతం వేణు.

* * *

దర్శకనిర్మాత షహీద్‌లతీఫ్ రెండు కొత్తచిత్రాల నిర్మాణం తలపెట్టారు. వీటిలో 'సోనే కీ చిడియా' అనే చిత్రాన్ని డిసెంబరు 8న ప్రారంభిస్తారు. రెండో చిత్రం "ఆవారా షాహజాదా" దర్శకత్వం తమ సహాయకుడుగా ఉంటున్న అథర్ సిరాజ్‌కు ఒప్పగిస్తారట.

* * *

ఫిలిం ఆర్ట్స్ "చిత్రం" 'హంజోర్ తుం' నుండి కల్పనా కార్తిక్‌ను తొలగించి, ఆ పాత్రను 'శ్యామ'కు ఇచ్చారు మందీ బర్మన్ దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రంలో కుంకుం, ఎస్. కె. ప్రేం, జానీ వాకర్ నటిస్తున్నారు.

* * *

ఎ. వి. ఎం. వారి హిందీ చిత్రాలు 'భాయ్ భాయ్' 'చోరీ చోరీ' లు రెండిటి నిర్మాణం చాలా చురుకుగా సాగుతూంది. భాయ్‌భాయ్‌లో అశోక్‌కుమార్, నిమ్మి, నిరూపరాయ్, కిశోర్‌కుమార్, నిగార్, ఓంప్రకాశ్, డేవిడ్‌లు ఉన్నారు. దీనికి శ్రీ ఎం. వి. రామన్ దర్శకుడు. సంగీతం మదనమోహన్. అనంతఠాకూర్ దర్శకత్వాన తయారవుతున్న 'చోరీచోరీ' లో రాజ్‌కపూర్, నర్గీస్, ప్రాణ్, భగవాన్, జానీ వాకర్‌లు నటిస్తున్నారు. సంగీతం శంకర్, జైకిషన్. ఈ రెండూకాక, మిస్సమ్మ' చిత్రాన్ని హిందీలో నిర్మించడానికి కూడా శ్రీ మెయ్యప్పచెట్టియార్ భారీ ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. ★

★ హాలీవుడ్ అడుగు జాడల్లో.... ★

పాశ్చిమదేశాల కథలు పట్టుకువచ్చి, మనం సినిమాతీసి ఆ దేశాలకు పంపితే అక్కడి ప్రజలు దాన్ని హర్షించి విరగబడి చూడడం అసంభవం. మనదేశంలో ఈనాడు చాల చిత్రాలు హాలీవుడ్ అడుగుజాడల్లో నడుస్తున్నాయి. మనవి కాని మనస్తత్వాలు, ఆచార సంప్రదాయాలు, నృత్యాలు, వీటిలో కనబడుతున్నాయి

ఈ ధోరణిలో భారతదేశం చిత్రనిర్మాణం సాగిస్తే అమెరికా బ్రిటన్‌లలో గాని, యూరప్ దేశాలలో గాని, వాటికి ఆదరణ దుర్లభం అవుతుందని బ్రిటిష్ ఫిలిం సంస్థ ప్రతినిధి మేరీ సీటన్ మొన్న బొంబాయిలో ఒకచోట మాట్లాడుతూ అన్నారు.

"భారతీయ చిత్రాలలో భారతదేశపు స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి చిత్రించడం అవసరం. భారతీయము అని చెప్పుకోదగిన లక్షణాలు ఉంటేనే, అది పాశ్చాత్య ప్రజలను నచ్చుతుంది. అవి లేకుండా, తమ దేశాలనుండివెళ్లే చిత్రాలను అనుకరించి నిర్మించే చిత్రాలపట్ల వారికి ఆసక్తి ఏముంటుంది?" అని సీటన్ అన్నారు.

నాలుగైగు భారతీయ చిత్రాలు చూచిన మీదట ఆవిడ ఈ మాటలు అన్నారు. ఈ సందర్భంలో జపాన్ చిత్రనిర్మాతలను ప్రశంసిస్తూ, వారు తమ దేశపు సంప్రదాయాలను త్రోసి రాజనకుండా నిర్మాణం సాగిస్తున్నారని మేరీ సీటన్ చెప్పారు.

రష్యాకు 3 భారతీయచిత్రాలు

సోవియట్ రష్యాలో ప్రదర్శించే నిమిత్తం అమ్మకానికి పంపిన తొమ్మిది భారతీయ చిత్రాలలో, అక్కడి కళామండలి మూడు చిత్రాలను కొనడానికి నిశ్చయించారు. అవి బిమల్ రాయ్ ప్రొడక్షన్స్ నౌక్రీ, రాజకమల్ చిత్రం "తీన్‌బత్తీ చార్ రాస్తా", గురుదత్ ఫిలింస్ చిత్రం "మిస్టర్ అండ్ మిసెస్ 1955". మిగతా ఆరిటివిషయంలో ఇంకా నిర్ణయం జరుగలేదు.

సరికొత్త పాతచిత్రం 'ఆలం ఆరా'

మనదేశంలో తయారైన మొట్టమొదటి టాకీచిత్రం "ఆలం ఆరా"ను, ఆనాటి నిర్మాత అర్దేషర్ ఎం. ఇరానీ తిరిగి నిర్మిస్తున్నారు. గినికి మొన్ననే ప్రారంభోత్సవం జరిగింది. న్యూ బాంబేటాకీస్ పేరిట తయారవుతున్న ఈచిత్రంలో ఆనాటి జుబేదా, మాస్టర్ విఠల్‌ల భూమికలను ఇపుడు నిగార్ సుల్తానా, నసీర్ ఖాన్‌లు నిర్వహిస్తున్నారు. భారతీయటాకీ రజతోత్సవాలనాటికి దీన్ని పూర్తిచెయ్యాలని నిర్మాతల సంకల్పం.

టాకీ రజతోత్సవాలు

వచ్చే మార్చిలో జరుగనున్న భారతీయ టాకీ రజతోత్సవ సందర్భంలో ఏర్పాటు చేయవలసిన కార్యక్రమాలపై ఉత్సవ నిర్వహణ సంఘ కార్యవర్గం మొన్న చర్చ జరిపారు. ఈ ఉత్సవాలు నెల్లాళ్ళపాటు జరుగవచ్చును.

వహీదా రెండవ హిందీ చిత్రం

గురుదత్ ఫిలింస్ నిర్మిస్తున్న 'ప్యాస్' చిత్రంలో సుప్రసిద్ధనర్తకి వహీదా రెహమాన్‌ను తీసుకున్నారు. ఇది ఈమె రెండవ హిందీ చిత్రం. మొదటి చిత్రం సి. ఐ. డి. కూడా గురుదత్ నిర్మిస్తున్నదే.

ప్యాస్‌లో గురుదత్, మధుబాల ప్రధాన భూమికలు నిర్వహిస్తున్నారు సంగీతం శచీన్‌దేవ్ బర్మన్. కెమేరా వి. కె. మూర్తి. ★

ఒక మహిళామణి కారు నడుపుతూ ఒక మనిషిని ప్రమాదానికి లోనుచేసినందుకుగాను కోర్టులో విచారణ జరుగుతోంది.

మేజిస్ట్రేటు: "ప్రమాదం జరగకుండా మీరు చెయ్యగలిగినంతా చేశామని చెప్పగలరా?"

మహిళ: "చెయ్యకేమండీ, చేశాను. కళ్లు గట్టిగా రెండు చేతులతో మూసుకొని కెవ్వుమని కేకవేశాను"

పెద్దకథ

వా. స. మూర్తి

ఐదో అధ్యాయం

రఘు సుశీల మొగంమీద తేలికగా నవ్వివేశాడేకాని లోలోపల ఆమె అనుమానాల్ని గురించి ఆలోచించకుండా ఉండలేకపోతున్నాడు. ఇలా అనుమానాలు ఒయలుదేరుతాయని తానూహించనే లేకపోయాడు. అలా ఊహించుకోవడానికి తమ స్నేహంలో మరో రహస్యోద్దేశ్యం ఉంటేగదా. తాము కలిసి ఎక్కువ తిరగనూ కూడా లేదే. మొదటిరోజున బజారునుంచి పార్కుకీ, రెండోరోజున కృష్ణ ఒడ్డుకీ, మూడోరోజున దుర్గగుడికీ మాత్రమే కదా ఇద్దరూ కలిసిపోయినది. పైగా తాము తిరిగినది పట్టపగలు అందరిఎదుట. ఇతరులను తప్పించుకోవడానికి తాము ప్రయత్నించ లేదే తమకే మరో ఉద్దేశ్యం ఉంటే అలా చేసేవారా? అయినా గుసగుసలు బయలుదేరాయి. సీతారామయ్యగారి భార్యా, సుబ్బారావు భార్యా పనీ పాటలూ లేక ఇలాంటివి పుట్టించిఉంటారు. వారు పుట్టిస్తే పుట్టించారు. సుశీల ఇటువంటి గుసగుసలు నమ్మడమేమిటి? సుశీల అసూయాస్వభావం, అజ్ఞానం తలచుకునేటప్పటికి రఘుకు చాలా బాధవేసింది. తానామెముందు ఏమీదాచలేదే. కమలవిషయంకూడా చెప్పేశాడే! తను చెడుత్రోవను పడిఉంటే భార్యముందు కమల ప్రస్తావన తీసుకువచ్చునా? కమలతో స్నేహం చేయమని కోరునా? ఇదేమీ అర్థంచేసుకోకుండా ఆ కమలను ద్వేషించసాగింది సుశీల. పోనీ అప్పుడైనా తన వ్యక్తిత్వం చూపించిందా? లేదు, వాళ్ళమీదపడి ప్రాధేయపడసాగింది. సుశీలకీ దాస్యధోరణి ఎప్పుడు పోతుందో? కమలతో తను స్నేహం మానివేయాలా? ఎందుకు మానాలి? లోకం లక్ష అనుకుంటే అనుకోనీ ఋజువుపరచగలిగినప్పుడుగదా భయపడవలసింది. ఇలా తనలో తాను అనుకున్నాడు కాని బహిరంగంగా లోకాన్ని ధిక్కరించగల సాహసం లేకపోయింది రఘుకు. మళ్ళీ కమలను కలుసుకోవడానికి జంకసాగాడు. ఆమె కనిపిస్తే ఒకసారి చిరునవ్వు తెచ్చుకొని నమస్కారం పెట్టి తప్పించుకుపోతున్నాడు. సాయంత్రం ఆవిడ ఇవతలకు రాకమునుపే త్వరత్వరగా నడచిపోతున్నాడు.

కమల రఘు తననుంచి తప్పుకు తిరుగుతున్నాడని వెంటనే గ్రహించలేకపోయింది. ఉదయం సాయంత్రం వేళల ఆమెకు తీరికే ఉండడంలేదు. ఆమెఉన్న ఇంటావిడకు జ్వరం వచ్చింది. ఆమెకు పరిచర్య చేయడంతో సరిపోతోంది. ఇంటావిడ విధవ. ఒక్కతే ఉంటోంది ఇంట్లో. ఇంటి అద్దెమీదే కాలక్షేపం చేస్తోంది. ఆమెకు బంధువులు చాలామందే ఉన్నారు. కొడుకూ, కోడలూ, మనుమలూకూడా ఉన్నారు. కాని అందరికీ దూరమైపోయింది ఆవిడ. అలా జరగడానికి ఆమె స్వయంగా బాధ్యురాలు కాకపోయినా అందరికీ దూరంకాక తప్పలేదు. ఆమె భర్త పోయినవెంటనే చుట్టాలూ పక్కాలూ చేరి ఎంతో ప్రేమ వెళ్ళబుచ్చి ఆమె ఆస్తిపాస్తులూ వ్యవహారాలూ చూసి పెడతామన్నారు చివరికి ఇల్లుకూడా దక్కదేమోనన్న పరిస్థితి రాగా ఆవిడ తెలుసుకొని చుట్టాలను నిర్మొగమాటంగా వదిలించుకొని ఇల్లు నిలబెట్టుకుంది. ఆస్తులు హరించిపోవడానికి కారకులైన చుట్టాలు ఆమెమీద వైరంబూని ఆమెమీద లేనిపోనినిందలు మోపారు. కృతఘ్నురాలన్నారు. సిగ్గువిడిచి బ్రతుకుతోందన్నారు. అయినా తన బ్రతుకు తాను బ్రతుకుతున్నప్పుడు ఇతరు లెన్నుకుంటే తనకేం అనుకొని వాళ్ళమాటల కామె చలించలేదు. ఆమె నిర్లక్ష్యంచూసి వారు మరింత ఆగ్రహం చెందారు. ఇక మళ్ళీ ఆమె మొగం చూడకూడదని నిశ్చయించుకున్నారు. మరీ మంచిదనుకుందామె. కాని కన్నకొడుకుకూడా దూరమయేటప్పటికి - ఆమె చాలా బాధపడింది. ఎలాగో తంటాలుపడి కొడుకును పైకి చదివించింది. కొడుకు ఉద్యోగంలో ప్రవేశించాడు. మంచి సంబంధం చూసి ఆవిడ కొడుకుకు పెళ్ళి చేసింది. కోడలు కాపురానికి వచ్చింది. అంతే కొడుకు మారిపోయాడు. ఇప్పుడాతనికి పెళ్ళామే సర్వమూ అయిపోయింది. ఇంతవరకూ పెంచిపెద్ద చేసిన తల్లి చేదైంది. ఉద్యోగరీత్యా కొడుకు వేరే ఊర్లో కాపురం పెట్టాడు. తనుండగా తల్లి ఒంటరిగాఉండడమేమిటి, ఆ ఇంటిమీద వచ్చేఅద్దె తనచేతిలో నేపోసి తనతోబాటుంటూ భార్యకు ఆసరాగా ఉండకూడదా అని అతనికోపం. అతనిభాషలో ఆసరాఅంటే దాసీ చాకిరీఅని అర్థం. అది తల్లికి తెలియలేదు. కొడుకు ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాసేటప్పటికి పోనీ అలాగే ఉందామని కొడుకుదగ్గరకు వెళ్ళింది. మొదట్లో అంతా బాగానే నడచిందికాని కొన్నాళ్ళకు తానున్నది కోడలింట్లో కాని కొడుకుఇంట్లో కాదన్న సంగతి ఆమెకు బాగా తెలియవచ్చింది. చేయవలసిన చాకిరీ పెరిగింది. సాధింపులూ పెరిగాయి. దానితో ఆమెలో మళ్లీ అభిమానం పెరిగింది తానేమీ వీళ్ళ కాళ్ళమీద పడలేదుకదా ఇంత ఈసడించి కొట్టేందుకు. తనపొట్ట తాను పోసుకోగలదు—తన ఇంటిమీద అద్దె తనకు సరిపోతుంది. అయినప్పుడు ఈ దాసీజీవితమేమిటి అని కొడుకుకు చెప్పలేచివచ్చింది. దానితో కొడుకుకు కోపంవచ్చింది. తల్లికి

ఉత్తరంమక్కైనా వ్రాయడం మానివేశాడు. మొదట్లో ఆమె చాలా బాధపడిపోయి బెంగపెట్టుకుంది. కాని ఎలాగో గుండెరాయి చేసుకొని జీవితం గడపసాగింది. ఆమెకు కావలసింది అద్దె. నెల తిరిగేసరికి అద్దె ఇచ్చేవాళ్ళయితే ఇంట్లో వాళ్లు ఎలాంటి వాళ్లైనా ఆమె కక్కరలేదు. ఎన్నడూ వాళ్ళ ఆంతరంగికవిషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నించదు. అందుకే కమల కంత త్వరగా ఆమెఇంట్లో వాటాదొరికింది. కాని కమలకు వాటాఇవ్వడమే కాకుండా ఆఇంటావిడకు కమలను చూసినప్పటినుంచి ఎందుకో అభిమానం బయలుదేరింది. లోకానుభవంవల్ల ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడకూడదని నిశ్చయించుకున్నదల్లా కమల విషయంలో ఆనిశ్చయం గాలికి వదిలివేసి ఆమె గదిలోకివచ్చి కూర్చుని కబుర్లుచెప్పేది. తన గదికి తీసుకువెళ్ళి తన కష్టసుఖాలు చెప్పుకునేది. ఆమెకు కమల అంత సానుభూతిపరురాలింకొకరు కనిపించలేదు. తన కిటువంటికూతురుంటే ఎంతబాగుండు ననుకునేది అప్పుడప్పుడు. కాని వెంటనే ఈకమలే తన కడుపున పుట్టిఉంటే తనకొడుకులాగే ఈమెకూడా దూరమైపోయి ఉండేదేమో అని అనుకొని కమల ఇలాగేఉంటే మంచిదనుకొనేది. ఏమీ తోచనప్పుడు కమల గదిలోకివచ్చి ఆమె చదువుకుంటూంటే "నీ చదువు నీవు చదువుకోఅమ్మా, నే నిక్కడే కూర్చుంటానులే" అని కమలకేసి చూస్తూ కూర్చునేది. అటువంటి ఆమెకు జ్వరం వచ్చేసరికి అంతవరకూ ధైర్యంగా ఉండేదల్లా పసిపిల్లలా అయిపోయి కొడుకును తలచుకుంటూ ఏడవసాగింది. కమలే ఆమెకు సేవచేసింది. డాక్టరును పిలుచుకొనివచ్చి, చూపించి ఆమెకు కావలసినమందులు ఇస్తూఉంది. ఇతర వాటాలవాళ్లు అద్దె చెల్లించడంవరకే తమ బాధ్యత అనే దృష్టితో ఉన్నారు. అప్పుడప్పుడు "ఎలా ఉందండీ ఒంట్లో"అని మాత్రం అడిగి ఊరుకునేవారు. కమల అలాగే పరిచర్యచేసి ఇంటావిడ బాగా ఆరోగ్యవంతురాలయ్యేటట్టు చూసింది. "నా అదృష్టంకొద్దీ నువ్వు మా యింటికి వచ్చావు తల్లీ" అని కన్నీరుపెట్టేది ఇంటావిడ. ఇంటావిడ పరిచర్యతోనూ, ఒకటిరెండుమార్లు మహిళాసంఘానికి వెళ్లి రావడంవల్లా కమలకు రఘును మళ్లీ తీరికగా కలుసుకునే అవకాశం లభించలేదు. అందువల్ల రఘు నేవిధంగానూ అనుమానించలేకపోయింది. అతనిని కలుసుకోలేకపోయినందుకు తననే నిందించుకుంది. ఇటు రఘుకు కమలకూడా తనతో మాట్లాడడానికి ప్రయత్నించకపోయేసరికి అనుమానం వేసింది కమలకు తనమీద కోపం వచ్చిందాఅని. అతను గుంజాటనలో పడ్డాడు. తను ఇలా తప్పుకు తిరుగుతున్నందుకు కమల బాధపడి ఉంటుందనుకున్నాడు. అయినా ఆమెను పలుకరించలేక పోతున్నాడు.

ఆవేళ పత్రికలో అతని కొత్తగీతం ప్రకటించబడింది. రఘు ఆనందంపట్ట శక్యం కాలేదు. ఈవిధంగా తన పేరు నలుగురు నోట ప్రాకుతుంది. తనూ నేటిఅభ్యుదయ కవులలో ఒక విశిష్టస్థానం పొందగలుగుతానని ఆశలమేడలు కట్టుకోసాగాడు. తను ఈకొత్తపంథా తొక్కడానికి కారణం కమలే. తన మనస్సును మరింత విశాలం చేసింది కమలే. ఆమెకు స్వయంగా కృతజ్ఞత తెలుపకపోతే తను ద్రోహం చేసినట్లే అవుతుంది. కాని సంకోచం వదలలేకపోయాడు.

కమలకూడా పత్రికలో రఘు గేయం చూసింది. చాలా సంతోషం కలిగింది. గర్వంకూడా కలిగిందామెకు. తనతో స్నేహం ఏర్పడినతరువాతే రఘు ఈ కొత్త దారిపట్టాడు. అది తనకొక విజయంలా తోచింది. ఇన్నాళ్లూ తను మాట్లాడకపోయినందుకు రఘుగారు ఏవిధంగా అనుకుంటాడో అని భయంకూడా వేసింది. మధ్యాహ్నం రిసెస్ వేళ హాలులోకి వచ్చి చూసింది. రఘుచుట్టూ నరసింహమూర్తి వగైరాలు చేరి "ఏం రఘూ ఇటువంటికవిత్వం వ్రాయడం మొదలుపెట్టావేమిటి? వెనకటి తరహా పద్యాలు పత్రికలవాళ్లు వదేపదే తిప్పివేసేటప్పటికి కమ్యూనిష్టువై పోయావేమిటి? బలేకమ్యూనిష్టువులే. కడుపు నిండా తిండీ, చాలినంత సంపాదన, చక్కనిభార్య, రత్నాల్లాంటి పిల్లలూ ఉన్న నీవా కమ్యూనిష్టుకవిత్వం వ్రాయడం" అని పరిహాసం చేయసాగారు. ఆకవిత ఎలా ఉందీ, ఎలా వ్రాసిందీ వారికి అక్కర లేదు. రఘు వారిపరిహాసాన్ని చిరునవ్వుతో ఎదుర్కొంటూ కూర్చున్నాడు. కమల ఇప్పుడు సమయం కాదని వెనక్కి వెళ్ళింది.

సాయంత్రం కమల బయటికి వచ్చేటప్పటికి రఘు తలవంచుకుపోతున్నాడు. కమల త్వరగా అడుగులువేసి "కవిగారూ, నా అభినందనలు స్వీకరించండి. నే నీవేళ పత్రికలో మీ గేయం చూశాను. ఆనందంతో ఉప్పొంగిపోయాను" అంది.

రఘు ఆగిపోయాడు. చిరునవ్వు తెచ్చుకొని "ధన్యవాదాలండీ ఈకవితకూ, కొత్తధోరణికీ మీకు ఋణపడి ఉన్నాను" అన్నాడు. "నాకు ఋణపడి ఉండడమేమి"టంది కమల.

"మీ ప్రోత్సాహంవల్ల నేకదా నేనీ కవిత వ్రాసినది. మీతో చర్చలవల్లేకదా నాకు కొత్తదృక్పథం ఏర్పడింది. మిమ్మల్ని కలుసుకోకపోతే నేను యథాప్రకారం విరహగీతాలే వ్రాస్తూ ఉండేవాడిని. అది నాకే తిరిగి వస్తూఉండునుకూడా."

"నేనే కారణమంటారా. నాలోనే అంత శక్తి ఉంటే నేనే కవిత్వం ఎందుకు రాయలేను?" అంది కమల నవ్వుతూ. "ఈమధ్య మిమ్మల్ని నేను కలుసుకోలేకపోయాను. మీరేమనుకుంటారో అనికూడా భయపడ్డాను. మా యింటావిడకు జబ్బుచేసిందండి. ఆమెకు ఉపచారంతో తీరికలేకపోయింది. ఈమధ్య మీరు కొత్తగేయాలేమైనా రాశారా?"

కమల తన ననుమానించనందుకు రఘు మనస్సు తేరపినబడింది. కాని తనే ఆమెపట్ల కపటంగా ప్రవర్తిస్తున్నానని లోలోపల బాధపడ్డాడు. వెంటనే ఒక నిశ్చయానికి వచ్చి "పదండి, ఈవేళ పార్కుకు పోదాం" అన్నాడు. ఇద్దరూ కలిసి పోసాగారు.

రఘు కమల ప్రశ్నకు జవాబిచ్చాడు. "నేను మళ్ళీ ఏమీ వ్రాయలేదండి. ఈమధ్య నామనస్సు మామూలుగాలేదండి" అని నోరు జారినందుకు కంగారుపడి, కమల ధ్యానం

సన్నటివాడు: "మీ లావాటి వాళ్ళంతా సాధారణంగా నెమ్మదస్థులుగా ఉంటా రెందుచేత?"

లావాటి వాడు: "మేము పోట్లాడనూ లేము, పారిపోనూ లేము. అందుచేత."



సాగర పారిశ్రామికులు

ఫోటో: ఎస్. వి. విఠల్.

తప్పించడానికి "మీరు మహిళా సంఘానికి వెళ్లటం కదూ ఎవరేనా పరిచయమయ్యారా" అని అడిగాడు.

"ఆ వెళ్లానండి. ఏవో మీటింగులు జరిగాయి. అవి విన్నాను. ఉండాలి [illegible] విజ్ఞాపనలతోనే ఎక్కువ సమయం గడిచింది. పైగా అక్కడివారు తమ అభిప్రాయాలు ఇతరులు వినాలే కాని ఇతరుల అభిప్రాయాలు తాము విననక్కరలేదనే ధోరణిలో ఉంటారండి. వారితో స్నేహం చేయడం నిమిషాలమీద జరిగేది కాదు. అయినా కొంత పరిచయం మాత్రం అయిందనుకోండి. అన్నట్లు మీ భార్యగారికి నన్ను పరిచయం చేయలేదు. మీ యింటికి తీసుకువెళ్ళలేదు" అంది.

రఘు ఉలిక్కిపడి, ఏమీ చెప్పలేక తల వంచుకొని నడవసాగాడు. ఇంతవరకెప్పుడూ ఏమని చెప్పగలడు? చెప్పితే ఏమవుతుంటుంది? రఘు ఏమీ జవాబీయకపోతే మళ్లీ అడిగింది కమల "మీ యింటికి తీసుకువెళ్ళరా" అని. రఘు మాట్లాడలేదు. కమల [illegible] చేసింది, అతని ముఖంలోకి చూసింది. కమలగుండె ఒక్కసారిగా ఝల్లు మనగా కొట్టుకోసాగింది. ఎందుకీయన జవాబీయటం లేదు? హఠాత్తుగా ఆమెకో కారణం తట్టింది. చలి చెమట పోసినట్లయింది. కొద్దిసేపుండి గొంతుక తెచ్చుకొని "ఎవరేనా ఏమైనా అనుకుంటున్నారా?" అని అడిగింది. [illegible] వినిపించకుండా.

"ఏమిటి అనుకోవటం?"

"మనల్ని గురించి మనం ఇలా కలిసి తిరగటం గురించి."

రఘు మాట్లాడలేదు. అలాగే తలవంచుకొని నేలమీదకు చూస్తూ నడుస్తున్నాడు.

కమల అనుమానం దృఢమైంది. మళ్ళీ అంది: "మనల్ని గురించి గుసగుసలు బయలుదేరాయి కాదూ?"

రఘు మెల్లగా "ఊఁ" అని నిట్టూర్చాడు. కమలకు కాళ్లలో బలం తగ్గిపోయినట్లయింది. "మనం ఏం చేశాం — ఇటువంటి గుసగుసలు బయలుదేరడానికి? కలిసి రెండుమూడుసార్లు అక్కడికీ ఇక్కడికీ వెళ్ళి వచ్చాం. అంతే కదా. మనోవికారంగా ఆ సమయాల్లో [illegible] ప్రవర్తించలేదే?" అంది ఆవేశంతో.

"అవును కమలాదేవిగారూ. మనం ఆ సమయాలకు తావివ్వకుండానే ప్రవర్తించాం. కాని పురుషుడికీ పరస్త్రీకీ మధ్య స్నేహాన్ని చూడడానికి మన సమాజం అలవాటు పడలేదు. అందువల్ల మీరూ నేనూ కలిసి తిరిగినంతలోనే మనమీద అనుమానాలేర్ప

★ అ బ ల ★

రమనుంటోంది సమాజం. మన స్నేహం సహించలేకపోతోంది. లేనివి ఊహిస్తోంది" అన్నాడు రఘు.

"సుశీలాదేవి గారికికూడా చేరాయా ఈ గుసగుసలు. ఆవిడకూడా అనుమానిస్తున్నారా మన నడకని?"

రఘు అవునన్నట్టు చూశాడు ఆమెకేసి.

"అందుకేనా ఆ వేళ ఆవిడ మీతో దుర్గగుడికి బయలుదేరి రాకపోయినది?"

రఘు జవాబియలేదు. కమల ఆగిపోయింది. త్వరగా నిశ్చయానికి వచ్చివేసింది. "ఆగండి రఘుగారూ, ఈ వేళ షికారు వద్దు. మీ యింటికి పోదాం" అంది.

"మా యింటికా?" అన్నాడు రఘు ఉలిక్కిపడి.

"అవునండీ. మనమీద అనుమానాలు బయలుదేరినప్పుడు మనం తప్పుకొని తిరిగితే ఆ అనుమానాలను మరింత బలంచేసిన వాళ్ళమవుతాము. ధైర్యంగా మన నిష్కల్మషత్వం ఋజువు పరచుకోవాలి. మీ ఆవిడను కలుసుకోవాలని ఉంది. ఆమెతో మాట్లాడితే తప్పక ఆమె అనుమానాలు పోగొట్టగలుగుతానని నా విశ్వాసం. ఆమెను నా స్నేహితురాలిగా చేసుకోగలనని నా నమ్మకం"

రఘు ఆలోచించాడు. కమల చెప్పింది చాలా సమంజసంగా తోచింది. అతని హృదయం కొంత తేలికపడింది. కమల సుశీలతో మాట్లాడడంవల్ల సుశీల అనుమానాలు తొలగిపోవచ్చు. "సరే పోదాం పదండి" అన్నాడు ఇంటికి దారితీస్తూ.

రఘూ కమలా రావడం ఇరుగుపొరుగుల వారు చూసి పరుగెత్తుకువచ్చి సుశీలకు చేరవేశారువార్త. త్వరగా ప్రక్కకుపోయి గోడలమీదనుంచి చూడసాగారు. రఘూ కమలా ఇంటిదగ్గరకు వచ్చారు. లోపలికి అడుగుపెట్టారు. ఎదురుగా అత్తగారు రావడంచూసి రఘు తెల్లబోయి నిలబడిపోయాడు. ఈవిడ ఎప్పుడు వచ్చింది? అత్తగారినంత అకస్మాత్తుగా చూసేసరికి రఘుకేం చేయాలో సరిగా తోచలేదు. కమల కలానిలబడి ఉండడం కష్టంగా తోచి, తల్లి ప్రక్కన నిలబడిఉన్న సుశీలకేసి చూస్తూ "మీరేనాండీ, సుశీలాదేవిగారు?" అని అడిగింది రఘును. రఘువెంటనే తేరుకొని "అవును ఈమెనండి" అని భార్యవైపుకు తిరిగి "ఈవిడే సుశీలా కమలాదేవిగారు. మా ఆఫీసులో పనిచేస్తున్నారని చెప్పానే. నిన్ను కలుసుకోవాలని వచ్చారు," అన్నాడు. కమల సుశీలకు నమస్కారంచేసి ముందుకు రాబోయింది. సుశీల కమలకేసి తీక్షణంగా చూసింది. ఆ చూపుతో కమల అలాగే ఆగిపోయింది. ఇంతలో సుశీలతల్లి శేషమ్మ అందుకుంది: "ఏమమ్మా, బయట తిరిగింది చాలక ఇంటికికూడా దయచేశావూ ఇదేమైనా మర్యాదస్తుల కొంపనుకున్నావా మరోకటి అనుకున్నావా" అంది. ఆమాటలకు కమల నిశ్చేష్టురాలైపోయింది. అత్తగారిమాటలు వినేసరికి రఘుకు ధైర్యమొంది: "మిమ్మల్నెవరికక్కడ మాట్లాడమన్నారు. నోరుమూసుకొని లోపలకు పోక" అన్నాడు గట్టిగా. వెంటనే సుశీల తల్లి సహాయానికి వచ్చింది: "మా అమ్మ ఏమంది అంత నోరు మూసుకొని పోవడానికి" అంది.

కమల కొద్దిగా తేరుకుంది. కొంచెం ధైర్యం తెచ్చుకొని సుశీలతో అంది: "క్షమించాలి, సుశీలాదేవిగారూ, నేనిలా సాహసించి వచ్చినందుకు. మీ స్నేహంకోరే నేనిలా వచ్చానండి" కాని ఆమె మాట్లాడకుండానే శేషమ్మ మళ్లీ అడ్డుపడింది: "దానితోకూడా స్నేహమా? చేస్తున్నావు కదూ ఆయనతో, అప్రదిష్ఠ తేస్తూ. స్నేహంట స్నేహం! మగాడితో ఆడదానికి స్నేహమేమిటి? ఆఫీసులో పనిచేస్తే చేశావు కాని ఊరంతా ఈ తిరుగుళ్లేమిటి పరాయి మగాడితో, అతడిసంసారం నాశనం చేయాలని కాకపోతే. నాతల్లి సంసారం నిక్షేపంలా సాగుతోందనుకున్నాను. ఇంతలో నీవు తయారయ్యావు. రావే అమ్మాయి, లోపలికి పోదాం ఇక్కడ ఉండడమే పాపం" అంటూ ఆవిడ సుశీలను చేయి పుచ్చుకొని లోపలికి లాగుకుపోయి ఫెడీమని తలుపు వేసేసింది.

అంత త్వరితపరిణామానికి రఘుకూడా సిద్ధంగా లేడు. అతను ఏమైనా మాట్లాడడానికికూడా అవకాశం లేకపోయింది. శిలావిగ్రహంలా తలుపుకేసి చూస్తూ ఉండిపోయాడు. కమల అలాగే నిలబడి ఉంది. ఆమెకళ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె ఎన్నడూ అటువంటి మాటలు వినలేదు. హృదయంలో సంక్షోభం రేగి గొంతుక గద్గదమయిపోయింది. కొంతసేపుండి రఘువైపుకు తిరిగి "వెళ్ళివస్తానండి" అంది. రఘు ఆమెవైపోమారు చూసి వెంటనే తలదించుకున్నాడు. మాట రాలేదాతనినోటినుంచి. కమల మెల్లగా వెళ్ళిపోయింది.

కొద్దిదూరం నడిచేసరికి రఘు పిల్లలు పాపా, సుకుమార్ లు ఆమెకెదురుగా పరుగెత్తుకువచ్చారు. కమల వాళ్ళకు కనిపించకుండా తప్పించుకుపోదామనుకుంది కాని వాళ్లామెదగ్గరకే పరుగెత్తుకు వచ్చారు. ఆమె తమ ఇంటిదగ్గరనుంచే వస్తోందన్న సంగతి వాళ్లకు తెలియదు కొబట్టి ఆమె చేతులుపట్టుకొని "ఏమండీ, ఇక్కడేనండీ మాయిల్లు. మాయింటికి రండి, ఎంతో దూరం లేదు" అంటూ లాగడం మొదలు పెట్టారు. కమల వాళ్ళను ఎత్తుకొని ముద్దాడింది. "ఇప్పు డాగంటుపనుంది తరువాత వస్తా'నంది. వాళ్లామెకళ్ళలో నీళ్లు చూసి "ఎందుకూ ఏడుస్తున్నారు" అని అడిగారు. కమల వెంటనే నవ్వి "నేనేడుస్తున్నానా, నవ్వుతూంటే" అంది. "కాదు మీకంట్లో నీళ్ళేమిటి? మీరు ఏడుస్తున్నారు మీరు ఏడిస్తే మాకూ ఏడుపు వస్తుందండీ" అని ఏడుపుమొగం పెట్టారు "లేదమ్మా నే నేడవడంలేదు కంట్లో దుమ్ముపడి నీళ్లు వచ్చాయి అంతే. అంతకన్న ఏమీ లేదు" అని నవ్వి, వాళ్ళను మళ్ళీ ముద్దాడి తీసుకు వెళ్ళి బిస్కట్లమ్ముతూవచ్చిన మనిషిదగ్గర నాలుగు బిస్కట్లుకొని వాళ్ళకు పెట్టింది వాళ్ళవితీసుకొని ఇంటికిపరుగెత్తబోయారు. కమల ఆపి "అవి తినండి ముందు" అని వాళ్ళచేత తినిపించి "ఇప్పుడు మీ యింటికి వెళ్ళండి, కాని మీయింట్లో ఎవరికీ నేను కనిపించానని చెప్పకండేం" అని చెప్పింది. వాళ్లు బుర్రలూపి, గంతులువేసుకుంటూ

ఫ్రాయిడ్ సిద్ధాంతాల్లో బాగా నమ్మకం ఉన్న ఒక డాక్టరు రోగితో:

"మీకు రాత్రిళ్లు ఏం కలలు వస్తాయి?"

రోగి: "క్రికెట్ ఆడుతున్నట్టు కలలొస్తాయి."

డాక్టరు: "ఇంకేం వస్తాయి?"

రోగి: "నాకు రోజూ క్రికెట్ ఆటే కలలోకి వస్తుంది. నేను గొప్ప క్రికెట్ ఆటగాణ్ణి మీకు తెలుసుగా."

డాక్టరు: "అమ్మాయిలు కలల్లోకి రారా?"

రోగి: "ఒకవేళ వచ్చినా వాళ్ళని చూడను. నా ధ్యాస ఎంతసేపూ క్రికెట్ మీదే ఉంటుంది."

పరుగెత్తుకుపోయారు. కమల బరువుగుండెతో తనఇంటివైపు నడిచింది.

రఘు కొంతసేపలాగే నిలబడి ఉన్నాడు. తరువాత తనపరిస్థితి తెలుసుకున్నాడు. చరచరా బయటికి నడిచి పార్కుకు వెళ్ళిపోయాడు. బాగా చీకటిపడేవరకూ అక్కడా ఇక్కడా తిరిగి ఇంటికి వెళ్లాడు. అప్పటికి ఇరుగుపొరుగు అమ్మలక్కలు అత్తగారిచుట్టూచేరి కూర్చున్నారు. అత్తగారు ఏడుపుకంఠంతో అంటోంది "నా తల్లిఅంత అందకత్తె మరెవతె ఉంటుంది. దానిమొగం చూస్తే ఎప్పుడూ కలకలలాడుతూ లక్ష్మీదేవిని చూసినట్లుగా ఉంటుంది. అటువంటిది దానిమొగంచూస్తే అసహ్యమూను, ఎవత్తో టక్కులమారిదాని మొగంచూస్తే ఆనందమూనా? బాగుంటాడనీ, మంచివాడని అనుకొని పిల్లనిచ్చాంకాని ఇప్పుడిలాంటి బుద్ధులు పుట్టుకువస్తాయనుకున్నామా —"రఘుకు ఆమె నోరు నొక్కివేద్దామా అన్నంతకోపం వచ్చింది. విసురుగా లోపలికి నడిచాడు. అక్కడివారందరూ అతన్ని చూసి హడావుడిగా లేచారు. ఎదురుగోడదగ్గర సుశీల నిలబడి ఉంది. రఘు చరచరా ఆమెవైపు నడిచి అందరూ ఇంకా అక్కడ ఉండగానే గట్టిగా అరిచాడు: "ఇది ఇల్లనుకున్నావా, సంతనుకున్నావా? ఈ గొడవేమిటి? మనుష్యులా పశువులా ఈ యింట్లో ఉన్నది. ఏమిటీ పిచ్చికూతలు, మర్యాదా మంచీ తెలియకుండా. ఛీ ఇది ఇల్లుకాదు, నరకకూపం" అంటూ గదిలోకి నడిచి ఖండువా ఒకమూల గిరవాటువేసి, చెప్పులింకొక మూలకు గిరవాటేసి కుర్చీలో కూలబడ్డాడు. ఇరుగుపొరుగువాళ్లు గబగబా పరుగెత్తుకుపోయారు. అత్తగారుకూడా నోరు మూసుకుంది. ఇల్లంతా కటిక నిశ్శబ్దంగా ఉంది. కాని రఘు మనస్సులో కల్లోలంమాత్రం అణగారలేదు. పుస్తకం తీశాడుకాని అది తలక్రిందులుగా పట్టుకున్నానని కొద్దిసేపటికి చూసి తెలుసుకొని, అది మూసివేసి అటూ ఇటూ తిరగడం మొదలుపెట్టాడు. ఎన్నిసార్లు తిరిగినా కోపం చల్లారడంలేదు. కమలకెంత అవమానం జరిగింది. తనమూలానే జరిగింది. తనయింటికి పెద్దఆశతో వచ్చింది. దీనినిబట్టే తెలుస్తుంది ఆమె హృదయమెంత నిష్కల్మషమైనదీని. అటువంటిఆమె చెప్పేది వినకుండా నానా దుర్భాషలాడారు. వాళ్లు మనుషులా పశువులాఅని. ఆమెకు ఈ పశువులచేత దుర్భాషలు పడవలసిన గతి ఏమివచ్చింది. ఎంత బాధపడుతోందో పాపం కమల. పైగా తానక్కడేఉండే ఏమీ చేయలేకపోయాడు. ఎందుకో తననోరు కట్టుకుపోయింది. దీనికి తనను ఏంచేసుకున్నా పాపంలేదు. తానేమీ మాట్లాడకపోవడం చూసి కమల మరీ బాధపడి ఉంటుంది. ఆమె అవమానం పోగొట్టడమెలా? ఈఅత్తగారు మనిషికాదు రాక్షసి. ఎవరు రమ్మన్నారని వచ్చింది. ఆమెను తలచుకునేసరికి రఘుకు తక్షణం పోయి ఆమెను బయటికి గెంటివేయాలనిపించింది. ఎంతలా పేలిపోయింది! కాని తనామెనేమిచేయగలడు? ఏమన్నా అంటే మరింత పేలిపోతుంది. ఊరంతా యాగీ చేస్తుంది. ఆమెనోటికి శుద్ధీబద్ధమూ ఉండదు. ఆమెతో సమానంగా మాట్లాడడం కష్టం. మరొకవిధంగా ఆమె నణచలేడు. చెయి చేసుకోవడానికి అంతకన్నా వీలులేదు. అసలు కారణం సుశీల. సుశీలే ఇంత గ్రంథంనడిపింది. తల్లిని పిలిపించి ఉంటుంది. తల్లి అలా మరొకస్త్రీ నవమానం చేస్తూంటే ఏమీ మాట్లాడకుండా ఊరుకుంది. అంత అసూయ! ఎంత ద్వేషం! సుశీల అమృతస్వరూణి అనుకున్నాడు. ఆమెలో దాగి ఉన్న విషమీనాడు బయటపడింది. సుశీలనేంచేయాలి అలా ప్రవర్తించినందుకు అనుకుంటూ తిరుగుతున్నాడు రఘు. ఇంతలో సుకుమార్ వచ్చి "నాన్నా! అమ్మ అన్నానికి రమ్మంటోంది." అన్నాడు జంకుగా. రఘు గిర్రున తిరిగి "అన్నం లేదూ సున్నం లేదూ. నే నన్నం తిననని చెప్పు," అని వెనక్కి తిరిగి "ఈ దుర్మార్గుడికి ఈయింట్లో అన్నంకూడా పెట్టారా" అని గట్టిగా అన్నాడు సుశీలా వాళ్ళకు వినిపించేలా. సుకుమార్ పరుగెత్తుకుపోయాడు. రఘు పోయి అలాగే మంచం మీద పడ్డాడు. కాని ఎంతసేపటికీ నిద్ర రాలేదు. అటూఇటూ దొర్లుతూ నిట్టూర్పులు విడుస్తూ బాధపడసాగాడు.

అటుసుశీల ఇరుగుపొరుగులమ్మలు చెప్పిన దానినిబట్టి తన కన్యాయం జరుగుతోందని గాఢంగా నమ్మసాగింది. తల్లివచ్చి మరింత రెచ్చగొట్టిందామె బాధ. కమలముందు తల్లి ఇంకొ తక్కువగానే మాట్లాడిందనుకుంది. ఆ కమల నేమన్నా తప్పులేదు

ఒకసారి ఫ్రెంచి శాసనసభలో ఏదో విషయంమీద అతి తీవ్రమూ, అతిదీర్ఘమూ అయిన చర్చ జరిగింది. ఒక శాసన సభ్యుడు చర్చ ప్రారంభ సమయంలో నిద్రపోయి, చర్చ అంతమయ్యేవరకి లేచాడు. శాసనసభ అధ్యక్షుడు చెప్పాడు నువ్వు ఈలోగా రెండుసార్లు ప్రధానమంత్రి వయ్యావని.

దుర్మార్గురాలు. తన కాపురాన్ని పాడు చేయడానికి పూనుకుంది. కమలపట్ల ఆమె హృదయంలో ఇంత ద్వేషం పొంగుతున్నా ఇంతవరకూ జరిగినదానికి భర్తనంత బాధ్యుడిగా తలచలేకపోయింది. ఆ కమలే తన భర్తను వలలో వేసుకుందని ఆమె నమ్మింది. భర్త అన్నం తినకుండా అలా బాధపడుతూంటే ఆమె గుండె గిజగిజలాడింది. వెళ్ళి కాళ్ళ మీదపడి బ్రతిమాలి అన్నం తినిపిద్దామనుకుంది. కాని తల్లి ఆమె నాపివేసింది. "ఇప్పుడు వెళ్ళకు సుశీ ఇప్పుడు వెళ్ళావా నిన్ను మళ్లీ లొంగదీసేస్తాడు. వెళ్లకు," అంది తల్లి. తల్లిమాట ఎదిరిస్తే ఏమనుకుంటుందో నన్న జంకుతో సుశీల భర్తదగ్గరకు పోలేకపోయింది. ఆ పూట తనుకూడా తిండి మానివేసింది. పిల్లలను దగ్గిర పెట్టుకొని కన్నీరు పెట్టుకుని పడుకుంది.

రఘు కెప్పుడు నిద్రపట్టిందో కాని బాగా తెల్లవారినతరువాత మెలకువ వచ్చింది. లేచేటప్పటికి నీరసంగా ఉంది నిన్న సాయంత్రం జరిగినది జ్ఞాపకం వచ్చింది. మళ్లీ కోపం పొంగుకువచ్చింది. కాని నీరసంవల్లా కొంత సమయం గడవడంవల్ల ఆ కోపంలో తొలి ఉడుకు లేకపోయింది. తానేం చేయాలి? అత్తగారి నేమీ చేయలేడు పొమ్మనడం తప్పితే. పొమ్మంటే ఊరూవాడా ఏకం చేస్తుంది ఆవిడ. దీనికంతకీ కారకురాలైన సుశీలతో ఇక మాట్లాడకూడదని నిశ్చయించుకున్నాడు. లేచి వెళ్లి మొగం కడుక్కొని స్నానంచేసి వచ్చాడు. తన గదిలోకి పోయి ముందురోజున పత్రికలో పడ్డ తన గేయం చూసుకున్నాడు. ఇన్నాళ్ళకు మళ్లీ తనరచన పత్రికల్లో పడినందుకు ఆ గేయం ఎన్నిసార్లు చదవవలసింది! కాని ఆనాటి సంఘర్షణ ఆ ఆనందం లేకుండా చేసింది. పాపా సుకుమార్ లు గుమ్మంలోకి వచ్చి బెరుకుగా చూస్తూ నిలబడ్డారు. వాళ్లను చూసేసరికి రఘుకు ఉన్న కాస్త కోపంకూడా నీరైపోయింది. "రా నాన్నా, రా తల్లీ" అన్నాడు. వాళ్లు ఒక్క గంతులో అతని దగ్గర కురికారు రఘు వాళ్లి నెత్తుకొని ఒడిలో కూర్చోబెట్టుకుని జుట్టు దువ్వుతూ ముద్దాడాడు. వాళ్లు "నాన్నా, నిన్న రాత్రి పద్యం ఒప్పజెప్పించుకోలేదు. ఇప్పుడొప్పజెప్పించుకుంటావా" అని అడిగారు. "ఒప్పజెప్పండి" అన్నాడు రఘు. వాళ్లు ఒప్పజెప్పారు. రఘు వాళ్ళకు కొత్త పద్యం చెప్పాడు ఇంతలో సుశీల గుమ్మం ప్రక్కనుంచి సుకుమార్ ని పిలిచింది. సుకుమార్ పరుగెత్తుకు వెళ్ళాడు. కాఫీ తీసుకొనివచ్చాడు కాఫీ త్రాగబుద్ధి వేయలేదు రఘుకు. కాని సుకుమార్ "తాగు నాన్నా" అని అందించగా, వాడిని కాదనలేక రఘు కప్పు తీసుకొని త్రాగివేశాడు. సుకుమార్ కప్పు బయటపెట్టి వచ్చాడు రఘు "బడికి వెళ్లేవేళ అయింది కదూ, పలకా పుస్తకాలు తెచ్చుకోండి, నేను తీసుకువెళ్తాను" న్నాడు వాళ్లిద్దరూ తెచ్చుకున్న తరువాత ఇద్దరినీ ఎత్తుకొని బయటికి నడిచాడు. ముందు బజారువైపుకు దారితీశాడు. అక్కడ ముష్టివాళ్ళు చాలా మంది కూర్చొని గోల పెడుతున్నారు. రఘు పిల్లలచేత ప్రతి ముష్టివాడికీ — కానీ కానీ వేయించి వాళ్ళ బుగ్గలు రాస్తూ "ఏమనిషైనా కష్టంలో ఉంటే జాలీ, దయా చూపించడం నేర్చుకోండి. ఎవరినీ బాధ పెట్టడానికి ప్రయత్నం చేయకండేం. మంచివాళ్ళుగా ఉండండి," అన్నాడు సాయంత్రం అత్తగారి అమానుష ప్రవర్తన మనసులో పెట్టుకొని. పాపా సుకుమార్లకు అతను చెప్పినది పూర్తిగా అర్థంకాకపోయినా 'అలాగే ఉంటా'మన్నట్లు తల ఊపారు. ఇద్దరికీ చెరో బేడా యిచ్చి బళ్లో దిగబెట్టి అక్కడినుంచి లైబ్రరీకి నడిచాడు రఘు. లోపలికి పోయి పత్రికలు తిరగవేయసాగాడు కాని వాటిమీద అతని మనస్సు పోలేదు. ఊరికే జనాన్ని చూస్తూ తన ఆలోచనలతోనే తాను సతమతమవుతూ కూర్చున్నాడు. తొమ్మిది కొట్టేసరికి భోజనం వేళ అని జ్ఞాపకంవచ్చి లేచాడు ఆకోపంలో, మొదట ఏ హోటలులోనో భోజనంచేసి ఆఫీసుకుపోతే బాగుండునని పించింది. అత్తగారుండడంవల్ల ఇంటికిపో బుద్ధివేయడం లేదు. కాని అలాచేస్తే పరిస్థితి మరింత విషమిస్తుందనీ, తనది కూడా తప్పున్నట్లవుతుందని గ్రహించాడు. తన మట్టుకు తాను సరిగా ప్రవర్తించాలని నిశ్చయించుకొని ఇంటికివెళ్ళి మౌనంగానే భోజనంచేసి ఆఫీసుకు వచ్చాడు. కమల కోసం చూశాడు. ఆమె కేదోవిధంగా క్షమాపణ చెప్పుకోవాలి. కాని కమల ఇంకా రాలేదు. మేనేజరు వెనకాలేవచ్చి తిన్నగా తన స్థానానికి పోయి కూర్చొని పనిలో మునిగిపోయింది. పోనీ మధ్యాహ్నం కలుసుకుందామనుకున్నాడు కాని కమల త్వరగా బయటి కెక్కడికోపోయి మళ్ళీ టైముకు తిరిగివచ్చి తనపని చేసుకోసాగింది. సాయంత్రానికి రఘు తన పని ముగించుకొని బయటకు నడిచాడు. అప్పటికే కమల దాటి వెళ్ళిపోబోతోంది. రఘు త్వరగా ముందుకు పరుగెత్తి "ఆగండి కమలాదేవిగారూ, ఒక్క మాట" అన్నాడు. కమల ఆగింది "నేను ఒకమారు మీకు క్షమాపణ చెప్పుకుందామని వచ్చానండి; నిన్న మా యింటివద్ద అన్నమాటలు మీ రెన్నడూ పడిఉండరు. ఆ మాటలంటూంటే నేను శిలావిగ్రహంలా ఉండిపోయాను. మీ రెంత బాధపడి ఉంటారో. నిన్న జరిగినదానికి నేను చాలా బాధపడుతున్నానండి. దాని కేవిధంగా క్షమాపణ చెప్పుకున్నా తీరదు. అయినా చెప్పుకోకుండా ఉండలేను," అన్నాడు.

కమల ఒకనిముషం మాట్లాడలేదు. అంతకు ముందు జరిగినది మళ్ళీ తలచుకుంది. కళ్లు నీళ్లు తిరిగాయి. బాధతోనే మెల్లగా అంది: "దానికేమీ అనుకోకండి మీరు. మిమ్మల్ని ఎప్పటిలాగే భావిస్తున్నాను. నాకు మిత్రులుగానే ఉంటారు మీరు. మీ భార్యగారిని కూడా ద్వేషించను. వారికి ఒక తప్పు అభిప్రాయం కలిగింది. అది మెల్లగా తొలగాలి. కాని ఒక్కసారి తొలగిపోతుందని తొందరపడడంలో నేనే పొరబాటు చేశాను. మీరేమీ బాధపడకండి, రఘుగారు. మనమీద బయలుదేరిన అపోహలు తొలగించడానికి ప్రయత్నించాము విఫలులమయ్యాము అందువల్ల ఆ అపోహలు మరింత బలపడకుండా మనం ప్రవర్తించాలి. మనం దూరంగానే ఉందాము. మన మికముందు కలుసుకోకుండా ఉంటే మంచిది. ఇలా అంటున్నానని మరోలా భావించకండి మనం మిత్రులుగానే విడిపోదాము. సెలవు తీసుకుంటాను" అంటూ చెమ్మగిలిన నేత్రాలతో కమల నమస్కరించి వెళ్లిపోయింది. రఘు తిన్నగా పార్కుకుపోయి ఆవేళకూడా బాగా రాత్రి పోయేవరకూ ఉండి మెల్లగా నడుస్తూ ఇంటికి చేరాడు. అతన్ని అంత ప్రొద్దుపోయి రావడంచూసి ఇరుగు పొరుగులవారు ఒకరి చెవు లొకరు కొరుక్కున్నారు "అక్కణ్ణించే నమ్మోయ్" అనుకుంటూ.

(ఇంకా ఉంది.)

కందసామి ★ చంద్రశేఖర్

రోజువారి బీచ్ మీటింగుకు ఆవేళ కందసామి రావటం మా మిత్రబృందాన్ని ఆశ్చర్యపరిచింది. నిన్నరాత్రి రైల్లో కొడుకు బారసాలకి చినగంజాం వెళ్ళవలసినవాడు అనుకోకుండా ఇలా ఊడిపడటం ఆపైన ఎటువంటి విచారరేఖలూ లేకుండా కళకళలాడే ముఖంతో రావటం ఇందులో విశేషం.

"ఏరోయ్, ఊరికి వెళ్ళలేదేం' అన్నాడు ప్రసాదరావు మా అందరి తరఫునా.

మా కందసామి మాతోపాటు ఒక ఎన్. జి. ఓ. ఏదో సామెత చెప్పినట్లు మా వాడికి అన్ని లక్షణాలు సలక్షణంగా ఉన్నై గాని, నత్తిమాత్రం జాస్తి మోతాదులో ఉంది. కందకు గురదలాగా మా వాడికి నత్తి స్వతస్సిద్ధంగా వచ్చి సొంతంగా ఉండిపోయింది. వాడు గోజూపడే అవస్థ చూస్తే ఎవరికైనా గుండె కరిగిపోతుంది. గులకరాళ్లు నాలిక అడుగున పెట్టుకొని బీచిలో నెలల తరబడి సాధనచేసినా నత్తి అట్లాగే నిల్చిపోయింది. ఇంతకృషికి చివరకు మిగిలింది నిరాశ. ఇక విధిలేక 'అంతా మన మంచికే' అనేఫక్కీలో రోజులు నెట్టుకొస్తున్నాడు.

మిమ్మల్ని మా వాడి నత్తితో అవస్థ పెట్టదలుచుకోలేదు కాబట్టి వాడన్న మాటల సారాంశం ఇలా నడిచింది:

"రైలు తప్పిపోయిందిరా" అన్నాడు కందసామి.

"అదేమిటిరా, నిన్న ఆఫీసునుంచి గంట ముందే బయలుదేరావుగా" అన్నాడు ప్రకాశరావు.

"ఆఫీసునుంచి నేరుగా ఫ్లవర్ బజారు వెళ్ళి పూలుకొని, తర్వాత సైనా బజారులో శ్రీమతి పంపించిన లిస్టుప్రకారం వస్తువులు సేకరించి మాంబళం రూముకెళ్ళేసరికి చీకటి పడింది. గబగబా ఇంత అన్నంతిని ఆటోరిక్షా ఒకటి చేసుకొని సెంట్రల్‌లో పడేటప్పటికి టంగున ఎనిమిది కొట్టారు."

"ఏడిసినట్లేఉంది, నీ హీరోతనం. సరిగ్గా అటు రైలు కదుల్తున్నప్పుడు ఇటు ప్లాటుఫారంమీదికొచ్చి చెంగునఎగిరి ధూమశకటారోహణంచేస్తేనే నీకు తగుతుందిగాని ఇంత తొందరేమిటి. అయినా, ఇంత ముందర వెళ్లి రైలందక పోవటమేమిటిరా" అన్నాడు శ్రీనివాసులు.

"పర్సు పిక్‌పాకెట్ అయిందేమోరా" అని రాగంతీశాడు ప్రకాశరావు.

"అబ్బ, ఉండుండిరా. వాణ్ణి చెప్పనియ్యండి. పర్సుకొట్టెయ్యటం, తర్వాత రైలుతప్పటం చాలా పాతప్లాటురా" అన్నాడు ప్రసాదరావు.

"పర్సు ఎవ్వడూ కొట్టెయ్యలేదుగాని పర్సు జేబులో వేసుకోకుండానే వచ్చానని తెలుసుకుని, ఆ ఆటోరిక్షావాడినే వెనక్కి తిప్పి రూముకెళ్ళి తిరిగి సెంట్రల్ చేరుకునేసరికి ఎనిమిదిన్నర" అన్నాడు కందసామి.

"వెరీగుడ్, నా లెక్కలో హీరోకింద జమకట్టాగాని చివరకు కళ్లు తేలేశావేమి" అన్నాడు శ్రీనివాసులు.

"మిగిలిన ఐదునిమిషాలు టిక్కెట్టు కొనటానికి సరిపోయినై" అని సాగదీశాడు కందసామి.

"ఖర్మ గామోలు" అన్నారు ఎవరో.

కందసామి ముఖం కళ మారటంలో మాకు జాలేసింది. "అయితే ఏమయింది' అన్నాం.

"ఏముంది, అప్పుడే ముంచుకుపోయినట్లు నా నత్తి ముందుకొచ్చి నుంచుంది. బుకింగ్ క్లార్కుకి చినగంజాం చెప్పేసరికి నా తల కొట్టేసినంత పనైందనుకో. మొదట్లో రెండుసార్లు 'చి చి' అన్నా. అప్పటికీ అతను శాంతంగానే విన్నాడు. మళ్ళీ రెండుసార్లు 'చి చి' అనేసరికి అతడికి విసుగు పుట్టిందనుకుంటా. 'త్వరగా తేల్చవయ్యా' అన్నాడు.

> గుమాస్తా: "సార్. ఇవ్వాళ మధ్యాహ్నం సెలవు కావాలండి. మా యింట్లో వాళ్లకి చీరలూ అవీ నాణ్యం చెయ్యడానికి బజార్లో పనుందండి."
>
> మేనేజరు: "సెలవు తీసుకోడానికి వీల్లేదు."
>
> గుమాస్తా: "చాలా సంతోషం. మీ ఋణం తీర్చుకోలేను."

కౌంటరుదగ్గర జనం అంతా గొల్లుమంది. అక్కడే ఆత్మహత్య చేసుకోవాల్సిందిగాని టైము లేకపోయింది. చివరికి రెండుచేతులూ ఒకదానిపైన ఒకటిపెట్టి 'చిన్న' అనే అర్థం తీసి, రెండుచేతులూ గంజాయితాగే పోజు పెట్టి, అతడి బుర్రలో చినగంజాం అని ఎక్కించేసరికి ఉన్న ఐదు నిమిషాలు అయిపోయినై. ప్లాటుఫారం చేరుకునేసరికి నన్నెక్కిరిస్తూ రైలు వెళ్లిపోయింది" అని ముగించాడు కందసామి.

"వెరీ సారీ, మిస్టరు కందసామీ! ఇటువంటి అన్యాయాలు జరుగుతూఉంటై. అవి దైవముచేసినతప్పులు. మానవమాత్రులం మనం చెయ్యగలిగిందేమీలేదు" అంటూ ఓదార్చాడు శ్రీనివాసులు.

"ఏడిశావు నీ సానుభూతీ నువ్వూను. ఈ పేపరుచూడు" అన్నాడు కందసామిచేతిలో పేపరు లాక్కుని చదువుతున్న ప్రకాశరావు.

"ఘోర విపత్తు. నిన్నరాత్రి రైలు బండి ఒంగోలువద్ద పట్టాలనుండి తొలగి పడిపోయింది..."

"అంతా మనమంచికే" అన్నాడు అప్పుడేవచ్చిన అప్పర్ డివిజన్ క్లార్కు అప్పలాచార్లు. ★



స్వయంవరాధికారము

ఇల్లిందల సరస్వతీదేవి

కులరూపగుణయౌవనసంపదలనుబట్టి వర నిర్ణయము చేసుకొంటే ఈ కాలము లోనే కాదు - ఏ కాలములోనయినా ఆ వివాహానికి అభ్యంతరము ఉన్నదా? తరుణీ తరుణుల మధ్య వివాహబంధ మేర్పడటానికి ఇంతకంటె విచారణీయాంశా లేముంటాయి కనుక? కాని - వీటి ఆధారముతో పరస్పరము ఆకర్షించుకొని, ప్రేమించుకన్న యువతీ యువకుల మధ్య వివాహానికి ఈ కాలములో - అందులోనూ, నాగరికతకు పేరుబడిన బ్రిటిషు దేశములో అవరోధము కలిగిందంటే ఆశ్చర్యము కలుగకమానదు.

మిస్ మార్గరెట్ బ్రిటీషు సామ్రాజ్యాన్ని ఏలుతున్న రెండవ ఎలిజబెత్ మహారాణి సోదరి-నవయౌవని. కులరూప గుణ యౌవనములచే ఆకర్షింపబడి, విమాన దళములో ఉద్యోగిగా ఉన్న కేప్టెన్ టౌన్‌సెండ్‌ను ప్రేమించి, అతనికి ప్రేమాస్పదురాలైనది. కాని మిస్ మార్గరెట్ రాచకుటుంబములో జన్మించింది కనుక ఆ కుటుంబ బాధ్యతలూ విధులూ ఆమెకు అనుసరణీయాలు. అనుశ్రుతమైన ఆచారాలు వారసత్వాధికారాలు ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఉన్నాయి.

ఇంగ్లండు చర్చికి ఎలిజబెత్ మహారాణి అధినేత్రి. విడాకు లిచ్చినవారి వివాహాలను ఆ చర్చి ఆమోదించదు. ఈ తరుణీ తరుణు లిద్దరూ మతవిషయాలలో ఇంగ్లండు చర్చి ఆధిపత్యాన్ని ఆమోదించిన వంశములోని వారు. కేప్టెన్ టౌన్‌సెండ్ తన ప్రథమ భార్యకు విడాకు లిచ్చిన యువకుడు. విడాకు లిచ్చినవారికి సివిల్ మ్యారేజి ఒకటే శరణ్యము. సివిల్ మ్యారేజి చట్టాన్ననుసరించి యీ ప్రేమికులు వివాహము చేసుకొన్నట్లయితే మార్గరెట్‌కు రాజవంశములోని అధికారాలూ హక్కులూ నశించిపోతాయి. ఉత్తరోత్తరా సామ్రాజ్యానికి అధికారము వహించవలసిన వారసులు స్త్రీగాని పురుషుడుగాని పునర్వివాహ సంపర్కములేనివారుగా ఉండాలి. ఈ కారణాలచేత వీరిద్దరి మధ్య వివాహము అనూహ్యముగా - అసంభవముగా రాజకుటుంబములోనూ, బ్రిటన్ దేశములోను భావింపబడ్డది.

ఈ తరుణీ తరుణుల వలపు వృత్తాంతమూ, మతాధికారుల బెదిరింపులూ, కన్నవారి మందలింపులూ పత్రికల కెగ్రబాకినవి. రెండు వారాల పర్యంతము ఆ జవ్వనుల చిత్రాలు వివిధ భంగిమలలో ప్రముఖ పత్రికలలో ప్రథమ పుటలలో ప్రచురింపబడుతూ వచ్చాయి. రాజకుమార్తె మార్గరెట్ ముఖము వన్నె తరగినదను వార్త వింతలూ విశేషాలుగా రూపొంది పెద్ద పెద్ద అక్షరాలలో ప్రకటింపబడుతూ వచ్చింది. కాని - వీరిద్దరి మధ్య వివాహము తటస్థిస్తుందా? రాజకుమారి రాజకుటుంబాధికారాలను వదలుకుంటుందా? ఈ రెండిటికీ సమాధానాలు పత్రికలకు లభించలేదు. ఈ ప్రధాన సమస్యకు సంబంధించిన అంశాలను ప్రకటించటానికి పత్రికలు అమితోత్సాహముతో - కుతూహలముతో కృషి చేయ నారంభించాయి. తుదినిర్ణయాన్ని తెలుసుకోవాలని తహతహ లాడిపోయాయి. కాలవిలంబనానికి ఆగలేక ఊగిపోయాయి.

తనమీదఉన్న గురుతర బాధ్యతలను నిర్వహింప బూనుకొన్న రాజకుమారి, పరిస్థితుల ఒత్తిడివల్ల, ఒక ప్రకటన చేసింది. 'సంప్రదాయాలను ఎదిరించి తానా యువకుని వివాహము చేసుకొనబోవటము లేద'ని. ఈ ప్రకటన తరువాత మతాధికారులు, కుటుంబం పెద్దలు, ప్రెస్సు ఆమె నిర్ణయానికి హర్షించి అభినందించారు. ఆ తరువాత ఆ విషయాన్ని అందరూ అంతటితో విస్మరించారు.

ఉన్నట్లుండి ఒకనాడు కేప్టెన్ టౌన్‌సెండ్ బెల్జియమునుంచి వచ్చిన వెంటనే, క్లారెన్సు భవనానికి రాజకుమారిని చూడటానికి బయలుదేరాడు. అంతవరకూ రాజకుమారి వివాహోదంతాన్ని విస్మరించి

మేష్టారు: "సోమూ! గేదె చర్మం దేనికి పనికివస్తుందిరా?"

సోము: "గేదె లోపలి భాగాలు పడిపోకుండా ఆపడానికి పనికొస్తుందండి."

నిశ్చింతగా ఉన్న విలేఖరులకు, కెప్టెన్‌ను చూడగానే కుతూహలము పునరుద్దీప్తమైనది. అతడు ఆ భవనములో అడుగుపెట్టేవరకూ వారు వెంటాడుతూనే ఉన్నారు.

కెప్టెన్ టౌన్‌సెండ్ నివసిస్తున్న గృహానికి ఎదురుగా పాకిస్థాన్ హైకమిషన్ సభ్యుని ఆఫీసుగది ఉన్నది. ఆగది కిటికీలోనుంచి చూస్తే కెప్టెన్ టౌన్‌సెండ్ ఇంట్లో ఏమి జరుగుతున్నదీ కనబడుతూ ఉంటుంది ఆగది కిటికీని ఉపయోగించుకోవటానికి అనుజ్ఞ యివ్వవలసినదని కమిషను సభ్యుని విలేఖరులు కోరారు. ఆయన దానికి సమ్మతించలేదు. గత్యంతరములేక విలేఖరులు కెప్టెన్ గృహప్రాంగణములో నివాస మేర్పరచుకొన్నారు.

ఈ విలేఖరులకు తెలియకుండా రాజకుమారి కెప్టెను ఒకరినొకరు కలుసుకోవటానికి వీలులేదు. తమకు ఏకాంతము లభ్యముకానిపరిస్థితులలో ఆ తరుణీతరుణులు తమజీవితాలలో అతిప్రధానమైన వివాహాన్ని గురించి ఒక నిర్ణయానికి రావలసిన విషమ పరిస్థితి ఏర్పడ్డది.

పత్రికా విలేఖరులు ఈ యువతీ యువకుల తాటస్థ్యాన్ని సహించుకోలేక పోయారు. కెప్టెన్ను అనేక విధాలుగా ప్రశ్నించారు. ఆయన రాజకుమారియెడ తనకున్న గౌరవాభిమానాలకొద్దీ అతి జాగ్రత్తగా సమాధానాలిస్తూ వచ్చాడు. విలేఖరులు ఎంత రెచ్చగొట్టినా ఉద్రేక రహితముగా ప్రవర్తించాడు. అతని సభ్యత రాజకుమారి ప్రశంస లందుకొన్నది.

విలేఖరులు కొందరు కెప్టెన్ టౌన్‌సెండ్ విడాకు లిచ్చిన భార్యవద్దకు వెళ్లారు. ఈ ప్రణయోదంతాన్ని గురించి ఆమెకు తెలిసినంతవరకుతమకు చెప్పమనిఅర్థించారు. ఆవిషయాన్ని గురించి ఆరువ్యాసాలు క్రమముగా వ్రాసియిచ్చినట్లయితే కోరినంత పైకము ఇస్తామని ఆమెను ప్రలోభపెట్టజూచారు. కాని - ఆమె తిరిగి వివాహము చేసుకొన్నప్పటికీ రాజకుమారి, టౌన్‌సెండులనుగురించి ఏవిధమైనప్రసంగమూ చేయ నిరాకరించింది. తుదకు ఏదో ఒకనిర్ణయానికివచ్చి తమకు తక్షణము తెలుపవలసినదని విలేఖరులు కెప్టెన్‌ను రాజకుమారిని తొందరచేశారు. ఇంతకూ చెప్పవచ్చిన విషయము - వరించి వివాహముచేసుకొనేస్వాతంత్ర్యము రాచకుటుంబాధికారాలుగల రాజకుమార్తెకు లేదని.

ఇటువంటి క్లిష్టసమస్యలు ఆ రాచకుటుంబములో క్రొత్తవి కావు. ఎనిమిదవ ఎడ్వర్డును ఎదుర్కొన్న సమస్య సరిగా ఇటువంటిదే. విడాకులిచ్చివచ్చిన యువతిని అతడు వివాహము చేసుకుంటాననన్నాడు. ప్రభుత్వమూ మతాధికారులూ ఆవివాహాన్ని ఆమోదించటానికి ఇష్టపడలేదు. ఆ యువకుడు రాజ్యాధికారాలనూ ప్రేయసినీ త్రాసులో పెట్టి తూచాడు. ప్రేయసిపై ప్రేమ అతడి మనసు మొగ్గింది. వెంటనే రాజ్యాధికారాలను పరిత్యజించి కేవలము ప్రేమికుడై ఆ కుటుంబమునుండి వైదొలగిపోయాడు.

రాజ్యాధికారాలకూ ప్రణయానికీ ధ్రువాంతరమున్నట్లు చరిత్రలో అనేకదృష్టాంతాలు సాక్ష్యమిస్తాయి. ఛాయా చంద్రగుప్తుల మధ్య ప్రణయము భగ్నమైన కారణము ఇంచుమించుగా దీనిని పోలినదే. ఛాయ సామాన్య కుటుంబములో జన్మించిన కన్య ఆమెకు సామ్రాజ్యాధీశుని వివాహమాడి పట్టమహిషికాగల యోగ్యతలేదని నిర్ణయింపబడ్డది. చంద్రగుప్తుడు ఒకప్రక్క ఛాయాదత్తమైన హృదయమూ, రెండవప్రక్క చాణక్యుని ఆదేశముల మధ్య నలిగి సంఘర్షణకు లోనైనాడు. అతడి హృదయము రాజ్యాధికారాలను కాలదన్న తలచినది కాని చాణక్యుడు అంత సులభముగా చంద్రగుప్తుని విడిచిపెట్టే గురువుకాడు. చంద్రగుప్తుని ఆధారముగా చేసుకొని, నందవంశాన్ని నాశనమొనర్చి, తన ప్రతిజ్ఞను నెరవేర్చుకోదలచిన చాణక్యుడు, ఛాయకు విషమిచ్చి, ఈ లోకమునుండే మాయముచేశాడు.

సామ్రాజ్యాధిపతులకు వరించే స్వాతంత్ర్యమే కాదు సాంసారిక జీవితానందము కూడా కొరవడుతూ ఉంటుంది. సీతమ్మ నిరపరాధి అని తెలిసిన శ్రీరామచంద్రుడు, సామ్రాజ్యపదవిలో ఉండటముచేతనే ప్రజాభిప్రాయాన్ననుసరించి నిండుచూలాలిని కారడవులకు పంపవలసి వచ్చింది

సామ్రాజ్యాధికారులకే కాదు సత్యనిష్ఠాపరులకూ సాంసారిక జీవితానికీ కూడా వైరుధ్యము కనబడుతుంది. సత్యవాక్య పరిపాలనకొరకేగా హరిశ్చంద్రుడు నడిబజారులో కులసతినీ కన్న కుమారునీ అమ్ముకొనవలసి వచ్చింది! పితృవాక్యపరిపాలనకేగా శ్రీరాముడు పధ్నాలుగు సంవత్సరాలు దండకారణ్యవాసము చేసింది!

కాని భారతరాజకన్యాలోకము స్వయంవరాధికారాలను సంపూర్ణముగా అన[illegible]చింది. రుక్మిణీదేవిని శిశుపాలుడి కివ్వవలెనని అన్న సకలప్రయత్నాలు చేస్తుండగా, ఆమె మనోగతాన్ని రాయబారముద్వారా తెలిసికొన్న శ్రీకృష్ణుడు కన్నవారి అనుమతి లేకుండా ఆమెను తన రథము మీద కూర్చుండబెట్టుకొని ద్వారకానగరమార్గాన వెళ్ళిపోతాడు.

ఒక ఉద్యోగి మేనేజరుగారికి దరఖాస్తు పెట్టుకున్నాడు: "అయ్యా, నా కీమధ్య వివాహమైనది గాన జీతము ఎక్కువ చేయించ గోరుచున్నాను."

మేనేజరుగారు జవాబు ఇలా వ్రాశారు: "ఆఫీసు బయట జరిగిన ప్రమాదములకు ఆఫీసువారు బాధ్యులుకారని తెలియజేయడమైనది"

సరిగ్గా ఇటువంటిదే ఉషా అనిరుద్ధుల ప్రణయోదంతము. ఉషాకుమారి కలలో గాంచిన రమణుని వరిస్తుంది. ఆమె ఆ యువకుని వర్ణించినట్లుగా చిత్రరేఖ చిత్రాన్ని తయారుచేస్తుంది. అటువంటి సుందరాకారుని వెదకి చెలికత్తె తీసుకొని వస్తుంది. యువతీయువకులు గాంధర్వవివాహము చేసుకొంటారు. ఆమెతండ్రి ఈ వివాహాన్ని ఆమోదించక యువకుడికి మరణశిక్ష విధిస్తాడు. కాని తుదకు ఆమెకే జయము కలుగుతుంది.

ఈ విధముగానే రాణీ సంయుక్తకూడా తండ్రిని ఎదిరించి తన హృదయసామ్రాజ్యాధీశునే వరిస్తుంది. అయితే ఈ కన్యాలలామలకు పుట్టింట బాధ్యతలు అంతగాలేవు. వారి వివాహసమస్యలు వ్యక్తిగతమైనవి. కనుకనే 'ధన్యన్‌లోకమనోభిరాము గుల విద్యారూప తారుణ్యసౌజన్య శ్రీబలదాన శౌర్యకరుణా సంశోభితు'లను వరించి వివాహము చేసుకోగలిగారు.

వివాహాలు వ్యక్తిగతములయినట్లయితే కులమత రాజకీయసాంఘికాచారాలు ప్రణయాన్ని భగ్నపరచలేవు. మానవుడు సంఘజీవి కనుక సంఘనియమాలకు ప్రణయము కూడా లోబడవలసి వస్తున్నది. సంప్రదాయాల ననుసరించేటప్పుడు వరించే స్వాతంత్ర్యానికికూడా అవధు లేర్పడుతాయి. స్వాతంత్ర్యము మానవాభ్యుదయాన్ని కోరేదయితే ఆ అభ్యుదయము వ్యక్తుల పరిస్థితుల నాశ్రయించినదవుతుంది. ★



సమయస్ఫూర్తి

ఉన్నా డొక ఊరిలోన
కన్నడనే ముసలివాడు!
అతడు పోవు దినదినమ్ము
అడవికి కట్టెలకోసం.

పట్టణమున వాని నమ్మి
పొట్ట నింపుకొనుచుండును!
ఈరీతిగ నతడు బ్రతుకు
నీడ్చుచుండె భారముగా!

ఒక రోజున ముసలివాని
ఆకలి అధికము కాగా,
కట్టెపుల్లలన్ని విరిచి
కట్టగట్టి తొందరగా

పట్టణమున విక్రయించి
పొట్ట నింపుకొనగ నెంచి
నెత్తిమీద మోపునుంచి
పత్తనమున కేగుదెంచె!

కాని, నడిచిపోవుటకై
కాళ్ళల్లో శక్తి లేదు!
పైగా తలపైన పెద్ద
బరువుమోపు ఒకటి కలదు!

అందుచేత ముసలివాడు
క్రింద వేసినాడు మోపు!
అంత నతడు విరాగిలా
అనుకొనె నీరీతిగాను!

"ఛా! ఏమిది పాడుబ్రతుకు?
చావైనా రాదుగదా!"
మృత్యుదేవ తంతలోనె
ప్రత్యక్షంబై యిట్లనె:

"ఎదురుగనే నిలచినాను
ఏల నన్ను పిలచినావు?
ముసలివాడ! తెలియలేద?
మృత్యువన్న నేనేగద!"

ముసలివాని ఒళ్ళంతా
ముచ్చెమటలు నిండిపోయె!
కాని, తెప్పరిల్లి యతడు
అనియె నిటులు మృత్యువుతో,

"ఏమి లేదు తల్లి! మోపు
ఎత్తుకొనగ లేనైతిని!
తలమీదికి మోపునెత్త
పిలచినాను నిన్ను నేను."

అటుపిమ్మట మోపునెత్తి
అదృశ్యమైనది మృత్యువు!
అసువులె కాపాడెనామె!
అదే వాని బలే యుక్తి!

అలపర్తి
వెంకటసుబ్బారావు

గేదె - తీగ

"మావాళ్ళకి పోస్తాను" అ
తడుముకోకుండా చెప్పిం
సూరమ్మ.

"నీ బుద్ధి పోనిచ్చావుకాదు. మా
వాళ్ళకే పొయ్యాలి. మీ వాళ్ళ

ఆచంట గోపాలకృష్ణ

పొయ్యటానికి వీలులేదు" అన్నాడ
సీతారామయ్య.

"మావాళ్ళకే పోస్తాను ఏ
తప్పా" అంది సూరమ్మ.

"మావాళ్ళకి పోసి యింక ఏవ
యినా మిగిలింది మీ వాళ్ళ
ముఖాన్ని తగలెయ్యి" అన్నాడ
సీతారామయ్య కొంచెం కో
స్థాయిలో.

"ముందు మావాళ్ళకి పోసి మి
లగా మీవాళ్ళకి పోస్తాను" అం
సూరమ్మ.

"అల్లా వీల్లేదు."

జీలకఱ్ఱ గూడెంలో కొత్తగా కాపరంపెట్టాడు సీతారామయ్య. తనవారన్నా, తనవారి వస్తువన్నా అమితమైన గౌరవం సీతారామయ్యకి. సూరమ్మ సీతారామయ్య భార్య. సుగుణవతి. భర్తకి అనుకూలురాలు. ఇల్లు కదలి ఎఱుగదు. ఇప్పటివారివలె సూరమ్మకి బయటకు రావడం అంటే యిష్టం వుండదు. తన భర్త మొండి పట్టుదల మనిషి అన్న సంగతి తెలిసి కూడా వివాహం చేసుకొంది సూరమ్మ. సీతారామయ్య పొలంనుంచి రాగానే వేడినీళ్లు సిద్ధపరచి సబ్బు పెట్టి వీపంతా తోముతుంది. అతని స్నానమై అన్ని పనులూ అయ్యేసరికి రాత్రి 9 గంటలు అవుతూండేది. అప్పటివరకూ సూరమ్మ మంచినీళ్ళు కూడా ముట్టుకోదు. సూరమ్మ పుట్టింటివారు ప్రక్కవీధిలోనే వున్నారు.

సీతారామయ్య కూడా సూరమ్మని ప్రేమగా చూస్తూంటాడు. సూరమ్మ ఏది కోరినా యిస్తూంటాడు. కానీ సీతారామయ్యకీ సూరమ్మకీ ఒక్క విషయంలో మాట కలవదు. సూరమ్మ వేళాకోళానికైనా అత్తారివైపువారిని ఏమీ అనకూడదు. ఆ విషయంలో భార్యను వ్యతిరేకిస్తాడు సీతారామయ్య.

సీతారామయ్య ఒకనాటి రాత్రి 8 గంటలసమయంలో పొలంపనులు అన్నీ పెందలాళ్లే పూర్తి చేసుకొని యింటికొచ్చాడు. సూరమ్మ వేడినీళ్లు పెట్టింది. సీతారామయ్య స్నానం, భోజనం పూర్తిచేసుకొని వీధిలో అరుగుమీద కూర్చున్నాడు. వంటయింటిలో పనులన్నీ పూర్తిచేసుకొని వచ్చి భర్తపక్కన కూర్చుంది సూరమ్మ.

"మనకి ఒక గేదె వుంటే బాగుండునండీ. పొలం వుంది కాబట్టి గడ్డికి కరువుండదు" అంది శాంతంగా సూరమ్మ.

"అవును. రేపు సంతకెళ్ళి కొనుక్కురావాలి. నేనూ వారం రోజులనుంచి ఆలోచిస్తున్నాను ఆ విషయంగురించి." అన్నాడు సీతారామయ్య.

"రేపు కొంటారా?" తిరిగి ప్రశ్నించింది సూరమ్మ.

"వీలునుబట్టి కొంటాను. అసలు గాడిగేదెను కొందా మనుకుంటున్నాను. మనం మేపగలమో లేదో అని సంకోచిస్తున్నాను" అన్నాడు సీతారామయ్య.

"మనం యిద్దరం, మనకి గాడిగేదె ఎందుకండీ! పూటకి మూడు తవ్వలు పాలు యిచ్చే గేదె వుంటే చాలండీ" అంది సూరమ్మ.

"సరే! యింతకీ గేదె కొంటే మజ్జిగ ఎక్కువైతే ఎవరికి పోస్తావు" అన్నాడు సీతారామయ్య.

మేనేజరు తను హాల్లోకి వచ్చినప్పుడల్లా ఉద్యోగులు లేచి నుంచోవాలని కట్టడి చేశాడు. కొత్తగా పొద్దున్నే ఉద్యోగంలోకి వచ్చిన యువకుడు అందరితోపాటు తనూ నుంచున్నాడు. అయిదు నిమిషాల తరవాత మళ్ళీ మేనేజరు హాల్లోకి రాగా మళ్ళీ నిలబడ్డాడు. మూడోసారి మేనేజరు రాగా మళ్ళీ విసుక్కుంటూ నిలబడి పక్కన ఉద్యోగిని అడిగాడు: "మన మేనేజరుగారి పేరేమిటన్నావు?"

"జనగణమన," అని సమాధానం.

"ఏం, మా వాళ్లేనా అంత తీసి పోత" అంది సూరమ్మ.

"అవును. గేదెను కొంటున్నది నేను."

"అయినా, అధికారం నాకూ వుంది."

"నీకు పీసమంతయినా లేదు" అన్నాడు సీతారామయ్య.

"ఎందుకు లేదు. మావాళ్ళూ మనుషులే" అంది సూరమ్మ. మాటా మాటా పెరిగిపోయింది. సీతారామయ్య కోపం ఆపుచేసుకో లేకపోయాడు. సూరమ్మని పట్టుకొని కొట్టాడు. ఆ రాత్రికిరాత్రే ప్రక్క వీధిలో వున్న సూరమ్మ తల్లిదండ్రు లకు అప్పగించేశాడు సూరమ్మని.

ఆలు లేదు, చూలు లేదు కొడుకు పేరు సోమలింగంట! పూర్వం యిద్దరు భార్యాభర్తలు. వాళ్ళు కాపురం వుంటున్న వాటాలో పై భాగం కేసి చూసి ఒక వెదురుబొంగు పడిపోయేట్లావుంటే భయపడి భార్య అందిట భర్తతో "ఏమండీ! రేపు మనకి అబ్బాయి పుడితే ఆ వెదురు మన అబ్బాయి ఉయ్యాలామీద పడి, గాయపడిపోతాడండీ మన అబ్బాయి" అని రాగాలు తీయ టం మొదలెట్టిందట. అప్పుడు భర్త కూడా భార్య ఏడుపుతో శ్రుతి కలిపాడట. అల్లా వుందీ మన సీతారామయ్యా, సూరమ్మల పోట్లాట!

అల్లుడు చేసినపనికి చాలా విచా రించారు సూరమ్మ తల్లిదండ్రులు. ఎటూ పాలుపోలేదు వాళ్ళకి. సూర మ్మని ఎల్లాగయినా భర్తవద్దకు పంపాలని చాలా ప్రయత్నించారు సూరమ్మ అన్నగార్లు - రాముడు, శీనయ్య. చెల్లెలంటే వారికి అపర మితమైన అనురాగం.

నాలుగు నెలలు గడిచాయి. సీతారామయ్యకి ఏమీ తోచటం లేదు. ఇల్లుఅంతా సంస్కారం లేక

వివాహ ధర్మాన్ని గూర్చి ఒకామె ఉపన్యసిస్తూ అన్నది: "భార్య అంటే సహధర్మచారిణి. నెహ్రూగారు చెప్పినట్టు సహజీవన సూత్రం మీద నే కుటుంబం ఆధారపడి ఉంది. ఇంట్లో కలతలు రాకుండా ఉండాలంటే భార్య చెప్పినట్లు భర్త చెయ్యాలి. భార్య సినిమాకి వెడదామంటే భర్త సినిమాకి వెళ్లాలి. భార్య వంట చేస్తుంటే భర్త కూడా సహాయపడాలి. భార్య అంట్లు తోముతుంటే భర్త సహాయపడాలి—"

సభికుల్లో ఒకడు - "భార్య కోపగిస్తే?" అని ప్రశ్నించాడు.

నానా చిందరవందరగానూ వుంది. భార్యను చూద్దామనో లేక ఏమి పనిమూలానో అత్తారుంటున్న వీధిలోంచి వెళ్లుతున్నాడు. అదే సమయానికి సూరమ్మ యింట్లో వుంది. రాముడు, శీనయ్య బయట డొక్కనార పేంతున్నారు. బావగారి రాకను గమనించాడు శీనయ్య.

"బావగారు యిల్లా రండి" అన్నాడు శీనయ్య.

"ఒహో బావగారా? రండి. అంత కోప మేమిటండీ?" అంటూ సీతారామయ్య వద్దకు వచ్చాడు.

"నా గొడవ మీ కనవసరం. మీ దారి మీరు చూసుకోండి" అంటూ మూతి ముడిచాడు సీతారామయ్య.

"బావగారూ అక్కడే నిలవండి. మా దారి మేం చూసుకోవటం కోసమే" అంటూ శీనయ్య వచ్చాడు సీతారామయ్య వద్దకు.

"ఏం! అంత గీరగా మాట్లాడుతున్నావు" అన్నాడు సీతారామయ్య.

"మా దొడ్లో బచ్చలతీగ మీ గేదె తినేసింది, నలుగురూ తినే తీగను మీ గేదె పాడుచేసింది. దానికి సంజాయిషీ కావాలి!" అన్నాడు శీనయ్య. రాముడికి తమ్ముడి మాటలేం అర్థం కాలేదు. అసలు బచ్చలతీగ దొడ్లో లేందే శీనయ్య ఆవిధంగా మాట్లాడటం రాముడికి ఆశ్చర్యం వేసింది.

"ఏమిటి మాట్లాడుతున్నావురా! అని సీతారామయ్య యింకా ఏమో మాట్లాడబోయాడు. శీనయ్య సీతారామయ్య దవడమీద ఒకటి గట్టిగా తగిలించాడు. సీతారామయ్య తిరిగి కొట్టబోయేటప్పటికి శీనయ్య అతని మెడలు వంచాడు. ఇంతలో రాముడు వచ్చి యిద్దరినీ విడిపించాడు. సీతారామయ్య కోపంగా వెళ్ళిపోయాడు.

సీతారామయ్య ఆలోచించాడు. గేదెను కొనా లేదు పెట్టా లేదు ఎందు కావిధంగా మాట్లాడాడు శీనయ్య? గేదె లేందే గేదె దొడ్లోకెళ్ళి బచ్చలతీగను తినటం ఏమిటి? ఏమీ అర్థం కాలేదు సీతారామయ్యకి. అయినా ఏమీ లేందే ఎందుకు తనని కొట్టాలి! వాడికి బుద్ధి వుందా! లేదా! పైగా నడివీధిలో ఏమీ లేనిదానికి దవడ మీద కొట్టాడు. "కొట్టకండి, ఈమాత్రం దానికే నన్ను కొట్టకండి" అని సూరమ్మ తను కొడుతున్నప్పుడు అంది. అవే మాటలు సీతారామయ్య చెవుల్లో గింగురుమన్నాయి. అవును తను మంచీ చెడ్డా లేకుండా ఒక్క మాటమూలాన కొట్టి వదిలేశాడు. పాపం సూరమ్మ ఎంత బాధపడిందో గింటేస్తోంటే! "మీరు చంపినా యిక్కడే వుంటాను" అని సూరమ్మ అంటూన్నా, గెంటేశాడు తను. సీతారామయ్యకి ఆలోచిస్తున్నకొద్దీ పిచ్చి ఎత్తినట్లయింది. వెంటనే అత్తారింటికి వెళ్లాడు.

"సూరీ! ఎంత పని చేశాను. ఒక మాటకోసం నిన్నుకొట్టి బాధ పెట్టాను, రా సూరీ!" అంటూ సీతారామయ్య కన్నీరు కార్చాడు.

అప్పుడు గ్రహించుకున్నాడు సీతారామయ్య. ఆ సంగతిగురించే శీనయ్యని చెడామడా కేకలెట్టారు తనూ, తల్లిదండ్రులూ కలసి.

"బావా! తెలుసుకొన్నావా!" అంటూ శీనయ్య వచ్చాడు.

"తమ్ముడూ నేను పొరపాటుగా అర్థం చేసుకొన్నాను" అంది సూరమ్మ తన భర్తను కొట్టినప్పుడు శీనయ్యని తిట్టినందుకు. తల్లిదండ్రులు ఆనందించారు. సీతారామయ్య మెచ్చుకొన్నాడు శీనయ్య తెలివితేటలకు! ★

యజమాని నౌకర్ను పిలిచి కోప్పడ్డాడు: "ఏరా, నేనేం చెప్పాను, నువ్వేం చేశావు?"

"నాకు చేతనైనంతా చేశానండి."

"ఏడిశావ్. ఇంత బుద్ధిలేని గాడిదకి పని అప్పచెబుతున్నానని ముందే తెలిస్తే నువ్వెందుకూ, ఆ పని నేనే చేసుకునే వాణ్ణిగా."

బాలసాహితి సీరియల్ ......

మార్టిన్ రాట్లర్

మూలం: ఆర్. ఎమ్. బాలన్‌టైన్

14

తరవాత కొన్ని వారాలపాటు మార్టిన్, బార్నీ సన్యాసిని అనుసరిస్తూ బోలెడు దేశం దాటారు. చివరికి అమెజాన్ నదితాలూకు ఒక ఉపనదిని సమీపించారు. అక్కడ అదృష్టంకొద్దీ ఒక వృద్ధ వ్యాపారస్థుడు వారికి తారసిల్లాడు. అతనిదగ్గర మార్టిన్, బార్నీ పనివాళ్ళుగా కుదురుకున్నారు. వారికి కొంత జీతమివ్వడానికి వ్యాపారస్థుడు ఒప్పుకుని తనతో రమ్మన్నాడు. సన్యాసి వారికి వీడ్కోలు ఇచ్చాడు. తమను ఇంతకాలం కన్నతండ్రిలాగా కాపాడిన సన్యాసిని విడిచిపోవడం వారికెంతో విచారం కలిగించింది. వెళ్ళిపోతూ సన్యాసి మార్టిన్‌కు ఒక చిన్న కోతిని, బార్నీకి ఒక శునకాన్ని బహూకరించాడు.

వ్యాపారస్థునితో కలిసి మిత్రులిద్దరూ నదిలో పడవలో ప్రయాణం చేయసాగారు. వారికి కోతి, కుక్క పెద్ద కాలక్షేపంగా తయారైనాయి. వాటి చేష్టలు చూస్తూ నవ్వుకుంటూ గడిపేవారు. వాటి రెంటికీ స్నేహం ఏర్పడింది. కోతి కుక్కని తెగ ఏడిపించేది. నేలమీదికి దిగినప్పుడు కుక్క వీపుమీదనే ఎక్కి తిరిగేది కోతి.

వృద్ధవ్యాపారస్థునికి ఇంగ్లీషులో రెండేమాటలు 'యస్', 'నో' తప్ప ఇంకేమీ రావు. అతడు పోర్చుగీసుభాష మాట్లాడేవాడు. పోర్చుగీసుభాష బార్నీకి బొత్తిగా తెలియదు. మార్టిన్ మాత్రం కొన్ని ముక్కలు ఎలా పట్టాడో పట్టాడు. అతడు వ్యాపారస్థుడికీ, బార్నీకి మధ్య తర్జుమాదారుగా ఉపయోగపడుతున్నాడు.

చాలా వారాలపాటు ముగ్గురూ నదిలో ప్రయాణం చేశారు. ప్రవాహం నిశ్చలంగా ఉన్నపోట తెడ్లు బాగా వేసి నడిపించేవారు. ప్రవాహం జోరుగా ఉన్నపోట కాలుమీద కాలు వేసుకుని కూర్చునేవారు. దోవలో అనేక గ్రామాలు, తోటలు ఎదురైనాయి. అవన్నీ గడిచి ఎట్టకేలకు అమెజాన్ మహావాహినిలో ప్రవేశించారు.

మొదటగా వారికి కనిపించింది ఒక రకమైన మొసలి. అది ఒడ్డున పడుకుని నిద్రపోతోంది. పద్దెనిమిది అడుగుల పొడవున్నది. ఈ రకం మొసలిని 'ఎలిగేటర్' అంటారు.

దాన్ని చూడగానే బార్నీ "పడవని ఒడ్డుకు పట్టించ"మని కేకవేసి వస్త్రాలు తీశాడు. వృద్ధుడు వెంటనే పడవను ఒడ్డు చేర్చాడు.

అనువాదం: నండూరి రామమోహనరావు

"కుక్కను గట్టిగా పట్టుకో. లేకపోతే అది మొసలిని లేపుతుందేమో," అని మార్టిన్‌తో చెప్పి బార్నీ ఒడ్డుకు దూకాడు. నెమ్మదిగా మొసలిని సమీపించాడు. అతడు ఎంత నెమ్మదిగా నడిచినా అడుగుల చప్పుడుకు మొసలి లేవనే లేచింది. లేచి అతి త్వరితంగా నీటిలోకి పారిపోయింది. బార్నీ దానివెంటబడి పిస్తోలు పేల్చాడు. కాని రైలుఇంజనుమీద తుపాకి పేలిస్తే ఏమాత్రం దెబ్బ తగులుతుందో, ఆమాత్రం దెబ్బే మొసలికి తగిలింది. 'ఎలిగేటర్' మొసలి శరీరం చిత్రమైనది. దాని వీపు, కడుపు, తల, తోక అన్నీ దళసరి పొరలతో కప్పబడి ఉంటాయి. ఉక్కు కవచం తొడుక్కున్నట్టు ఉండే దాని శరీరాన్ని తుపాకులు చెనకలేవు. అయినా పిస్తోలు దెబ్బకు మొసలి నిర్ఘాంతపోయింది. నీళ్ళలోకి పోగానే వెల్లకిలా పడింది. ఇది చూసి వృద్ధవ్యాపారస్థుడు నీళ్ళలోకి చొరుచుకుపోయి దాని తోక పట్టుకున్నాడు. కాని ఈలోగా మొసలి మళ్ళీ బోర్లాపడి వెనక్కి తిరిగి 'ఆ' అని నోరు తెరిచింది. బాకులవంటి దాని పళ్ళు చూడగానే వృద్ధుడు కెవ్వున కేక వేసి పీకలైనంత గబగబా బయటికి వచ్చేశాడు. మొసలి కూడా భయపడిపోయి గిర్రున తిరిగి నీటి అడుక్కి పారిపోయింది.

ప్రయాణీకులు తమ పడవలోకి చేరుకున్నారు. మారుమాట లేకుండా తిరిగి ప్రయాణం సాగించారు.

ఎలిగేటర్ అనబడేరకం మొసలికి శరీరంఅంతా అభేద్యమైనా, కంఠంవద్దనూ, కాళ్ళకీళ్ళవద్దనూ చర్మం మృదువుగా ఉంటుంది. అక్కడ దెబ్బకొడితే మొసలి చస్తుంది. ఈ సంగతి దాని గర్భశత్రువైన పెద్దపులికి బాగా తెలుసు. అది ఎప్పుడూ ఆ భాగాలనే పట్టి మొసలిని చంపుతుంది. కాని మొసలి గనుక తెలివిగా తప్పించుకుని నోరు తెరిచి పట్టుకుందా పెద్దపులి పని ఆఖరే. మొసలి నీళ్ళలో ఉన్నప్పుడు సరేసరి, ఎంత లావు జంతువైనా దాన్ని చెనకలేదు.

అమెజాన్ నది ముఖద్వారంవద్ద చూస్తే ఒక పెద్ద సరస్సులాగా, సముద్రపు పాయలాగా ఉంటుంది కాని, నది అనిపించదు. పొడవులో పెద్దదికాకపోయినా, వెడల్పులో పరిమాణంలో అంతపెద్ద నది ఇంకోటి లేదు. ఆండీ పర్వతాలలో పుట్టి, తూర్పుగా నాలుగు వేల మైళ్లు ప్రవహించి, ఉత్తరానికి తిరిగి దక్షిణ అమెరికా ఉత్తరపుకొనన అట్లాంటిక్ మహాసముద్రంలో కలుస్తుంది. ఈ దీర్ఘమార్గంలో దక్షిణఅమెరికా మధ్య భాగంలోని పెద్దపెద్ద నదులూ, వేలకొలది ఉపనదులు అనేకం వచ్చి అమెజాన్ నదిలో కలుస్తాయి. అందుచేత సముద్రంలో కలియవచ్చేసరికి అమెజాన్ బ్రహ్మాండంగా కనిపిస్తుంది. దాని ఉపనదుల్లో ఒకటైన రియోనీగ్రో పొడవు పదిహేనువందల మైళ్ళు, వెడల్పు కొన్నిచోట్ల పది మైళ్ళు కూడా ఉంటుందన్న సంగతి గమనిస్తే ఇక అమెజాన్ నది ఎంత విస్తారమైనదో గ్రహించవచ్చు. ముఖద్వారం సమీపంలో మరాజో ద్వీపంవద్ద అమెజాన్ నది రెండు పాయలుగా చీలుతుంది. ఈ రెంటిలోనూ పెద్దదైనపాయ ఒకచోట తొంభైఆరు మైళ్ళ వెడల్పున ఉంటుంది. ఈ మహాప్రవాహం ఎంత ఉధృతవేగంతో సముద్రంలోకి చొచ్చుకుపోతుందంటే, దాదాపు రెండువందల మైళ్ళవరకూ నదీజలమూ, సముద్రజలమూ కలియనే కలియవు. సముద్రజలం ఒక్కొక్కసారి ఉప్పెనగా వచ్చి నాలుగు వందల మైళ్ళదాకా నదిలోకి చొచ్చుకుపోతుంది. పెద్దపెద్ద నౌకలు సముద్రంలోనుండి నదిలోకి మూడువేల మైళ్ల దాకా పోగలవు.

ఈ విచిత్రాంశాలన్నీ మార్టిన్, బార్నీలకు ఒకచోట తటస్థపడిన స్కాచ్‌వాడు చెప్పాడు. ఆ స్కాచ్‌వాడు అక్కడే స్థిరపడి పశువుల పెంపకం వృత్తిగా పెట్టుకున్నాడు. అతనిద్వారా అమెజాన్ నది విశేషాలన్నీ విని మార్టిన్, బార్నీ విభ్రాంతులైనారు.

ఒకచోట వారు ఒడ్డుకుసమీపంలో ప్రయాణం చేస్తుండగా, నదిమీదికి వంగిన చెట్టుకొమ్మలకు ఉయ్యాలొకటి వేలాడేసి అందులో ఒక వృద్ధుడైన ఇండియను పడుకొనిఉండడం చూశారు. ఉయ్యాలకింద నీటిలో మొసళ్లు బోలెడు తిరుగుతున్నాయి. వాటిని చూసి బార్నీ "ఆ ఉయ్యాల మరొక రెండడుగులు కిందికి ఉంటే ఆ ఇండియను ఏ మొసలికో భోజనపదార్థమైపోయేవాడే" అన్నాడు.

ఈ మాట అని బార్నీ తల ఎత్తి దూరానికి చూశాడు. అలా కొన్ని సెకన్లు నిర్ఘాంతపడి చూసి సంభ్రమాశ్చర్యాలను సూచించేట్టు కేకపెట్టాడు.

(ఇంకా వుంది)

మా అన్న

మూలం : ప్రేమ్‌చంద్ అనుసరణ : వేలూరి ఉమారాణి

మా అన్నయ్య నాకన్న ఐదేళ్లు పెద్ద. అయితేనేం నాకన్న మూడు క్లాసులే యెక్కువ. నాకు అక్షరాభ్యాసం చేసిన వయస్సులోనే అతనికీ చేశారు. కానీ చదువులో అతను వెనకడుగు వేస్తున్నాడు. పునాది దృఢపరచాలన్నట్లుగా ఒక్కొక్క క్లాసులో ఒక సంవత్సరానికి బదులు రెండు సంవత్సరాలు గడుపుతున్నాడు.

నాకు తొమ్మిదో యేడు, అతనికి పధ్నాలుగు. అతని ప్రపంచంలోనికి నాకన్న ముందుగా రావటం నామీద అధికారం చూపటానికి జన్మహక్కనుకున్నాడు. నేను అతని మాట శాసనంగా పాటించాలని అతని అభిప్రాయం.

మా అన్నయ్య చాలా కష్టపడి చదివే రకం. అతనిచేతిలో పుస్తకం లేకపోవటం చాలాఅరుదు. పుస్తకం మార్జినులో అప్పుడప్పుడు పిచ్చుకలు, కుక్కలు, పిల్లులు యివన్నీ గీస్తూ ఉంటాడు. అదే అతని విశ్రాంతి సమయం అనుకోవాలి. ఒక్కొక్కప్పుడు అర్థంలేనిమాటలు వ్రాస్తాడు లేకపోతే వ్రాసిన పేరే పదిసార్లు వ్రాస్తాడు. అట్లా ఎందుకు వ్రాస్తాడో నాకర్థం కాదు. అయినా యెప్పుడూ "అదేమిటి?"అని అడిగే ధైర్యం లేదు నాలో. ఎలా చూచినా అతను ఎనిమిదో క్లాసు, నేను అయిదో క్లాసే!

నేనెప్పుడూ చదువుమీద మనస్సు నిలకడగా ఉంచలేను. పట్టుమని ఒక్కగంటైనా చదవటం అంటే నాకో గండం. కాస్త సందు దొరుకుతే చాలు ముందు ఆటకి పోవటమే పని. ఆ ఆటలోని ఆనందం కాస్తా అన్నయ్య పాడు చేస్తాడు. నేను రావటం తడవుగా నిలవేసి అడుగుతాడు. "ఎక్కడికి వెళ్లేవ"ని. నేను ఎదురుసమాధానం చెప్పలేను. మౌనమే అపరాధానికి ప్రమాణంగా తీసుకుంటాడు. అన్నగారి హోదాలో తన మామూలు ఉపన్యాసం మొదలుపెడ్తాడు. "అబ్బాయ్! ఈవిధంగా చదివేట్టయితే నీకీ జీవితమంతా పడ్తుంది ఇంగ్లీషు నేర్చుకోవటానికి. నువ్వనుకున్నంత సులువుకాదది. అలాగే అయితే యీపాటికి అందరు నేర్చుకోకపోయారా! అది నేర్చుకోటానికి నువ్వు చెమట ఓడ్చాల్సి ఉంటుంది. ఇలా చూడు! ఎప్పుడైనా నేనాడుకోటానికి వెళ్లగా చూచావా? ఇరవైనాలుగు గంటలూ చదువుకే ధారపోస్తున్నా. ఇంత చేసినా ఒక్కొక్క క్లాసు దాటాలంటే రెండు, మూడు సంవత్సరాలు పడ్తోంది నాకు. నువ్వీ అలవాట్లతో యెప్పటికీ పాస్ అవలేవు. నీకు ఆటలమీద అంత మోజుగా ఉంటే హాయిగా పోయి ఇంటిదగ్గిర ఆడుకుంటూ కూర్చో

"నీకంటె ఒకేక్లాసు ఎక్కువ అవడంవల్ల నీకు సలహా ఇచ్చే హక్కు నాకులేదని అనుకోకు. నీకంటె నేను ఐదేళ్లపెద్ద. ఒకవేళ నువ్వు ఎనిమిదో తరగతిలోకి నాతో సమంగావచ్చినా నీకంటె నేను ఐదేళ్లు పెద్దవాణ్ణే. మనల్ని పుట్టించిన దేవుడు కూడా ఆతేడా తీసెయ్యలేడు," అన్నాడు మా అన్న.

నాన్నగారి కష్టార్జితం యిలా యెందుకు పాడుచేస్తావ్?"


ఒక్కొక్కప్పుడు ఆ తిట్లకి ఏడుపు సాగిస్తా. నాన్నగారి డబ్బు నేను పాడుచెయ్యటంలేదని అనుకుంటూ ఉంటా. నా పద్ధతులు మార్చుకోవాలని నిశ్చయిస్తా. ఒక క్రొత్త టైంటేబులు వ్రాసిపెట్టుకుంటా. కానీ టైంటేబులు వ్రాయటానికీ అది ఆచరణలో పెట్టటానికీ యేమీ సంబంధం ఉండదు. రెండురోజుల్లో ఆ ఉత్సాహంకాస్త తగ్గి ఊరుకుంటుంది. మళ్ళీ యథాప్రకారం నా ఆటలూ, నేనూ. బయట సేదతీర్చే ఆ చల్లటిగాలి, పచ్చికబయళ్ళు అవి నాలో కలిగించే స్వాతంత్ర భావం, యివన్నీ అడ్డశక్యంకానివి. ఇది క్రమంగా అన్నయ్య తిట్లకి దోవతీస్తుంది. అందుకని మా అన్నయ్య నీడ చూచినా నాకు భయమే. ఆడుకుని, ఆడుకుని గదిలోకి చడీ, చప్పుడూ కాకుండా దూరుతా.

పరీక్షలు వచ్చినయ్. అన్నయ్య తప్పాడు. నేను పాసయ్యాను. ఊరికే పాసవటమేకాదు, నన్ను ఫస్టుఫారంలో వేశారు. మా యిద్దరికీ మధ్యనున్నదల్లా రెండుక్లాసులే యిప్పుడు. అన్నయ్య లెక్చర్లన్నీ అప్పజెబుదామా అన్నంత తొందర కలిగింది. కానీ చాలా చిన్నపుచ్చుకున్నాడు. అతన్ని చూస్తే నాకిలాటి ఆలోచన కలిగినందుకే సిగ్గేసింది.

రిజల్ట్సు తెలిసిందగ్గిర్నుంచి నేను మరింత ఆడుతున్నా. ఆ ఉదయం అంతా ఆడి, ఆడి వచ్చా. అన్నయ్య పిల్చాడు. "పాసయ్యామని బాగా

వీపు మీద మూపురం

ఆ స్తమానం ఏదో ఒకటి పెట్టమని వేధించే పిల్లల్ని జటకా గుర్రంలా మూతికి దాణా సంచి కట్టుకు తిరగమని కోప్పడతారు పెద్దవాళ్లు. కొన్ని గుర్రాల ముట్టెలకు దాణా సంచులు తగిలిస్తారు. బండి లాగుతూనే ఆ గుర్రం దాణా ఆరగిస్తూ ఉంటుంది. గడ్డి మొక్కా నీటిచుక్కా మచ్చుకేనా దొరకని ఎడారిలో, మనుషుల్నీ సామానులనీ మోసే ఒంటెల కెలాగో?



గోపురంలాంటి మూపురం —ఫోటో: డి. రామలింగేశ్వరరావు.

రోజుల తరబడీ, వారాలతరబడీ ఎడారిలో తిరగవలసి ఉంటుంది. అందుకని ఒంటె వంట్లో విచిత్రమైన ఏర్పాటు ఉంది. ఎడారి ప్రయాణానికి బయలుదేరే ముందది సుష్టుగా గడ్డిపరకలదగ్గరనించి, దొరికిందల్లా తినేస్తుంది. ఈ తిన్నదంతా కొవ్వుగా తయారవుతుంది ఈ కొవ్వుమూటే ఒంటె వీపుమీద మనకి కనబడే మూపురం. దాని శరీరం అవసరమైనప్పుడల్లా ఈ మూపురంలోని కొవ్వుని కరిగించుకుని వాడుకుంటుంది. ప్రయాణానికి బయలుదేరినపుడు ఎత్తుగా ఏపుగా ఉండే ఈ మూపురం తిరిగి వచ్చేసరికి కరగి అణగారిపోయి ఉంటుంది. అంటే ఆ ఒంటె ఆకలితో అపురాపురుమంటూ ఉంటుందన్నమాట. మంచినీళ్ళకి కూడా ఇలాటి ఏర్పాటు ఒకటి ఉంది. దాని శరీరంలో 8 వందల సంచులుంటాయి బయలుదేరినప్పుడు అవన్నీ నిండేటట్లు నీళ్లుతాగుతే మళ్లా వచ్చేవరకూ బెంగలేదు. మధ్య ఆసియాలో ఒక రకం ఒంటెలకు రెండు మూపురాలు ఉంటాయి. ఇవి బరువులు మోస్తాయిగాని చురుకుగా పరుగెత్తలేవు. మనుష్యులు సవారీకి వాడే ఒంటెలు సన్నగా చలాకీగా ఉంటాయి. అవి చాలా వేగంగా వెళ్తాయి.

★ మా అన్న ★

గర్వం తక్కించే! నీ మంచికే చెబుతున్నా విను. గర్వం సర్వనాశనానికి కారణం. అదెంత చెడ్డదో తెలుసా? మహా మహా రాజుల్నే లొంగదీసింది. ఎప్పటికైనా నగే సామాటలు గుర్తుపెట్టుకో. ఇదేదో కాకతాళీయంగా ప్యాసయ్యావు. ఈ శాస్త్రకే నువ్వేదో చాలా ఘనుడవనీ, చదివినా, చదవకపోయినా నెగ్గగలమనీ భ్రమపడకు.

తప్పినవాడు వీడేమిటి నాకు నీతులు చెప్పేది అనుకుంటావేమో. నా క్లాసులోకి వస్తేగాని తెలియదు నీకు ఎనిమిదో క్లాసులోంచి పై క్లాసులోకి పోవటం యెంతకష్టమో. ఇక్కడ ఆల్జీబ్రా, జామిట్రీ, ఇంగ్లీషు, హిస్టరీ యివన్నీ చదవాలి. ఆ యింగ్లీషు రాజుల పేర్లు గుర్తుపెట్టుకోటం కూడా కష్టమే. అందులో కొన్ని వందల హెన్రీలు, విల్లియమ్లు ఉన్నారు. అర్థం లేని పేర్లు! బహుశః వాళ్ళకి పేర్లేమీ దొరక్క ఇలా రెండవ హెన్రీ, మూడవ హెన్రీ అని పెట్టుకుని ఉంటారు. ఏ హెన్రీకాలంలో యే పని జరిగిందో గుర్తుపెట్టుకోటం యెంత కష్టమో తెలుసా? యేడవ హెన్రీకి బదులు ఎనిమిదవ హెన్రీ అంటే చాలు, సున్నా మార్కులే.

జామిట్రీ అంటే ఒక పెనుభూతం అనుకో. ఎ, బి, సి కి బదులు ఎ, సి, బి అని వ్రాశావనుకో. ఆఖరు. ఇంతా చేస్తే ఆ తేడా యేమిటో ఈ ఎగ్జామినర్లని అడగాలనుకుంటా. లేకపోతే చిలకలకు మల్లే మనం అన్నీ కంఠస్థం చెయ్యాలని వీళ్ళ ఉద్దేశ్యమేమో. ఇంగ్లీషు కాంపోజిషను తీసుకో. 'క్రమపద్ధతి'ని గూర్చి నాలుగు పేజీలకి తక్కువ కాకుండా వ్యాసం వ్రాయమంటారు.—నాలుగు పెద్ద తావు పేజీలు తెలుసా? 'క్రమపద్ధతి' మంచిదని యెవరికి తెలియదు? ఒక్క వాక్యంలో చెప్పేదానికి నాలుగు పేజీలు నింపమనట మేమిటి? పైనేమో సంగ్రహంగా వ్రాయమంటాడు. నాకు వాళ్ళ పద్ధతేమీ అర్థంకాదు. త్వరగా, నెమ్మదిగా పరుగెత్తు అంటే యెలా ఉంటుందో యిది కూడా సరిగ్గా అల్లాగే ఉంది. కాని వాళ్లు పరీక్షాధికార్లు. వాళ్లు చెయ్యమన్నట్లు మనం చెయ్యాలి అంతే.

అందుకని ఎనిమిదో తరగతిలోంచి బయటపడటం మాటలుగాదు. ఈసంవత్సరం ప్యాసయ్యాంగదానని పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకు. తప్పినా, నాకు నీకన్న యెక్కువ తెలుసు. ఇప్పటినుంచైనా నే చెప్పినట్లు జాగ్రత్తగా నడుచుకో. తరువాత యేడ్చి లాభం లేదు."

అన్నయ్య చెప్పిందంతా ఓపిగ్గా విన్నా. కాని యీ లెక్చర్లు యిప్పటికి యెన్నోసార్లు విన్నా. అందుకని దాన్లో పస తగ్గిపోయింది. బడి గంట కొట్టారు, ఎవరిదారిన వాళ్లం వెళ్లాం. ప్యాసయినా యిలా చీవాట్లు

కాలేజీ ప్రిన్సిపాల్ దగ్గిరికి ట్యూటర్ ఉద్యోగంకోసం ఒక యువకుడు వెళ్లాడు. ప్రిన్సిపాలు ఉత్సాహంగా తన శక్తి సామర్థ్యాల్ని గురించి చెప్తున్నాడు:

"నేను క్లాసులోకి అడుగు పెట్టినదగ్గిర్నించి పీరియడ్ అయిపోయేదాకా ప్రతివిద్యార్థి బెంచీలకు అంటుకుపోయేట్టు చేస్తాను."

యువకుడు: "అవునండి. అలా చెయ్యడమే మంచిదండి. లేకపోతే కనీసం ముప్పాతిక మందైనా కిటికీల్లోంచి దూకి పారిపోతారు."

ఆ యువకుడు మరో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకోవలసి వచ్చింది.

పెడుతూంటే ఇక తప్పితే ఎలా ఉండేదో నా పని భగవంతుడికే తెలియాలి. ఒకటిమటుకు నిజం. అన్నయ్య చిత్రించిన ఎనిమిదో తరగతి తల్చుకుంటే కాళ్లల్లో వణుకొస్తోంది. ఇంటికి పారిపోకుండా యింకా బళ్లో ఎలా ఉన్నానా అనిపిస్తోంది.

అన్నయ్య ఎన్ని దెబ్బలు కొట్టినా నాలో ఏమీ మార్పు రాలేదు. ఎప్పుడో తప్పనిసరిఅయితే చదవటం, మిగతా టైం అంతా ఆడుకోటమే.


మళ్ళీ పరీక్షలు వచ్చినయ్. క్రిందటి యేడాది మాదిరే మళ్ళీ నన్ను విజయలక్ష్మి వరించింది. అన్న మళ్ళీ తప్పాడు. నిజంగా యీ సంవత్సరం అతను మరీ కష్టపడి చదివాడు. రాత్రి పది గంటల దాకా చదివి మళ్ళీ తెల్లవారుఝామున నాలుగు గంటలకే లేచేవాడు. నాకు చాలా విచారం కలిగింది. రిజల్ట్సు తెలియంగానే మా అన్నయ్య ఆగలేకపోయాడు. బాగా యేడ్చాడు. నాకూ దుఃఖం ఆగలేదు.

మా యిద్దరికీ మధ్య మిగిలింది యిప్పుడు ఒక్క క్లాసే. అన్నయ్య యీసారి కూడా తప్పుతాడేమో ననిపిస్తుంది. అప్పుడు యిద్దరం ఒక్క క్లాసులోనే ఉంటాం. ఏం ఆలోచన! ఎంత నిర్దయ! కాని అప్పుడు నామీద ధిమాకీ చెయ్యలేడు. ఏమో ఎప్పుడూ అట్లా రాపాడటం వల్లే చదివి ప్యాసవగలుగుతున్నానేమో. అట్లా యెందుకు అనుకోకూడదు ?

మొన్న పరీక్షల్లో తప్పిన దగ్గిర్నుంచీ అన్నయ్యకు మరీ చిన్నతనంగా ఉంది. అవకాశం చిక్కినా కూడా నన్నేమీ అనకుండా వదిలేస్తున్నాడు. నా యిష్టమే ఇష్టంగా ఉంది. ఎప్పుడూ ఆటలే. ఈమధ్య ఒక క్రొత్త ఆట మొదలుపెట్టాం, గాలిపటాలు ఎగరవెయ్యటం. దాదాపు రోజంతా ఎగరవెయ్యటానికి, వెతికిపట్టుకురావటానికీ సరిపోతోంది. అన్నయ్య ఎక్కడ చూస్తాడోనని భయంగానే ఉంది. దొంగతనంగానే ఎగరేస్తున్నా.

ఓ రోజు సాయంత్రం హాస్టలు అవతల గాలిపటం వెనకాల పరుగెత్తున్నా. పిచ్చికుక్కకుమల్లే పరుగెత్తున్న నన్ను గట్టిగా పట్టుకున్నాడు. "ఇట్లా వీధుల్లో అడ్డమైన పిల్లలతో గంతులు పెట్టటం చాలా సిగ్గుపడవలసిన విషయం. నీకేమీ ఆత్మ గౌరవం ఉన్నట్లు లేదు. ఒకప్పుడు ఎనిమిదో క్లాసు ప్యాసయి తాసిల్దారు చేసినవాళ్లున్నారు. ఇప్పటికీ చాలామంది డిప్యూటీ కలెక్టర్లుగా, సూపరింటెంట్లుగా పనిచేస్తున్నారు. నీకంటే ఒకే క్లాసు ఎక్కువ అవటంవల్ల ఇక నీకు సలహా నిచ్చే హక్కు నాకు లేదని అనుకోకు. నీకంటె నేను ఐదేళ్లు పెద్ద. ఒకవేళ నువ్వు ఎనిమిదో తరగతిలోకి నాతో సమంగా వచ్చినా నీకంటె నేను ఐదేళ్ళు పెద్దవాణ్ణే. మనల్ని పుట్టించిన దేవుడు కూడా ఆ తేడా తీసెయ్యలేడు. నువ్వు బి. ఏ. ప్యాసవుతావనుకో, అయినా నేను నీకంటె ఐదేళ్లు పెద్దవాణ్ణే.

జాగ్రత్తగా విను నాయనా! ప్రపంచంలో పుస్తకాలన్నీ కలిసినా అనుభవానికి చాలవు. అమ్మను చూడు! ఆవిడ బడి అంటే ఏమిటో యెన్నడూ ఎరగదు. నాన్నగారు అయిదో తరగతికన్న యెక్కువ చదవలేదు. అయితేనేం, వాళ్ళ తెలివితేటలు మనకు వస్తయ్యా? అమెరికాలో యెవరు పరిపాలిస్తున్నారో, ఎనిమిదవ హెన్రీ ఎన్ని పెళ్ళిళ్లు చేసుకున్నాడో, ఆకాశంలో నక్షత్రాలెన్ని ఉన్నయ్యో ఇవేవీ వాళ్లకు తెలియకపోవచ్చు. కాని యింతకన్న యెన్నోరెట్లు విలువైన విషయాలు వాళ్లకి అనుభవంవల్ల తెలుసు. నువ్వెప్పుడు జబ్బు పడ్డా వనుకో నాన్నగారికి టెలిగ్రాం యివ్వటం తప్ప నీకేమీ తెలియదు.



హంపీక్షేత్రంలో విజయనగర సామ్రాజ్యంనాటి రాతిరథం

—ఫొటో: వి. కేశవశర్మ.

★ మా అన్న ★

నీస్థితిలో ఉంటే ఆయన ఆ పనే చేస్తారా? ఎన్నటికీ చెయ్యరు. ముందా జబ్బేమిటో తెలుసుకోవటమో, డాక్టర్ని పిలవటమో చేస్తారు. మనమాదిరి మనస్సు పాడు చేసుకోరు. ఆయన తొమ్మండుగురు గల కుటుంబాన్ని నిర్వహిస్తున్నారు. అది మరవకు. అదికూడా ఆయన జీవితంలో చాలాభాగం మనం స్కూల్లో చేసే ఖర్చులో సగం సొమ్ముతో యీ సంసారాన్ని పోషించారు. నీ జీవితాన్ని నీ విలా పాడు చేసుకోవటం నేను చూచి సహించలేను. నాతో సమంగా చదువు నీకూ వచ్చునన్నమాట మర్చిపో. నేను నీ అన్నని."

నన్ను చూస్తే నాకే సిగ్గేసింది, అన్నయ్యను నిర్లక్ష్యం చేశాననే అభిప్రాయం కలిగించానేమో నని. వినయంగా అన్నాను "నువ్వు చెప్పినదంతా నిజమే అన్నయ్యా! నీ యిష్టప్రకారం నా శాయశక్తులా కష్టపడి పైకి వస్తా"

అన్నయ్య నన్ను గట్టిగా కౌగలించుకున్నాడు. అతని చెంపల మీదుగా కన్నీళ్ళు జారినయ్. "నీ గాలిపటాల ఆట చెడగొట్టటం నా కిష్టంలేదు. నాకే యెగరవెయ్యాలని ఉంది. నేనే యిలా ఆడుకుంటే నిన్ను అదుపులో పెట్టటం ఎట్లా? అలా చెయ్యలేనినాడు నేను నా విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చటం లేదన్నమాట." సరిగ్గా అదే సమయానికి మా తలలమీదుగా ఒక గాలిపటం ఎగురుతోంది దానికో పెద్ద దారం ఉంది. అన్నయ్య యెగిరి దాన్ని పట్టుకుని హాస్టలు వైపుకు పరుగుతీశాడు. అతని వెనకాలే నేనూ పరుగెత్తా. ★

గుణపాఠం

శంకరం సంగతి మీకు తెలుసో తెలియదో కాని వాడంతటి అల్లరివాడూ లేడు- తెలివైనవాడూ లేడు. క్లాసులో అందరిలోకల్లా అల్లరిచేసేదీ వాడే - అందరిలోకల్లా ఫస్టు మార్కులు తెచ్చుకొనేదీ వాడేనంటే మీకందరికీ ఆశ్చర్యంగా ఉండికదూ? నిజమే మరి. సాధారణంగా అల్లరిచేసే పిల్లలు సోమరులై సరిగ్గా చదవరనికదూ వాడుక. అందుకనే మీకు ఆశ్చర్యంగా ఉంటుంది. శంకరంలోవున్న ఈ ప్రత్యేకతకు మాస్టార్లు కూడా ఆశ్చర్యపడేవారు. దాంతో శంకరం ఎన్ని అల్లరి పనులుచేసినా వరిసి పోతుండేది. శంకరం అల్లరి చిల్లరి పనులవల్ల అవమానం పొందిన మాస్టార్లు వాడికి గుణపాఠం చెప్పాలని ప్రయత్నించారు. కాని, అదేం సాగనివ్వలా శంకరం. శంకరం ఆ తరగతి కంతకీ నాయకుడయ్యాడంటే- వాడి శక్తిసామర్థ్యాలగురించీ తెలివితేటల్నిగురించీ ఇంక చెప్పాల్సిం దేముంది.

ఒకరోజు ఏమైందనుకున్నారూ, మామూలుగా ఆ పిరియడ్ మాస్టారు వచ్చి కుర్చీలో సరిగ్గా కూర్చున్నారో లేదో 'ఫాం'అన్న శబ్దంతో మాస్టారు అదిరిపడి, కంగారుగా కుర్చీలోంచి లేచి అమాంతంగా ఒక్క గంతేసేప్పటికి, ఖర్మంచాలక ఓ కాలు అరటితొక్కమీద పడడం, జర్రున జారి క్రిందపడడం అన్నీ ఒక్క క్షణంలో జరగడంతో క్లాసులోని పిల్లలు గొల్లుమన్నారు. "అయ్యో...పాపం!.....పడ్డారా మాస్టారూ" అంటూ శంకరం మాస్టారికి చేయూత ఇచ్చి లేవదీశాడు.

పిల్లల పకపకలు మాస్టార్ని పిచ్చెక్కించినంత పని చేశాయి. ఆయనముఖం కందగడ్డలాఅయింది. కళ్లు కూడా ఎర్రబడ్డాయి. ఒక్క నస్యం పట్టు గట్టిగా ముక్కుపుటాల్లోకి దట్టించి, పేకబెత్తం చేతిలోకి దీసికొని, పళ్లు పటపట కొరుకుతూ, "ఎవరీపని చేసింది...ఊఁ...చెప్పరేం రా!" అంటూ గుర్జురిమారు!

సింగరాజు లింగమూర్తి

మాస్టారి నరసింహావతారం చూసి అంతా గప్‌చిప్‌గా కూర్చున్నారు.

"నేనిట్టా అవుతుం దనుకోలేదు మాస్టారూ! - తమాషాకని సైకిలు హారన్ తీసి మీరు వచ్చేముందు కుర్చీలో పెట్టాను"అంటూ శంకరం చేతులు ముడుచుకుని నిలబడ్డాడు.

"ఓరి పిడుగా - నీవేనా? పైగా ఓదారుస్తూ లేవదీశావే?..తమాషా చూద్దాం అనుకున్నావా తమాషా? నాతో నీకు తమాషాలటరా? పట్టు......చెయ్యి పట్టు" అంటూ ఛెళ్లు ఛెళ్ళున రెండేసి దెబ్బలు వడ్డించి, 'స్టాండు ది బెంచి' అన్నారు మాస్టారు. 'అలాగే సార్' అంటూ శంకరం వచ్చి, 'ఒరేయ్ విశ్వం... శాస్త్రీ నువ్వుకూడా సాయంచేయరా బెంచీ ఎత్తడానికి' అన్నాడు. శంకరం, చరచర విశ్వం, ఇద్దరూ బెంచీని పైకెత్తి నిలబడ్డారు. క్లాసులో పిల్లలంతా మళ్లీ గొల్లుమని నవ్వారు. మాస్టారికోపం మరి మూడింతలైంది.

"ఉండండి హెడ్ మాస్టారిని పిలుచుకొచ్చి మీ రోగం కుదిరిస్తా"నంటూ గోచి సర్దుకొని తలపాగా, కోటూ సవరించుకొంటూ చకచక వెళ్లబోయేప్పటికి కాలు బెణికిందేమో తొందరగా నడక సాగనివ్వలేదు. అట్లాగే కాలు పట్టిపట్టి వేస్తూ వెళ్లారు. "హెడ్ మాస్టారు వచ్చి, పేకబెత్తంతో అందరికీ తలోటి వడ్డించుతారేమో" అనుకున్నారు పిల్లలంతా-ఇంతలో హెడ్మాస్టారు రానేవచ్చారు-పేకబెత్తంతో. అప్పటికికూడా శంకరం, విశ్వం ఇద్దరూ బెంచీ పైకెత్తి పట్టుకునేవున్నారు. "ఏమిటిదంతా?" అని గర్జించారు హెడ్మాస్టారు. ఎవరూ కిక్కురుమన లేదు. "మాస్టారు స్టాండు ది బెంచి అన్నారు సార్-అందుకని" అంటూ శంకరం ఇంకా చెప్పబోతుండగానే హెడ్మాస్టారికికూడా పట్టరానినవ్వు వచ్చింది. కానీ, అది పైకి పొక్కనీయకుండా, "చాలెండి! బెంచీదించి కూర్చోండి" అన్నారు. కొడతారనుకున్న హెడ్మాస్టారు కాస్తా నవ్వుకుంటూ, క్లాసులోంచి వెళ్లిపోయారు. మాస్టారు తెల్లముఖం వేసి, హెడ్ మాస్టారు వెళ్లినవంకే చూస్తూ నిలబడేప్పటికి "మాస్టారూ కాలు బెణికిందా?"అని పరామర్శించాడు శంకరం. క్లాసులో మళ్లీ నవ్వులు ప్రారంభమైనాయి. శంకరం పరామర్శ, పిల్లల నవ్వులు తుండు

గుణపాఠం

విరాదకారం చల్లినట్టయింది మాస్టారికి. తనను నలుగురిలో యెద్దేవా చేయడానికే శంకరం అలా కొంటెగా అడిగాడనుకున్నారు మాస్టారు. ఆ సమయంలో ఎవరైనా అలాగే అనుకుంటారు. కాని శంకరం మాత్రం 'పాపం, మాస్టారికి దెబ్బ తగిలిందే' అన్నభావంతో నేపరామర్శించాడు.

మాస్టారు ఒకసారి గుడ్లురిమి, జాగ్రత్తగా ఒకసారి కుర్చీవంక చూసుకొని కూర్చున్నారు. రెండు మూడు నిమిషాలు గడిచాయి.

"ఒరేయ్ శంకరం-ఇలా రా' అని మాస్టారు పిలిచారు. ఆ పిలుపులో కటుత్వం లేదు. ఆయనముఖం కూడా ప్రశాంతంగా వుంది. ఇంతసేపూ పిల్లలంతా అల్లరి చేస్తున్నా ఏమీ మాట్లాడకుండా చూస్తూ కూర్చున్న మాస్టారు ఉండి ఉండి శంకరాన్ని దగ్గరికి రమ్మని పిలచేప్పటికి ఏమి జరుగుతుందో అనుకున్నారు కొందరు. శంకరాన్ని చావకొట్టి చెవులు మూస్తారనుకున్నారు కొందరు. శంకరం మాత్రం ఏమనుకున్నాడో యేమో కాని కిమ్మనకుండా మాస్టారిదగ్గిరికి పిలవంగానే వెళ్ళి నిలబడ్డాడు.

"నీకు ఫుట్ బాల్ ఆడటం వచ్చుకదరా శంకరం?" అని మాస్టారు నవ్వుతూ అడిగేప్పటికి శంకరానికి ఎక్కడలేని ఆశ్చర్యం,సిగ్గూ వేసింది. "మాస్టారెంతో కోప్పడి కొడతారనుకున్నాడు తను. కాని ఇలా నవ్వుతూ మాట్లాడుతున్నారే! అందులో ఈ మాస్టారికి ఫుట్ బాల్ ఆటసంగతెందుకు?" అని ఆలోచిస్తున్నాడు శంకరం.

"ఏంరా మాట్లాడవేం? ఫుట్ బాల్ ఆడటం వస్తుందికదూ?" అని మాస్టారు మళ్ళీ అడిగేప్పటికి వస్తుందన్నట్లుగా తలూపాడు శంకరం. "హైజంప్ కూడా చేస్తావుకదూ?" అన్నారు మాస్టారు.

'ఏమిటీ ప్రశ్నలు - ఎందకూ అడుగుతున్నారు' అనుకుంటూనే మాస్టారువంక చూస్తూ నెమ్మదిగా 'అవునండీ' అన్నాడు శంకరం.

"ఆటలోనైనా, దూకడంలోనైనా పడిపోతావనుకో - అప్పుడే మౌతుంది? కాలికి దెబ్బతగలదూ? అని మాస్టారనేప్పటికి శంకరానికి వెనుక తను ఫుట్ బాల్ ఆడుతూ పడిపోవడం, కాలికి దెబ్బతగలడం, కాలు బెణికి మూడు నాలుగు రోజులు చాలా బాధపడి కుంటుకుంటూ నడవడం అంతా జ్ఞాపకం వచ్చి, "నిజమే మాస్టారూ... దెబ్బ తగిలి చాలా బాధ పెడుతుంది" అన్నాడు. "అప్పుడు నిన్ను చూసి నవ్వితే నీకెలా వుంటుంది?" అన్నారు మాస్టారు. ఇక శంకరం ఏమీ మాట్లాడలేకపోయాడు.

'మాస్టారు ఎంత చక్కగా గుణపాఠం చెప్తున్నారు. తను సైకిల్ హారన్ కుర్చీలో పెట్టకుండావుంటే మాస్టారు ఎగిరి గంతేసేవారు కాదుగా. ఎగిరి గంతెయ్యబట్టేగా కాలు అరటిపండు తొక్కమీద పడి జారి క్రింద పడింది' అనుకుంటున్నాడు శంకరం.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నారు మాస్టారు. శంకరం ఏమీ మాట్లాడలేక తల వంచుకున్నాడు.

"పిచ్చివాడ-నీవు చేసిన పనిని గురించే ఆలోచిస్తున్నావుకదూ.. నాకిప్పుడు కాలు బెణికిందేఅనుకో- అది తగ్గక చాలా బాధపెట్టి కాలు సగంవరకు తీసివేయాల్సి వస్తుందనుకో - అప్పుడు నేను ఉద్యోగం ఎలా చేయగల్గుతాన్నా?" అని మాస్టారు ఇంకేమో చెప్పబోతుండగానే శంకరం కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. వాడి హృదయం పశ్చాత్తాపంతోనూ సిగ్గుతోనూ కుతకుతలాడింది.

"క్షమించండి మాస్టారూ - ఇంకెప్పుడూ ఇటువంటి అల్లరి పనులు చేయను" అంటూ లెంపలు వేసుకున్నాడు. ఇంతలో గంటకొట్టడంవల్ల బడి వదిలారు. ఆ రోజునుంచీ శంకరం స్కూలు జీవితంలో ఎప్పుడూ అల్లరివాడనిపించుకోలేదు. తోటి విద్యార్థులకు అన్నిటా ఆదర్శప్రాయుడైనాడు. చూశారా? చిత్రం!

తండ్రి చిన్నకొడుకును వెంటబెట్టుకుని జంతుప్రదర్శనశాలకి తీసుకువెళ్ళి వింత జంతువులన్నిటినీ చూపిస్తున్నాడు. కొడుక్కి ఏదో భయంకరమైన ఆలోచన వచ్చి నిలబడిపోయాడు:

"నాన్నా! ఆ సింహం బోనులోంచి తప్పించుకుని బయటికొచ్చి నిన్ను మింగేస్తుందనుకో. అప్పుడు మనింటికి ఏ నంబరు బస్సులో వెళ్లాలో ఎలా తెలుస్తుంది నాకు?"

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika
... Editor S. Sambhu Prasad.